PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 42 సంచిక : 298 | విజయవాడ, బుధవారం 31 మే 2023 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Wednesday 31 May 2023 | Rs

శాంతిని పునరుద్ధరించకపోతే పతకాలు వెనక్కి..

- అమిత్ షాకు మణిపూర్ క్రీడాకారుల హెచ్చరిక

లోపలి పేజీలో..

కార్ల్‌సన్‌కు గుకేశ్ ఝలక్

- నార్వే బ్లిట్జ్ చెస్ టోర్నమెంట్



ఓస్లో: నార్వే బ్లిట్జ్ చెస్ టోర్నమెంట్‌లో భారత యువ గ్రాండ్‌మాస్టర్ డి. గుకేశ్ సంచలనం నమోదు చేశాడు. సోమవారం జరిగిన 9వ రౌండ్ పోటీలో గుకేశ్ 97 ఎత్తుల్లో ప్రపంచ ఛాంపియన్ మాగ్నస్ కార్ల్‌సన్‌ను ఓడించాడు. ఓటమి అనంతరం కార్ల్‌సన్.. గుకేశ్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపాడు. దీంతో 9వ రౌండ్ పోటీ అనంతరం నోడెర్బెక్(ఉజ్బెకిస్తాన్ - 6పాయింట్లు) అగ్రస్థానంలో ఉండగా.. కార్ల్‌సన్(నార్వే) 4.5పాయింట్లతో 7వ స్థానంలో , గుకేశ్ 2.5పాయింట్లతో 9వ స్థానంలో కొనసాగుతున్నారు.

ప్రాణ సమానమైన పతకాలు గంగలోకి..!

- హరిద్వార్ వద్ద విసిరేసేందుకు ప్రయత్నం
- ఓదార్చి ఐదు రోజుల సమయమిద్దామన్న రైతు సంఘాల నేతలు
- మెడల్స్ నరేష్ టికాయత్‌కు అప్పగించిన రెజ్లర్లు
- న్యాయం దక్కేదాకా తగ్గేదేలేదని ప్రకటన
- ఇండియా గేట్ వద్ద ఆమరణదీక్షకు నిర్ణయం
- రెజ్లర్ల పట్ల వ్యవహరించిన తీరు బాధ కలిగించింది: అనిల్ కుంబ్లే



హరిద్వార్ జిల్లాలో గంగా నది తీరాన కన్నీటి పర్యంతమైన రెజ్లర్లు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

దేశంలోని అగ్రశ్రేణి రెజ్లర్లు తమ పోరాటాన్ని మరింత ఉద్ధతం చేస్తున్నారు. విశ్వ క్రీడా వేదికలపై అత్యంత ప్రతిభ కనబర్చి సాధించిన ప్రాణ సమానమైన పతకాలను, అవార్డులను గంగా నదిలో కలిపేందుకు దిగ్గజ రెజర్లు వినేష్ ఫోగట్, సాక్షి మాలిక్, భజరంగ్ పునియా, సంగీతా ఫోగట్ తదితరులు మంగళవారం ప్రకటించారు. హరిద్వార్ చేరుకొని మంగళవారం సాయంత్రం 6 గంటల ప్రాంతంలో పతకాలను గంగా నదిలో కలిపేందుకు యత్నించగా, ఆ సమయంలో అక్కడికి చేరుకున్న రైతు సంఘాల నాయకులు జోక్యం చేసుకొని రెజ్లర్లను వారించారు. కీచకుడైన రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షునిపై చర్యకు కేంద్ర ప్రభుత్వానికి ఐదు రోజులు గడువు ఇచ్చి చూద్దామని, అప్పటి వరకు ఓపిక పట్టాలని కోరారు. దీంతో రెజ్లర్లు తమ పతకాలను గంగా నదిలో కలిపే ఆలోచనను విరమించుకుని బికెయు నాయకుడు నరేష్ టికాయత్‌కు వాటిని అప్పగించారు. పతకాలు పట్టుకొని గంగా నదీ వైపు వెళ్తున్న సమయంలో తీవ్ర భావోద్వేగానికి గురైన రెజ్లర్లు కన్నీరు మున్నీరయ్యారు. క్రీడల్లో రాణిద్దామని కోటి ఆశలతో అష్టకష్టాలు పడివచ్చిన మహిళా క్రీడాకారులపై ఆంబోతుల్లా లైంగిక దాడులు చేస్తున్న దుర్మార్గుణ్ణి కేంద్ర ప్రభుత్వం కాపాడుతోందని, న్యాయం కోసం పోరాడుతున్న తమపై తీవ్ర అణచివేతకు పాల్పడుతున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొందరు తమను చంపేస్తామంటూ బెదిరింపులకు దిగుతున్నారని వారు పేర్కొన్నారు. అలాంటప్పుడు ప్రాణాలను ఒడ్డి విశ్వవేదికలపై సాధించిన ఈ పతకాలకు ఇక విలువేముందని రెజ్లర్లు కంటతడి పెట్టారు. వారి కుటుంబ సభ్యులు, రైతు సంఘాల నాయకులు రాకేష్ టికాయిత్, నరేష్ టికాయిత్ తదితరులు వారిని ఓదార్చారు. ఈ సందర్భంగా రెజ్లర్లు మాట్లాడుతూ న్యాయం కోసం పోరాడుతున్న తమపై కేంద్ర ప్రభుత్వం తీవ్ర అణిచివేతకు పాల్పడుతోందని, అయినా తాము బెదిరిపోమని పోరాటమార్గాన్ని వీడే ప్రసక్తే లేదని తెలిపారు. ఇండియా గేట్ వద్ద ఆమరణ నిరహార దీక్ష చేపడుతామని హెచ్చరించారు. 'మా పోరాటానికి కేంద్ర ప్రభుత్వం విలువనివ్వడం లేదు. ఇక ఈ పతకాలు, అవార్డులు మాకెందుకు? గంగలో కలిపేస్తాం. ప్రాణ సమానమైన

మిగతా 7లో



5 నుంచి ఆందోళనలు

- ఫ్యాప్టో నేతల వెల్లడి
- ఉపాధ్యాయ, ఉద్యోగ సమస్యలపై సమరం

మంగళవారం విజయవాడలో కార్యాచరణ ప్రణాళికను ప్రకటిస్తున్న ఫ్యాప్టో నాయకులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఫ్యాప్టో ఛైర్మన్ ఎన్ వెంకటేశ్వర్లు, సెక్రటరీ జనరల్ చెన్నుపాటి మంజుల డిమాండ్ చేశారు. ఈ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జూన్ 5 నుంచి సెప్టెంబరు 1 వరకు పలు పద్ధతుల్లో ఉద్యమించనున్నట్లు వెల్లడించారు. ఎపిటిఎఫ్ రాష్ట్ర కార్యాలయం చెన్నుపాటి సింగరాజు భవన్‌లో మంగళవారం వారు విలేకరులతో మాట్లాడారు. విద్యారంగ సంస్కరణల పేరుతో ప్రభుత్వం అమలు చేస్తున్న జిఓ 117 వల్ల వేలాది ఉపాధ్యాయ పోస్టులు తగ్గించడంతోపాటు పాఠశాలల విలీనం జరుగుతుందని తెలిపారు. బోధనేతర పనులతో ఉపాధ్యాయులను బోధనకు దూరం చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ జిఓను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పాఠ్యపుస్తకాల సరఫరా, వివిధ పథకాల అమల్లో ప్రభుత్వ వైఫల్యాన్ని కప్పిపుచ్చుకునేందుకు, పాఠశాల ముఖ్యకార్యదర్శి చేపడుతున్న పర్యటనలు సమాజంలో ఉపాధ్యాయులను దోషులుగా చిత్రీకరిస్తున్నారని తెలిపారు. ఈ వైఖరిని నిరోధించాలని డిమాండ్ చేశారు. బోధనేతర పనుల నుంచి ఉపాధ్యాయులను మినహాయించాలన్నారు. ఇతర శాఖల్లో జరుగుతున్న ప్రక్రియకు భిన్నంగా రూ.2500 ఇచ్చే ప్రమోషన్లు, ఒక ఇంక్రిమెంట్ పేరుతో ఇచ్చే ప్రమోషన్ల వల్ల ఉపాధ్యాయుల హక్కులకు భంగం కలిగిస్తున్నారని విమర్శించారు. ఉద్యోగోన్నతులు రెగ్యులర్ ప్రతిపాదికన ఇవ్వాలని కోరారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు రూ.6,500 కోట్ల బకాయిలు చెల్లించడంలో తాత్సారం చేయడం వల్ల ఆర్థిక నష్టం చేకూరుతుందని తెలిపారు. పిఆర్‌సి, ఇతర బకాయిలను వెంటనే విడుదల చేయాలని, చట్టబద్ధమైన 12వ పిఆర్‌సిని వెంటనే నియమించాలని కోరారు. సిపిఎస్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు ఉద్యోగుల ను వెంటనే రెగ్యులర్ చేయాలని, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలు 11వ పిఆర్‌సికి అనుగుణంగా పెంచాలని కోరారు. వీటిని పరిష్కరించాలని కోరుతూ.. జూన్ 5 నుంచి 9 వరకు అన్ని జిల్లాల కలెక్టర్లకు వినతిపత్రాలు అందజేస్తామన్నారు. జూన్, 14 నుంచి 16 వరకు నియోజకవర్గాల స్థాయి సమావేశాలు నిర్వహించి స్థానిక ఎమ్మెల్యేలకు వినతిపత్రాలు ఇస్తామన్నారు. జూన్ 18 నుంచి జులై 9 వరకు ఉమ్మడి జిల్లాల వారీ సదస్సులు ఉంటాయని పేర్కొన్నారు. జులై 11న ముఖ్య కార్యదర్శికి నోటీసు ఇస్తామన్నారు. జులై 26, 27, 28 తేదీల్లో మండల కేంద్రాల్లో

మిగతా 2లో



ఢిల్లీపై కేంద్ర ఆర్డినెన్స్ రాజ్యాంగ విరుద్ధం

- పార్లమెంటులో వ్యతిరేకంగా ఓటు వేస్తాం
- సంయుక్త మీడియా సమావేశంలో ఏచూరి, కేజ్రీవాల్

లోపలి పేజీలో..

కొత్త సినిమా తొలిరోజే ఇంట్లో..

ఫైబర్ నెట్ ఛైర్మన్ గౌతమ్ రెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సినిమా థియేటర్‌లో కొత్త సినిమా రిలీజైన రోజే ఇంట్లో కూర్చొని వీక్షించేలా వినూత్న విధానం ప్రవేశపెట్టామని ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఫైబర్ నెట్ లిమిటెడ్ (ఎపిఎస్ఎఫ్ఎల్) ఛైర్మన్ పి గౌతమ్ రెడ్డి వెల్లడించారు. ఎపిఎస్ఎఫ్ఎల్ కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. సినిమా తీసే నిర్మాత, వీక్షించే ప్రేక్షకుడికి ఇరువురికీ లాభం కలిగేలా ఇంట్లోనే కొత్త సినిమా చూసేందుకు అవకాశం కల్పిస్తున్నామని చెప్పారు. ఫస్ట్ డే ఫస్ట్ షో అనే పద్ధతిలో ఈ కార్యక్రమానికి రూపకల్పన చేశామని వెల్లడించారు. రూ.99తో కొత్త సినిమా సబ్‌స్క్రైబ్ చేసుకున్న నుంచి 24 గంటల వరకూ అందుబాటులో ఉంటుందని చెప్పారు. ఇది ఒటిటి తరహాలో కాకుండా.. నేరుగా లైవ్ చూసేలా రూపొందించామని తెలిపారు. సినిమా నిర్మాతలు ఎపిఎస్ఎఫ్ఎల్‌తో మాట్లాడిన తర్వాత ఫైబర్ నెట్ ద్వారా సినిమా ప్రదర్శన ఉంటుందన్నారు.



మురళి



సిహెచ్ విద్యాసాగర్

ఎఐపిఇయు రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులుగా మురళి, సిహెచ్ విద్యాసాగర్

- 15 మందితో నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి- కర్నూలు కార్పొరేషన్

అఖిల భారత పోస్టల్ ఉద్యోగుల సంఘం (ఎఐపిఇయు-పి4) పోస్ట్‌మెన్, ఎంటిఎస్ ఆంధ్రప్రదేశ్ సర్కిల్ అధ్యక్షులుగా ఎకె.మురళి, కార్యదర్శిగా సిహెచ్.విద్యాసాగర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కర్నూలులోని బిఎఎస్ కల్యాణ మండపంలోగల ఎన్ఎస్ మూర్తి సభా ప్రాంగణంలో మూడు రోజులపాటు జరిగిన ఈ యూనియన్ 3వ ద్వైవార్షిక రాష్ట్ర మహాసభ మంగళవారంతో ముగిసింది. 15 మందితో నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. రాష్ట్ర సహాయ కార్యదర్శిగా ఈశ్వరయ్య, కోశాధికారిగా డి.శ్రీలక్ష్మి ఎన్నుకోబడ్డారు. ఆ సంఘం ఆలిండియా జనరల్ సెక్రెటరీ మొహంతి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.

నిర్మల్ హృదయ్‌ను సందర్శించిన సిఎం దంపతులు



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విజయవాడ రాఘవయ్య పార్కు సమీపంలోని మిషనరీస్ ఆఫ్ చారిటీ నిర్మల్ హృదయ్ భవన్‌ను సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఆయన భార్య వైఎస్ భారతి దంపతులు మంగళవారం సందర్శించారు. మదర్ థెరిస్సా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నిర్మల్ హృదయ్‌లో నూతనంగా నిర్మించిన హోమ్ ఫర్ సిక్ అండ్ డైయింగ్ డెస్టిట్యూట్స్ భవనాన్ని సిఎం ప్రారంభించారు. అనంతరం నిర్మల్ హృదయ్‌లో వికలాంగులు, అనాథ పిల్లలు, వృద్ధులతో ముచ్చటించారు.

జమ్ములో ఘోర ప్రమాదం

- బ్రిడ్జి పై నుంచి నదిలో పడ్డ బస్సు
- 10 మంది వైష్ణోదేవీ యాత్రికులు మృతి
- 52 మందికి గాయాలు
- బాధితుల్లో అత్యధికులు బీహార్ వాసులే
- రాష్ట్రపతి, ప్రధాని, ఏచూరి ప్రభృతుల సంతాపం



ప్రమాదానికి గురైన బస్సు

జమ్ము/న్యూఢిల్లీ : జమ్ములో మంగళవారం నాడు ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. వైష్ణోదేవీ ఆలయ సందర్శనకు వెళ్తున్న యాత్రీకుల బస్సు కాత్రా ప్రాంతంలోని ఒక బ్రిడ్జిపై నుంచి నదిలో పడిపోవడంతో పది మంది చనిపోయారు. మరో 57 మంది గాయపడ్డారు. అమృత్‌సర్ నుంచి కాత్రా వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగిందని జమ్ము ఎస్ఎస్‌పి చందన్ కొహ్లి చెప్పారు. జమ్ము జిల్లాలోని కాత్రాకు 15 కిలోమీటర్ల దూరంలో ఝజ్జర్ కొట్లీ దగ్గర బస్సు వంతెనపై నుంచి పడిపోయిందని ఆయన తెలిపారు. క్షతగాత్రులను జమ్ము వైద్య కళాశాల ఆసుపత్రికి తరలించారు. వీరిలో పలువురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. బాధితుల్లో అత్యధికులు బీహార్ వాసులే. వైష్ణోదేవీ యాత్రికుల మృతి పట్ల రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, సిపిఎం ప్రధానకార్యదర్శి సీతారాం ఏచూరీ, బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్, జమ్ముకాశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నరు మనోజ్ సిన్హా తదితరులు తీవ్ర సంతాపం ప్రకటించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. మృతుల కుటుంబాలకు జమ్ముకాశ్మీర్ అడ్మినిస్ట్రేషన్ రూ.5 లక్షల చొప్పున, బీహార్ ప్రభుత్వం రూ.2 లక్షల చొప్పున పరిహారం ప్రకటించాయి. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలందించాలని, మృతుల కుటుంబాలకు జమ్ముకాశ్మీర్ అడ్మినిస్ట్రేసన్ న్యాయమైనరీతిలో పరిహారం అందజేయాలని ఏచూరి డిమాండ్ చేశారు. మానవ తప్పిదం వల్లే ప్రమాదం జరిగివుంటుందని డిజిపి దిల్‌బాగ్ సింగ్ చెప్పారు. రాత్రిబవళ్లు ఒకరే బస్సు నడపటం, పూట బస్సు నడపడం, అతివేగం ప్రమాదానికి కారణమై వుండవచ్చునని, పూర్తి వివరాలు దర్యాప్తులో వెల్లడవుతాయని తెలిపారు.

కార్మిక సమస్యలపై రాజీలేని పోరు

- సిఐటియు 53వ ఆవిర్భావ దినోత్సవంలో వక్తలు
- రాష్ట్ర వ్యాప్తంగా యూనియన్ జెండాల ఆవిష్కరణ
- విశాఖలో రక్తదానం



ఉక్కునగరం సిఐటియు కార్యాలయంలో జరిగిన సదస్సులో మాట్లాడుతున్న ఎవి.నాగేశ్వరరావు

ప్రజాశక్తి- యంత్రాంగం

సిఐటియు 53వ దినోత్సవం మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జెండాలను యూనియన్ నేతలు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాల్లో నేతలు మాట్లాడుతూ కార్మికుల సమస్యలపై సిఐటియు రాజీలేని పోరాటం చేస్తోందని, వర్గ పోరాటాల ద్వారా దోపిడీ వ్యవస్థను అంతం చేసేందుకు కృషి చేస్తోందని తెలిపారు. కార్మికులకు కనీస వేతన చట్టం అమలు చేయాలని, కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని, ప్రయివేటీకరణ విరమించాలని, ఎనిమిది గంటల పని విధానం కొనసాగించాలని డిమాండ్ చేశారు. కార్మికులు తమ డిమాండ్ల సాధనకు ఐక్య ఉద్యమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. విశాఖలోని ఉక్కునగరంలో సిఐటియు ఆధ్వర్యాన 'కార్మికోద్యమం - నూతన పరిస్థితులు' అనే అంశంపై నిర్వహించిన సదస్సులో యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఎవి.నాగేశ్వరరావు పాల్గొని ప్రసంగించారు. సంఘటిత, అసంఘటిత రంగ కార్మికుల సమస్యలపై సిఐటియు అలుపెరుగని పోరాటం చేస్తూ ఎన్నో విజయాలు సాధించిందని తెలిపారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ వ్యతిరేక ఉద్యమంలోనూ కార్మికులను ఐక్యపరిచి ముందుకు సాగుతోందన్నారు. కార్మికులను విభజించే మతోన్మాద శక్తుల ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని కోరారు. స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు జె.అయోధ్యరామ్, అధ్యక్ష, కార్యదర్శులు వైటి.దాస్, యు.రామస్వామి, కాంట్రాక్ట్ కార్మిక సంఘం అధ్యక్షులు జి.శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి నమ్మి రమణ, గౌరవాధ్యక్షులు వెంకటేశ్వరరావు, బి.అప్పారావు పాల్గొన్నారు. విశాఖ నగరంలోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కార్మికుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా సిఐటియు పనిచేస్తోందన్నారు. విశాఖ క్యాబ్ ఓనర్స్ అండ్ డ్రైవర్స్ యూనియన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. విజయవాడలోని సిఐటియు కార్యాలయంలో యూనియన్ జెండాను సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.ఎ.గఫూర్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సిఐటియు బలం పెరిగితేనే కార్మిక ఐక్యత సాధ్యమవ తుందన్నారు. పోరాడి సాధించుకున్న

మిగతా 2లో

98 శాతానికిపైగా ఎన్నికల హామీల అమలు

- నాలుగేళ్ల పాలనపై సిఎం జగన్ ట్వీట్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎన్నికల హామీలను 98 శాతానికిపైగా అమలు చేశామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. నాలుగేళ్ల పాలనపై సిఎం మంగళవారం ట్వీట్ చేశారు. వివిధ రంగాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామన్నారు. 'మీకు సేవ చేసే అవకాశం కల్పించినందుకు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియజేస్తూ.. మన ప్రభుత్వంపై మీ అందరి ఆశీస్సులు ఎప్పటికీ ఇలాగే ఉండాలని కోరుకుంటున్నాను' అని సిఎం పేర్కొన్నారు.

సిఎంకు పలువురు అభినందనలు

ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టి నాలుగేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా మంగళవారం క్యాంపు కార్యాలయంలో ఆయనను కలిసి పలువురు అభినందనలు తెలిపారు. వీరిలో సిఎస్ కెఎస్ జవహర్‌రెడ్డి, ముఖ్యమంత్రి స్పెషల్ సిఎస్ పూనం మాలకొండయ్య, సిఎం కార్యదర్శులు కె ధనంజయరెడ్డి, రేవు ముత్యాలరాజు, అదనపు కార్యదర్శి నారాయణ భరత్‌గుప్తా ఉన్నారు.

నాలుగేళ్ల పాలనపై టిడిపి ఛార్జిషీట్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ నాలుగేళ్ల పాలనపై ఛార్జిషీట్ పేరుతో టిడిపి పుస్తకాన్ని విడుదల చేసింది. నేరాలు-ఘోరాలు, విధ్వంసాలు, విద్వేషాలు, అబద్ధాలు, మోసాలు, దుష్ప్రచారం, మాటతప్పడాలు, మడమ తిప్పడాలు తప్ప నాలుగేళ్లలో జగన్ సాధించింది శూన్యమని టిడిపి నేతలు విమర్శించారు. ఈ ఛార్జిషీట్‌ను ప్రజలందరూ చూసి వాస్తవాలు తెలుసుకోవాలని కోరారు. టిడిపి కార్యాలయం ఎన్‌టిఆర్ భవన్‌లో ఆ పార్టీ ఎమ్మెల్సీలు పి అనురాధ, పి అశోక్‌బాబు, పొలిట్‌బ్యూరో సభ్యులు నక్కా ఆనంద్‌బాబు, బోండా ఉమామహేశ్వరరావు, వర్ల రామయ్య, అధికార ప్రతినిధి మహ్మద్ నజీర్ అహ్మద్ మంగళవారం ఛార్జిషీట్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా నక్కా ఆనంద్‌బాబు మాట్లాడుతూ.. 72 శాతం పూర్తయిన పోలవరం ప్రాజెక్టు ఆగిపోయిందని, ప్రతిపక్షాలపై తప్పుడు కేసులు, ప్రశ్నించేవారిపై దాడులు, ప్రజా అమరావతి నాశనం, ప్రాంతాలు, కులాలు, మతాల మధ్య విద్వేషాలు రాజేయడానికే వైసిపి ప్రభుత్వం పరిమితమైందని విమర్శించారు. బోండా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ.. నాలుగేళ్లలో రాష్ట్రంలోని ఒక్కో వ్యక్తిపై రూ.2.40 లక్షలు, ఒక్కో కుటుంబంపై రూ.3.94 లక్షల అప్పుల భారం మోపారని విమర్శించారు. ఒక్కో కుటుంబం నుంచి పన్నుల రూపంలో రూ.1,51,450 లాక్కున్నారని ఆరోపించారు. ఒక్క అవకాశం పేరుతో ప్రజల్ని మోసగించి అధికారంలోకి వచ్చిన జగన్ అపరకుబేరుడు అయ్యారని విమర్శించారు. సిపిఎస్‌ను వారంలో రద్దుచేస్తానని చెప్పి ఇప్పుడు జిపిఎస్ అంటున్నారని అశోక్‌బాబు విమర్శించారు. ప్రతియేడాదీ జాబ్ క్యాలెండరు ప్రకటిస్తానని, 2.30 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తానని చెప్పి, నాలుగేళ్లలో ఒక్క ఉద్యోగం ఇవ్వలేదని అన్నారు. యువత జీవితాలను నిరాశ, నిస్పృహల్లో ముంచేశారని పేర్కొన్నారు. నాలుగేళ్ల పాలనపై వైసిపి నాయకులు సంబరాలు ఎందుకు చేసుకుంటున్నారో సమాధానం చెప్పాలని అనురాధ ప్రశ్నించారు. కల్తీమద్యంతో మహిళల మానప్రాణాలతో చెలగాటమాడుతున్నందుకు సంబరాలు చేసుకుంటున్నారా? అని ప్రశ్నించారు. శాండ్, ల్యాండ్, మైనింగ్, గంజాయి మాఫియాతో రాష్ట్రాన్ని నాశనం చేసింది నిజం కాదా? అని ప్రశ్నించారు. జగన్ తన పాలనలో ప్రజలకు కోతలు వాతలే మిగిల్చారని మహ్మద్ నజీర్ అహ్మద్ విమర్శించారు. రాష్ట్రంలో 7 సార్లు విద్యుత్ ఛార్జీలు, ఆర్‌టిసి ఛార్జీలు పెంచారని తెలిపారు. చెత్తపై పన్నువేశారని ఆవేదన వ్యక్తం చేశారు. వర్ల రామయ్య మాట్లాడుతూ.. జగన్ పాలన నేరాలు-ఘోరాలు, లూఠీలు, విధ్వంసాలు, విద్వేషాలు, అబద్ధాల మయమని విమర్శించారు. వివేకానందరెడ్డి హత్య కేసులో సిబిఐ తన అఫడవిట్‌లో జగన్ పేరు ప్రస్తావించనప్పుడే ముఖ్యమంత్రి పదవికి అనర్హుడని తేలిపోయిందని అన్నారు.

మమ్మల్ని తొలగించొద్దు

- మంత్రి బొత్స, సజ్జలకు పాలిటెక్నిక్ కాంట్రాక్టు లెక్చరర్ల వినతి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న తమను తొలగించొద్దని ఎపి పాలిటెక్నిక్ ఆల్ కాంట్రాక్ట్ లెక్చరర్ల అసోసియేషన్ కోరింది. ఈ మేరకు విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిని అసోసియేషన్ ఆధ్వర్యాన లెక్చరర్లు మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. పాలిటెక్నిక్ కళాశాలల్లో లెక్చరర్ల పోస్టుల కోసం ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఎపిపిఎస్‌సి) జూన్‌లో నోటిఫికేషన్ విడుదల చేయబోతుందని వివరించారు. తాము ఇప్పటికే పనిచేస్తున్న పోస్టులను పరిగణనలోకి తీసుకోవడం లేదని పేర్కొన్నారు. కాంట్రాక్ట్ లెక్చరర్లకు ఇబ్బంది లేకుండా నోటిఫికేషన్ విడుదల చేస్తామని మంత్రి బొత్స, సజ్జల వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎఆర్ గోవర్ధన్‌నాయుడు, బి కృష్ణ, ఉపాధ్యక్షులు పి సాయిరాజు, జాయింట్ సెక్రటరీ కె దినకర్ శ్రీనివాస, మహిళా జాయింట్ సెక్రటరీ ఆర్ స్వాతి తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు లెక్చరర్ల సర్వీస్ రెన్యువల్

ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లోని కాంట్రాక్టు లెక్చరర్లు, వర్క్‌షాప్ అటెండర్ల సర్వీస్‌ను రాష్ట్ర ప్రభుత్వం రెన్యువల్ చేసింది. ఇందుకు సంబంధించిన జిఓ 71ను స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రైనింగ్‌శాఖ ముఖ్యకార్యదర్శి ఎస్ సురేష్‌కుమార్ మంగళవారం విడుదల చేశారు. 2023 జూన్ 1 నుంచి 2024 ఏప్రిల్ 30 వరకు 11 నెలల పాటు వీరి సర్వీస్‌ను రెన్యువల్ చేశారు. కాంట్రాక్టు లెక్చరర్లు 316 మంది, వర్క్‌షాప్ అటెండర్లు 144 మంది పనిచేస్తున్నారు.

ఆర్ట్, క్రాఫ్ట్, పిఇటిలకు ఎంటిఎస్ వేతనాలు

- ఎస్ఎస్ఎ ఎస్‌పిడికి ఎమ్మెల్సీ కెఎస్ వినతి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సమగ్ర శిక్షా అభియాన్‌లో పనిచేస్తున్న ఆర్ట్, క్రాఫ్ట్, పిఇటిలకు మినిమం టైమ్‌స్కేల్ ప్రకారం వేతనాలు చెల్లించాలని పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు కోరారు. ఆర్ట్, వర్క్, హెల్త్ అండ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ పార్ట్‌టైం కాంట్రాక్టు ఇన్‌స్ట్రక్టర్స్ ఫెడరేషన్ నాయకులతో సమగ్ర శిక్షా ఎస్‌పిడిని కలిసి మంగళవారం వినతిపత్రం అందజేశారు. టీచింగ్ స్టాఫ్‌కు గౌరవ వేతనం కింద రూ.14,203 మాత్రమే చెల్లిస్తున్నారని, ఆరేళ్ల నుంచి వేతనాలు పెరగలేదని ఎమ్మెల్సీ లక్ష్మణరావు తెలిపారు. ఎస్‌జిటి స్కేల్ ప్రకారం రూ.32,670 ఇవ్వాలని పేర్కొన్నారు. పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్ అనే పదాన్ని తొలగించి ఒకేషనల్ టీచర్‌గా పేరు మార్చాలని కోరారు. జిఓ 73లోని అన్ని అంశాలనూ తక్షణమే అమలు చేయాలన్నారు. జగనన్న విద్యాకానుక కిట్ల పంపిణీలో కేవలం పర్యవేక్షణ రిపోర్టింగ్‌కే పరిమితం చేయాలని, పిఇటిలతో మూటలు మోయించడం, బరువైన పనులు చేయిస్తున్నారని తెలిపారు. ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. అవసరమైన వారికి రిక్వెస్ట్, మ్యూచువల్, స్పౌజ్ బదిలీలు జరపాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్ఎన్ దేవేంద్రరావు, ఎం మస్తాన్‌రావు, నాయకులు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

టిడిపి మేనిఫెస్టోతో వైసిపిలో గుబులు : గంటా

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

తెలుగుదేశం పార్టీ ప్రకటించిన మేనిఫెస్టో చూసి అధికార వైసిపి నాయకులు బెంబేలెత్తుతున్నారని టిడిపి మాజీ మంత్రి, విశాఖ ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు విమర్శించారు. నగరంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. టిడిపి మేనిఫెస్టో అన్ని తరగతులకూ భరోసా కల్పించే విధంగా ఉందన్నారు. దసరా రోజున మరికొన్ని హామీలను మ్యానిఫెస్టోలో చేరుస్తామని తెలిపారు. తాను అధికారంలోకి వస్తే వారం రోజుల్లోనే సిపిఎస్ రద్దు చేస్తానని హామీ ఇచ్చిన జగన్మోహన్‌రెడ్డి ఉద్యోగులను మోసం చేశారని విమర్శించారు. ప్రత్యేక హోదా కోసం కేంద్రం మెడలు వంచుతానని చెప్పి గెలిచిన ఆయన నేడు ఢిల్లీ పెద్దల ఎదుట సాగిలపడుతున్నారని ఎద్దేవా చేశారు. సంపూర్ణ మద్యపాన నిషేధంపై మాట తప్పారన్నారు. విశాఖ రైల్వే జోన్ విషయాన్ని గాలికొదిలేశారని, పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసేందుకు కృషి చేయలేదని, సన్నబియ్యం ఇస్తానని చెప్పి అధికారంలోకి వచ్చాక మాట మార్చారని విమర్శించారు. జగన్‌ను నమ్మే పరిస్థితుల్లో నేడు ప్రజలు లేరన్నారు. సమావేశంలో ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, పార్టీ ఉత్తర నియోజకవర్గం ఇన్‌ఛార్జి చిక్కాల విజయబాబు పాల్గొన్నారు.

ఉక్కు ప్రయివేటీకరణను నిలుపుదల చేస్తాం : కాంగ్రెస్

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిలుపుదల చేస్తామని ఆ పార్టీ కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ అన్నారు. విశాఖలోని విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి ఆక్సిజన్ తగ్గినప్పుడల్లా ఢిల్లీ వెళ్లి గాలి పీల్చుకుని వస్తున్నారని ఎద్దేవా చేశారు. జగన్ హయాంలో రాష్ట్ర అభివృద్ధి ఆగిపోయిందన్నారు. ధరలు, అసమానతలతో ప్రజలు విసిగిపోయారని తెలిపారు. రోశయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డిల స్థానంలో చిరంజీవిని ముఖ్యమంత్రిని చేయకపోవడం కాంగ్రెస్ పార్టీ చేసిన పెద్ద తప్పు అని అన్నారు. నరేంద్ర మోడీ ప్రధానిగా విఫలమయ్యారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం పాత రైలు పెట్టెలకు రంగులు మార్చి కొత్త పేర్లు పెట్టి తిప్పుతున్నారని ఎద్దేవా చేశారు.

స్వామినాథన్ సిఫార్సులు అమలు చేయాలి

- మద్దతు ధరల గ్యారెంటీ చట్టం కోసం కేంద్రంపై ఒత్తిడి తేవాలి
- ఎంపి కేశినేనికి రైతు సంఘాల సమన్వయ సమితి వినతి



ఎంపి కేశినేని నానికి వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘాల సమన్వయ సమితి నాయకులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

డాక్టర్ స్వామినాథన్ సిఫార్సుల ప్రకారం అన్ని పంటలకూ సి2 ప్లస్ 50 ప్రకారం మద్దతు ధరల గ్యారెంటీ చట్టం తేవడానికి కృషి చేయాలని ఎంపి కేశినేని నానిని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘాల సమన్వయ సమితి ప్రతినిధులు కోరారు. ఈ మేరకు విజయవాడలోని ఆయన కార్యాలయంలో మంగళవారం కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రైతు సంఘాల సమన్వయ సమితి కన్వీనరు వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ.. రైతాంగం కీలకమైన సమస్యల పరిష్కారానికి సంయుక్త కిసాన్ మోర్చా పిలుపు మేరకు జరుగుతున్న మరో రైతాంగ ఉద్యమానికి తోడ్పాటు అందించాలని కోరారు. రైతాంగం సమస్యల పరిష్కారం కోసం పార్లమెంటు లోపల ఎంపి నాని వాణిని వినిపించాలన్నారు. రైతాంగ ఉద్యమంలో ప్రత్యక్షంగా భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. రైతు సంఘాల సీనియర్ నాయకులు వై కేశవరావు మాట్లాడుతూ.. కేరళ తరహాలో రైతురుణ ఉపశమన చట్టాన్ని తెచ్చి ఆత్మహత్యల నుంచి రైతాంగాన్ని రక్షించేందుకు కృషి చేయాలన్నారు. సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య అధ్యక్షులు ఆళ్ల వెంకట గోపాలకృష్ణారావు మాట్లాడుతూ.. రైతు ఉద్యమం సందర్భంగా రైతులపై పెట్టిన కేసులను ఎత్తివేసేందుకు కృషి చేయాలని, ఉద్యమం సందర్భంగా మరణించిన రైతు కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించేలా చూడాలని కోరారు. రాష్ట్ర తెలుగురైతు ప్రధాన కార్యదర్శి కుర్రా నరేంద్ర మాట్లాడుతూ.. 60 ఏళ్లు పైబడిన రైతు, కౌలు రైతులకు నెలకు రూ.6 వేల పెన్షన్ ఇచ్చేందుకు కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించాలని కోరారు. అఖిలభారత కిసాన్ మహాసభ రాష్ట్ర కార్యదర్శి డి హరనాథ్ మాట్లాడుతూ.. విద్యుత్ చట్ట సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలని, వ్యవసాయ పంప్‌సెట్లకు మీటర్ల ఏర్పాటును విరమించుకునేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలన్నారు. ఎంపిని కలిసిన వారిలో ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి జమలయ్య, అఖిల భారత రైతు సమాఖ్య అధ్యక్షులు ఎం వెంకటరెడ్డి, ఎన్‌టిఆర్ జిల్లా రైతు సంఘం కార్యదర్శి పివి ఆంజనేయులు, రైతు సంఘాల సమన్వయ సమితి నాయకులు అమ్మినేని జ్వాలాప్రసాద్, కోగంటి కోటయ్య, కాకాణి శ్రీనివాసరావు ఉన్నారు.



రాజధాని గ్రామం మందడంలో రైతుల ఆందోళన

అమరావతిలో అక్రమ మట్టి తవ్వకాలు

- మందడంలో రైతుల ధర్నా

ప్రజాశక్తి - తుళ్లూరు (గుంటూరు)

రాజధాని అమరావతిలో రాత్రివేళల్లో అక్రమ మట్టి తవ్వకాలకు పాల్పడుతున్నారు. సోమవారం రాత్రి మందడం సమీపంలో అక్రమంగా మట్టిని తరలిస్తున్న టిప్పర్లను కొందరు రైతులు అడ్డుకున్నారు. అడ్డుతొలగకపోతే లారీలతో తొక్కిస్తామని బెదిరింపులకు పాల్పడ్డారని రైతులు తెలిపారు. మట్టి తరలింపును నిరసిస్తూ మంగళవారం జోరువర్షంలో మందడం రైతు దీక్షా శిబిరం వద్ద రైతులు, మహిళలు బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సిఆర్‌డిఎ చట్టాన్ని ఉల్లంఘించి సెంటు స్థలం పంపిణీ, రాజధాని నిర్మాణ సామాగ్రి అక్రమ తరలింపునకు బాధ్యత వహించి సిఆర్‌డిఎ కమిషనర్ వివేక్ యాదవ్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. సెంటు స్థలాలకు సంబంధించిన లే అవుట్‌లలో మెరకలను పూడ్చిందుకు రైతుల రిటర్న్ బుల్ ప్లాట్ల వద్ద నుంచి మట్టిని అక్రమంగా తరలిస్తున్నారని మండిపడ్డారు.

రాజధాని గ్రామాల్లో నాలుగేళ్లుగా మట్టి, ఇసుక, కంకర, ఇనుము, గ్రావెల్ లాంటి నిర్మాణ మెటీరియల్ అక్రమ తరలింపు జరుగుతోందని, పోలీసులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. రాజధాని నిర్మాణానికి ఎకరం భూమిలో 75 సెంట్లు ప్రభుత్వానికి ఇచ్చి కేవలం 25 సెంట్లు మాత్రమే రైతులు తీసుకున్నారని, వైసిపి దుర్మార్గాలను చూస్తుంటే 25 సెంట్లను కూడా కాపాడుకోలేమేమోనన్న ఆందోళన కలుగుతోందని తెలిపారు. ఆందోళనకారులతో పోలీసులు చర్చలు జరిపారు. పోలీసుల హామీ మేరకు ధర్నా విరమించారు. అనంతరం మట్టి అక్రమ తవ్వకాలపై రైతులు ఫిర్యాదు చేశారు.

హామీల అమలు కోరుతూ మున్సిపల్ కార్మికుల రాష్ట్ర ప్రచార జాతాలు

- ఇచ్ఛాపురం, హిందూపురం నుంచి నేడు ప్రారంభం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మున్సిపల్ పారిశుధ్య, ఇంజినీరింగ్, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికుల ఉద్యోగాలను పర్మినెంటు చేయాలని, సిఎం జగన్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. విజయవాడలోని గాంధీనగర్ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ నెల 31న శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం, సత్యసాయి జిల్లా హిందూపురం నుంచి రెండు రాష్ట్ర ప్రచార జాతాలు బయలుదేరనున్నాయని తెలిపారు. ఇచ్ఛాపురంలో సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి నాగేశ్వరరావు, హిందూపురంలో శ్రామిక మహిళా సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనరు కె ధనలక్ష్మి ప్రారంభిస్తారన్నారు. మున్సిపల్ కార్మికులు పనిచేసేందుకు అవసరమైన పనిముట్లను సకాలంలో అందించడం లేదని, మరణించిన, అనారోగ్యం పాలైన కార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యులకు ఉద్యోగాలివ్వడం లేదన్నారు. పట్టణాల విస్తరణ మేరకు సిబ్బంది సంఖ్యను పెంచడం లేదన్నారు. ఆప్కాస్‌లో కార్మికులను నమోదు చేశారు కానీ ఉద్యోగులకు ఇచ్చే ఏ ఒక్క సౌకర్యాన్నీ అమలు చేయడం లేదన్నారు.

కార్మికులందరికీ 010 పద్దు ద్వారా జీతాలివ్వాలని, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కాంట్రాక్టు కార్మికులను పర్మినెంటు చేయాలని, సిపిఎస్ రద్దు చేసి, ఓపిఎస్ అమలు చేయాలని ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. ఇంజినీరింగ్ కార్మికులకు హెల్త్, రిస్క్ అలవెన్స్, సంక్షేమ పథకాలు అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో రాష్ట్ర కోశాధికారి ఎస్ జ్యోతిబసు, రాష్ట్ర నాయకులు గార్లపాటి లక్ష్మీ పాల్గొన్నారు.

ప్రాణాలను హరించే పరిశ్రమలను తరలించాలి

- కోలాట ప్రదర్శనతో నిరసన
- జగ్గయ్యపేటలో సిపిఎం వినూత్న ఆందోళన

ప్రజాశక్తి - జగ్గయ్యపేట (ఎన్‌టిఆర్ జిల్లా)

ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలంలోని గ్రీన్‌టెక్ ఫ్యాక్టరీ, ఆటో నగర్‌లోని ఫార్మా పరిశ్రమలను తరలించి ప్రజల ప్రాణాలను కాపాడాలని కోరుతూ మంగళవారం పట్టణంలో చిన్నారులు కోలాటంతో నిరసన తెలిపారు. ఎన్‌టిఆర్ సర్కిల్, పట్టణ పుర వీధుల్లో తిరుగుతూ నిరసన వ్యక్తం చేశారు. అనంతరం పరిశ్రమను తరలించాలని కోరుతూ తహశీల్దారు కార్యాలయ సిబ్బందికి వినతి పత్రం అందజేశారు.

ఈ సందర్భంగా సిపిఎం ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి డివి కృష్ణ మాట్లాడుతూ.. జగ్గయ్యపేట ప్రాంతంలో ఉన్న ఫార్మా పరిశ్రమలు ఉపాధి, అభివృద్ధికి తోడ్పడేవి కావని, అవి కాలుష్యం కోరలతో ప్రజల ప్రాణాలను హరించేవని తెలిపారు. ఇటీవల ఆటో నగర్‌లో ఎస్ఎల్ ఫార్మా కంపెనీ నుంచి విషవాయువులు వెలువడి ముగ్గురు కార్మికులు అస్వస్థతకు గురయ్యారని గుర్తు చేశారు. షేర్ మహమ్మద్ పేట గ్రామ సమీపంలోని గ్రీన్‌టెక్ పరిశ్రమను, ఆటోనగర్‌లోని కాలుష్యం వెదజల్లే ఫార్మా కంపెనీలను తరలించాలని సిపిఎం, ప్రజాసంఘాలు మూడేళ్లుగా పోరాడుతున్నాయని, అయినా అధికారులకు చీమకుట్టినట్లు కూడా లేదన్నారు. గ్రీన్‌టెక్‌ను తరలించే చర్యలు తీసుకుంటామని స్థానిక ఎమ్మెల్యే సామినేని ఉదయభాను ఇచ్చిన హామీ అమలు కాలేదని తెలిపారు. అనుమంచిపల్లి, రామచంద్రునిపేట, షేర్ మహమ్మద్‌పేట, జగ్గయ్యపేట ప్రాంతాల ప్రజలు కాలుష్యంతో ఇబ్బందులు పడుతున్నారని, భూగర్భ జలాలను తాగే పరిస్థితి లేదని, డబ్బులు వెచ్చించి మంచినీటిని కొనుక్కోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించకపోతే ఐక్య ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎన్.సిహెచ్.శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేటలో చిన్నారుల కోలాట ప్రదర్శన

'జల్ జీవన్' అమలులో 2 జిల్లాలకు ఉత్తమ ర్యాంకులు

- సిఎస్ జవహర్‌రెడ్డి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

జల్‌జీవన్ మిషన్ పథకం అమలులో భాగంగా జెజెఎస్-2023కు సంబంధించి బెస్ట్ పెర్ఫామెన్స్, ఫాస్టెస్ట్ మూవింగ్ అను కేటగిరీల్లో మొదటి ఆరు నెలల కాలానికి రాష్ట్రంలోని 2 జిల్లాలకు ఉత్తమ ర్యాంకులు లభించాయని సిఎస్ జవహర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. వైఎస్ఆర్ కడప, విశాఖపట్నం జిల్లాలు జాతీయ స్థాయిలో ఉత్తమ ర్యాంకుల్లో నిలిచాయన్నారు. గత అక్టోబరు నుంచి 2023 మార్చి 31 వరకు ఆస్పిరేషన్‌లో డిస్ట్రిక్ట్ కేటగిరిలో హై అచీవర్స్ కింద వైఎస్ఆర్ కడప జిల్లా గ్రామీణ ప్రాంతాల్లో 75 నుంచి 100 శాతం మధ్య గృహాలకు కుళాయి కనెక్షన్లు కల్పించడం ద్వారా 1/20 ర్యాంకుతో నిలిచిందని తెలిపారు. విశాఖపట్నం జిల్లా ఆస్పిరేషనల్ జిల్లాల విభాగంలో 50 నుంచి 75 శాతం మధ్య గృహ కుళాయి కనెక్షన్ల కవరేజి విషయంలో 1/21 ర్యాంకుతో నిలిచిందని పేర్కొన్నారు. విశాఖపట్నం జిల్లా అచీవర్స్ విభాగంలో 50 నుంచి 75 శాతం గృహ కుళాయిల కవరేజి అంశంలో 3/168 ర్యాంకుతో నిలిచిందని అన్నారు. అర్ధ సంవత్సర ర్యాంకులు.. రానున్న వార్షిక జాతీయ ఉత్తమ ర్యాంకుల ఖరారులో దోహదం చేస్తాయని జల్‌జీవన్ మిషన్ అదనపు కార్యదర్శి రాష్ట్రానికి రాసిన లేఖలో పేర్కొన్నట్లు సిఎస్ వెల్లడించారు. డిపార్టుమెంట్ ఆఫ్ డ్రింకింగ్ వాటర్ అండ్ శానిటేషన్ దేశానికి అవసరమైన తాగునీరు, పారిశుధ్య అవసరాలను తీర్చడానికి రెండు ప్రధాన కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు.

స్వచ్ఛభారత్ మిషన్, గ్రామీణ్ (ఎసిబిఎం-జి), జల్‌జీవన్ మిషన్ (జెజెఎం) ఎస్‌బిఎం-జి సంపూర్ణ పారిశుధ్యాన్ని అందించడం ద్వారా గ్రామీణ భారతదేశాన్ని ఒడిఎఫ్‌ప్లస్‌గా మార్చాలని లక్ష్యంగా పెట్టుకుంటే జెజెఎం ద్వారా ప్రతి ఇంటికీ నాణ్యమైన కుళాయి నీటి సరఫరా అందించాలని లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. జెజెఎం రెండింటిలో పర్యవేక్షణ మూల్యాంకణ యంత్రాంగాల్లో ఒకటి అసెస్‌మెంట్ సర్వేలు అంటే స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ (ఎస్ఎస్‌జి), జల్‌జీవన్ సర్వేక్షణ్ (జెజెఎస్), ఎస్‌బిఎంలో వాటి పనితీరు ఆధారంగా రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు, వాటి జిల్లాలను ర్యాంకింగ్ చేస్తాయని సిఎస్ వెల్లడించారు.



కోనసీమ జిల్లా రామచంద్రపురంలో ర్యాలీలో పాల్గొన్న మంత్రి వేణు

వైసిపి నాలుగేళ్లపాలన సందర్భంగా సంబరాలు

ప్రజాశక్తి- యంత్రాంగం

వైసిపి ప్రభుత్వ నాలుగేళ్ల పాలన సందర్భంగా మంగళవారం వైసిపి శ్రేణులు ఘనంగా వేడుకలు నిర్వహించారు. బైక్ ర్యాలీలు నిర్వహించారు. బాణసంచా కాల్చారు. కేకులు కట్ చేశారు. వైసిపి విజయవాడ కేంద్ర కార్యాలయంలో కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు సజ్జల రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నాలుగేళ్ల పాలన ఒక చరిత్రాత్మకమని అన్నారు. ఎన్నికలు వస్తున్నాయనగానే గుంటనక్కలు నిద్రలేచాయని, అవన్నీ పగటి వేషాలకు సిద్ధమవుతున్నాయని విమర్శించారు. చంద్రబాబు గత పాలనంతా అవినీతిమయమని ఆరోపించారు. అందుకే దత్తపుత్రుడితో కలిసి పోటీ చేయాలని ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. చంద్రబాబు మేనిఫెస్టో అబద్ధాల చిట్టా అని దుయ్యబట్టారు. వైసిపి పాలనలో 1.60 కోట్ల కుటుంబాలకు పథకాలు అందుతున్నాయన్నారు. కార్యక్రమంలో మంత్రి మేరుగ నాగార్జున, లేళ్ల అప్పిరెడ్డి, నవరత్నాల వైస్ చైర్మన్ నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు. వైసిపి కడప జిల్లా కార్యాలయంలో ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాషా, కోనసీమ జిల్లా రామచంద్రపురంలో రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ కేక్ కట్ చేశారు. తునిలో వైఎస్ఆర్ విగ్రహానికి రోడ్లు భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం భారీ కేక్‌ను కట్ చేసి, కార్యకర్తలకు పంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైసిపిది సంక్షేమ ప్రభుత్వమన్నారు. చంద్రబాబు చెప్పే మాటలను ఎవ్వరూ నమ్మే స్థితిలో లేరని తెలిపారు. విజయనగరం జిల్లా ఎస్.కోటలో బైక్ ర్యాలీ నిర్వహించారు. విజయనగరం, గజపతినగరంలో నాయకులు కేక్ కట్ చేశారు. శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలోని ప్రజా ప్రస్థానం విజయస్థూపం వద్ద వేడుకలు నిర్వహించి వైఎస్ రాజశేఖర్ రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వైసిపి నాలుగేళ్ల పాలనను పురస్కరించుకుని విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాతోపాటు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఆ పార్టీ ఆధ్వర్యాన ఘనంగా వేడుకలు నిర్వహించారు.

స్టీల్‌ప్లాంట్‌పై మొండి వైఖరి తగదు

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)



వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణపై కేంద్ర ప్రభుత్వం మొండి వైఖరి విడనాడాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నేతలు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు మంగళవారానికి 838వ రోజుకు చేరుకున్నాయి.

దీక్షల్లో స్టీల్ క్యుఎటిడి, డిఎన్‌డబ్ల్యు, ఇటిఎల్, టెలికం, ఇన్‌స్ట్రుమెంటేషన్ విభాగాలకు చెందిన కార్మికులు కూర్చున్నారు. వారినుద్దేశించి నాయకులు మాట్లాడుతూ.. రెండేళ్లకుపైగా కార్మికులు దీక్షలు, ఆందోళనలు చేపడుతున్నా కేంద్ర ప్రభుత్వంలో చలనం లేకపోవడం శోచనీయమన్నారు. పోరాటాల ద్వారా ఏర్పాటైన ఉక్కు కర్మాగారాన్ని కాపాడుకోవడానికి ఎంతటి త్యాగానికైనా కార్మికవర్గం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు.

చంద్రబాబును అంతం చేసేందుకు కుట్ర

- డిజిపికి టిడిపి నేత వర్ల లేఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

టిడిపి అధినేత చంద్రబాబును అంతం చేయడానికి రాష్ట్రంలో పెద్ద రాజకీయ కుట్ర జరుగుతోందని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై చర్యలు తీసుకోవాలని డిజిపికి మంగళవారం ఆయన లేఖ రాశారు. నాలుగేళ్లుగా పలు దఫాలుగా చంద్రబాబుపై దాడి చేయడానికి అధికార పార్టీ తమ శ్రేణులను ఉసిగొల్పిందని తెలిపారు. చంద్రబాబుకు బ్లాక్ కమాండోస్‌ను తొలగిస్తే అంతం చేస్తామని శాసనసభ స్పీకరు తమ్మినేని సీతారాం అన్నారని వెల్లడించారు. తమ్మినేని హెచ్చరికలతో పెద్ద రాజకీయ కుట్ర జరుగుతోందని తమకు అర్థమైందని పేర్కొన్నారు. దీనిపై కుట్ర కేసు నమోదు చేసి, తమ్మినేనితో సహా బాధ్యులందరిపై చర్యలు తీసుకోవాలని కోరారు. చంద్రబాబు భద్రతపై నిఘా పెంచి కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. చట్ట సభలకు ఉన్న గౌరవాన్ని మంటగలిపేలా స్పీకరు తమ్మినేని మాట్లాడటం బాధాకరమని శాసనమండలి మాజీ ఛైర్మన్ ఎంఎ షరీఫ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.



బహిరంగ సభలో మాట్లాడుతున్న నారా లోకేష్

కష్టాలు చూశాను... కన్నీళ్లు తుడుస్తాను

- జమ్మలమడుగు బహిరంగ సభలో నారా లోకేష్

ప్రజాశక్తి- జమ్మలమడుగు రూరల్

పాదయాత్రలో ప్రజల కష్టాలను స్వయంగా చూశానని, వారి కన్నీళ్లు తుడుస్తానని, ప్రజల సమస్యలను చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లానని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అన్నారు. యువగళం పేరుతో లోకేష్ చేపట్టిన పాదయాత్ర మహానాడు విరామం తరువాత మంగళవారం పున్నప్రారంభించారు.

ఈ యాత్ర 111వ రోజుకు చేరుకుంది. వైఎస్ఆర్ జిల్లా జమ్మలమడుగు విడిది కేంద్రం నుంచి పెద్దపసుపుల మోటు, సంజామల మోటు, కన్నెలూరు, ధర్మవరం, శేషారెడ్డిపల్లె, దేవగుడి వరకూ పాదయాత్ర సాగింది. ఆయా ప్రాంతాల్లో ప్రజలతో మాటామంతీ నిర్వహించారు. జమ్మలమడుగులో జరిగిన బహిరంగ సభలో లోకేష్ మాట్లాడుతూ ప్రజలు పడుతున్న ఇబ్బందుల గురించి తెలుసుకొని మహానాడులో భవిష్యత్తుకు గ్యారెంటీ పేరుతో సంక్షేమ కార్యక్రమాలు ప్రకటించామని తెలిపారు. మినీ మేనిఫెస్టోకే వైసిపి నాయకులు కంగారుపడిపోతున్నారని, పూర్తి మేనిఫెస్టో వస్తే వైసిపి దుకాణం బందేనని పేర్కొన్నారు. హామీలు అన్నీ ఎలా అమలు చేస్తారని వైసిపి నాయకులు ప్రశ్నిస్తున్నారన్నారు. జగన్ అప్పుల అప్పారావని, చంద్రబాబు సంపద సృష్టికర్తని తెలిపారు. ఇచ్చిన ఒక్క హామీనీ జగన్ పూర్తిగా అమలు చేయలేదని విమర్శించారు. సంపూర్ణ మద్యపాన నిషేధం తర్వాతే ఓట్లు అడుగుతానన్న జగన్ బూమ్ బూమ్, గోల్డ్ మెడల్, ప్రెసిడెంట్ మెడల్ లాంటి జే బ్రాండ్లు తీసుకొచ్చారని దుయ్యబట్టారు. వారంలో సిపిఎస్ రద్దు చేస్తానని 200 వారాలు దాటినా రద్దు చేయలేదన్నారు. 'నేను పేదవాడ్ని' అంటూ జగన్ ప్రజల చెవిలో క్యాలీఫ్లవర్ పెడుతున్నారని విమర్శించారు. రూ.లక్ష కోట్లు ఆస్తి ఉన్నవాడు పేదవాడా? రూ.లక్ష చెప్పులు వేసుకునే వాడు పేదవాడా? రూ.వెయ్యి వాటర్ బాటిల్ తాగేవాడు పేదవాడా? అని ప్రశ్నించారు. పాదయాత్రలో ఎమ్మెల్సీ శివనాథ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీలు దేవగుడి నారాయణరెడ్డి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి, జమ్మలమడుగు నియోజకవర్గ ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉపాధ్యాయ, ఉద్యోగ సమస్యలు పరిష్కరించాలి

మొదటి పేజీ తరువాయి

ధర్నాలు నిర్వహిస్తామని వెల్లడించారు. ఆగస్టు 4న తాలూకా స్థాయిలో 12 గంటల ధర్నా, ఆగస్టు 12న జిల్లా స్థాయి ర్యాలీ 24 గంటల ధర్నా, 25 నుంచి సెప్టెంబరు 1 వరకు రాష్ట్రంలో మూడు ప్రాంతాల నుంచి రాష్ట్రవ్యాప్త బైక్ జాతా చేపడతామని తెలిపారు. పోరాటమే సమస్యలను పరిష్కరిస్తుందనే విశ్వాసంతో కార్యాచరణను ప్రకటించామన్నారు. ఈ కార్యాచరణలో ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు కలిసి రావాలని కోరారు. ఈ సమావేశంలో ఫ్యాప్టో డిప్యూటీ సెక్రటరీ జనరల్ ఎల్ సాయి శ్రీనివాస్, చిరంజీవి, చింతల సుబ్బారావు, కోశాధికారి, కార్యదర్శి ఎంఎస్ ఇమామ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

కార్మిక సమస్యలపై రాజీలేని పోరు

మొదటి పేజీ తరువాయి

కార్మిక చట్టాలను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రద్దు చేసి యాజమాన్యాలకు అనుకూలంగా నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చి కార్మిక వర్గానికి తీరని ద్రోహం చేసిందని తెలిపారు. కార్పొరేట్, మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా ఐక్య పోరాటాలు నిర్వహించాలని కోరారు. యూనియన్ ఉపాధ్యక్షులు కె సుబ్బరావమ్మ అధ్యక్ష వహించారు. కర్నూలులోని కెకె భవన్‌లో సిఐటియు రాష్ట్ర నాయకులు పి.నిర్మల సిఐటియు జెండాను ఆవిష్కరించారు. సుర్జీత్ భవన్ వద్ద నిర్వహించిన సభలో సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.గౌస్ దేశాయ్ పాల్గొన్నారు. పాతబస్తీలో సీనియర్ నాయకులు రాజగోపాల్ సిఐటియు జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమాల్లో వారు మాట్లాడుతూ సోషలిస్టు సమాజ నిర్మాణ ఆశయంతో సిఐటియు ఆవిర్భవించిందని తెలిపారు. శ్రీకాకుళం జిల్లా రణస్థలం మండలం పైడిభీమవరంలోని పారిశ్రామికవాడలో రెడ్డీస్ లేబొరేటరీస్, యునైటెడ్ బ్రేవరీస్ పరిశ్రమల వద్ద, పలాస-కాశీబుగ్గ మున్సిపాల్టీలో సిఐటియు ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కాకినాడలో లక్ష్మీదాస్ భవనం వద్ద సిఐటియు జెండాను యూనియన్ నాయకులు ఆవిష్కరించారు. బిటి.రణదివే, పి.రామ్మూర్తి, పర్సా సత్యనారాయణ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తూర్పుగోదావరి, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాల్లో సిఐటియు ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు. గుంటూరు, కృష్ణా, ఎన్‌టిఆర్, పశ్చిమగోదావరి, ఏలూరు, అనంతపురం, ప్రకాశంతోపాటు రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోనూ సిఐటియు పతాకాన్ని ఆవిష్కరించారు. కార్మికులు, సిఐటియు, ప్రజా సంఘాల నేతలు పాల్గొన్నారు.

సమాచారం ఇక సరళీకృతం

- నెట్‌వర్క్ ఏరియాల్లో ప్రత్యేక అనుమతులు
- టవర్ల ఏర్పాటుపైనా కీలక నిర్ణయాలు
- మార్గదర్శకాలు జారీచేసిన ఐటిశాఖ



ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

రాష్ట్ర వ్యాప్తంగా నెట్‌వర్క్ రంగాన్ని ఏర్పాటుచేసేందుకు ఐటిశాఖ మార్గదర్శకాలు విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పలు రకాల సాంకేతిక రంగానికి అవసరమైన విధానాలను ఇందులో ప్రకటించింది. గిరిజన ప్రాంతాల్లోనూ సాంకేతిక సమస్యలు రాకుండా చర్యలు తీసుకోనుంది. 2016లో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఇండియన్ టెలిగ్రాఫ్ రైట్ ఆఫ్ వే రూల్స్‌ను సవరణలు చేసిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం కూడా ఈ మార్గదర్శకాలు విడుదల చేసింది. ప్రధానంగా నెట్‌వర్క్‌లను ఏర్పాటుచేసేందుకు ముందుకు వచ్చే సంస్థలకు అవసరమైన మౌలిక సౌకర్యాల కల్పనకు ప్రత్యేక దృష్టి సారించనుంది.

లైసెన్సులు పొందిన సర్వీసు ప్రొవైడర్లు చాలాకాలంగా స్పష్టమైన మార్గదర్శకాల కోసం ప్రభుత్వాన్ని కోరుతూ వస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే ఐటిశాఖ తాజా మార్గదర్శకాలు విడుదల చేసింది. ఈ మౌలిక సౌకర్యాల కోసం అనేక శాఖలకు బాధ్యతలు అప్పగించింది. గ్రామాల్లో ప్రయివేటు స్థలాలను కేటాయించాలంటే పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖకు, రాష్ట్ర ప్రభుత్వ స్థలాలు, భవనాల్లో కేటాయింపుల బాధ్యత అన్ని శాఖలకూ, విద్యుత్ సౌకర్యాలు కల్పించే బాధ్యతను డిస్కామ్‌లకూ అప్పగించింది. అటవీ ప్రాంతాల్లో నెట్‌వర్క్ సౌకర్యాల కల్పనకు అటవీశాఖకు అప్పగించగా, మరికొన్ని శాఖలను కూడా ఇందులో బాధ్యులుగా నిర్ణయిస్తూ, మొత్తం పర్యవేక్షణను ఐటిశాఖకు ప్రభుత్వం అప్పగించింది. దరఖాస్తులను పరిశీలించి భూగర్భ, భూ ఉపరితల ఏర్పాట్లు చేసేందుకు కూడా మార్గదర్శకాల్లో సూచనలు చేసింది. గ్రామాల్లో ఇంటర్‌నెట్, టెలీ కమ్యూనికేషన్ సౌకర్యాలను మెరుగుపరిచేందుకు ఈ చర్యలు తీసుకుంటున్నట్లు ఐటిశాఖ పేర్కొంది. నెట్‌వర్క్ ఏర్పాటు ప్రాంతాల్లో పచ్చదనం ఉండేలా, ప్రజలకు 'ఫ్రెండ్లీ టెలికామ్ సైట్స్' అందుబాటులో ఉండేలా చూడనుంది. ప్రతిఒక్కరికీ హై క్వాలిటీ బ్రాడ్‌బాండ్ సేవలు అందించేందుకు ఈ మార్గదర్శకాల్లో ప్రాధాన్యత ఇస్తున్నట్లు పేర్కొంది. స్థానిక కేబుల్ ఆపరేటర్లు కూడా గ్రామం చివరి వరకు సేవలు అందించేలా చూడాలన్న దానిపైనా దృష్టి సారించనుంది. నెట్‌వర్క్ ఏర్పాట్లు కారణంగా ఉత్పన్నమయ్యే రేడియేషన్‌పైనా ప్రజలను చైతన్యం చేయాలని నిర్ణయించింది. రాష్ట్ర స్థాయిలో అనుమతుల కోసం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నేతృత్వంలో పలు శాఖలతో కమిటీని కూడా ఏర్పాటుచేసింది. జిల్లా స్థాయిలో కలెక్టరు ఆధ్వర్యంలో కమిటీ ఉంటుందని పేర్కొంది.



సిఐటియు నూతన కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు



ర్యాలీలో పాల్గొన్న నర్సింగరావు

విద్యుత్ రంగ ప్రయివేటీకరణ సాగనివ్వం

- కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి : సిహెచ్ నర్సింగరావు
- నెల్లూరులో సిఐటియు కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి- నెల్లూరు ప్రతినిధి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యుత్ రంగాన్ని ప్రయివేటీకరించాలని చేస్తున్న ప్రయత్నాలను సాగనీయబోమని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు అన్నారు. నెల్లూరు జిల్లాలో మంగళవారం జరిగిన పలు కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. తొలుత ముత్తుకూరు మండలంలోని ఎపి జెన్‌కో థర్మల్ ప్రాజెక్టు వద్ద సిఐటియు జెండా ఆవిష్కరించారు. అక్కడ జరిగిన బహిరంగ సభలో నర్సింగరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యుత్ రంగాన్ని ప్రయివేటీకరించడానికి కుయుక్తులు పన్నుతున్నాయని తెలిపారు. కార్మిక వ్యతిరేక విధానాలను ఐక్య పోరాటాలతో తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఎపి జెన్‌కో నిర్వాసితులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. బ్రహ్మదేవి సబ్ స్టేషన్ వద్ద ఎలక్ట్రిసిటి ఎంప్లాయీస్ యూనియన్ పతాకాన్ని ఆవిష్కరించి మాట్లాడుతూ జూనియర్ లైన్‌మెన్‌లు సచివాలయం ఉద్యోగులో, డిపార్ట్‌మెంట్ ఉద్యోగులో ప్రభుత్వం తేల్చిచెప్పాలని, వారి విధులకు సంబంధించిన నిర్దిష్టమైన ఆదేశాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం నెల్లూరులో సిఐటియు జిల్లా కార్యాలయాన్ని నర్సింగరావు ప్రారంభించారు. తొలుత నెల్లూరు నగరంలోని ఆత్మకూరు బస్టాండ్ నుంచి పప్పుల వీధి వరకూ ర్యాలీ నిర్వహించారు. అక్కడ జరిగిన బహిరంగ సభలో నర్సింగరావు మాట్లాడారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ 11 కార్మిక సంఘాల ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా భారీ స్థాయిలో ఆందోళనలు జరగనున్నాయని, మోడీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఆగస్టులో కార్మిక సంఘాల ఆధ్వర్యాన వారం రోజులు పోరాటం చేయాలని పిలుపునిచ్చామని తెలిపారు. అందులో భాగంగా ఆగస్టు 7 నుంచి 15వ తేదీ వరకు దశల వారీ కార్యక్రమాన్ని రూపొందించి త్వరలో విధి విధానాలు ప్రకటించనున్నట్లు పేర్కొన్నారు. సిఐటియు ఆవిర్భావ దినోత్సవం రోజున నెల్లూరులో సిఐటియు జిల్లా కార్యాలయ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. సిఐటియు ఆవిర్భావం ఒక చారిత్రాత్మకత ప్రత్యేకతలో ఏర్పడిందని తెలిపారు. సిఐటియుతోనే కార్మికులకు రక్షణ అన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, సిఐటియు జిల్లా అధ్యక్షులు టి.వి.వి ప్రసాద్, జిల్లా కార్యదర్శి గోగుల శ్రీనివాసులు, జిల్లా ప్రధాన కార్యదర్శి కె.అజయ్‌కుమార్, మాజీ డిప్యూటీ మేయర్ మాదా వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.



ధర్నాను ఉద్దేశించి మాట్లాడుతున్న దడాల సుబ్బారావు

పిట్టీ ఇంజినీరింగ్ లాభాల్లో 25% వృద్ధి

హైదరాబాద్ : పిట్టీ ఇంజినీరింగ్ 2023 మార్చితో ముగిసిన త్రైమాసికంలో 25 శాతం వృద్ధితో రూ.25 కోట్ల నికర లాభాలు సాధించింది. రూ.5 ముఖ విలువ కలిగిన షేర్‌పై రూ.1.20 మధ్యంతర డివిడెండ్‌ను ప్రకటించింది. గడిచిన ఆర్థిక సంవత్సరంలో మొత్తంగా రూ.2.70 డివిడెండ్‌ను అందించినట్లయ్యింది. 2022-23లో సంస్థ స్థూల లాభాలు 13 శాతం పెరిగి రూ.59 కోట్లుగా, రెవెన్యూ రూ.1,118 కోట్లుగా నమోదయ్యింది.

మోడీ విధానాలతో 'ఉపాధి'కి తూట్లు

- ధర్నాలో ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు సుబ్బారావు

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

కేంద్రంలోని మోడీ ప్రభుత్వ విధానాలతో ఉపాధి చట్టానికి తూట్లు పడుతోందని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు విమర్శించారు. ఆ సంఘం ఆధ్వర్యంలో కాకినాడలోని ధర్నా చౌక్ వద్ద మంగళవారం ఉపాధి కార్మికులు ధర్నా నిర్వహించారు. బడ్జెట్లో నిధులు పెంచాలని, పని ప్రదేశంలో సౌకర్యాలు కల్పించాలని, అందరికీ వంద రోజుల పని కల్పించాలని, సగటు వేతనం పెంచాలని, రెండు పూటలా పనిని రద్దు చేయాలని నినదించారు. ఈ సందర్భంగా దడాల సుబ్బారావు మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తే చూస్తూ ఊరుకోబోమన్నారు. చట్టాన్ని రక్షించుకునేందుకు ఉధృత పోరాటాలు సాగిస్తామన్నారు.

కేంద్రంలో బిజెపి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ఉపాధి చట్టానికి గ్రహణం పట్టిందన్నారు. దేశంలో 15 కోట్ల మందికి ఉపాధి చూపిస్తున్న ఈ చట్టానికి నిధులు పెంచకపోగా తగ్గిస్తూ మోడీ సర్కారు తూట్లు పొడుస్తోందని విమర్శించారు. ఉపాధికి బడ్జెట్‌లో నిధులు పెంచాలని, 200 రోజులు పని కల్పించాలని, రూ.600 కనీస కూలి ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం ఉపాధి హామీ చట్టం ప్రాజెక్ట్ డైరెక్టర్ అడపా వెంకటలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు టేకుమూడి ఈశ్వరరావు, కెఎస్ శ్రీనివాస్, ఉపాధి కార్మికులు పాల్గొన్నారు. సిపిఎం జిల్లా కన్వీనర్ ఎం రాజశేఖర్, ఎపి కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి వల్లు రాజబాబు, ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు తిరుమలశెట్టి నాగేశ్వరరావు పాల్గొని మద్దతు తెలిపారు.

పిడుగుపాటుకు ముగ్గురు దుర్మరణం

- పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో వర్షాలు
- కూలిన విద్యుత్తు స్తంభాలు, కొబ్బరి చెట్లు

ప్రజాశక్తి- యంత్రాంగం

రాష్ట్రంలోని పలు జిల్లాల్లో మంగళవారం ఉరుము, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిశాయి. పిడుగులు పడి ముగ్గురు దుర్మరణం చెందారు. వారిలో ఇద్దరు గొర్రెల కాపర్లు, ఒక పూజారి ఉన్నారు. ప్రకాశం, బాపట్ల జిల్లాల్లో పలుచోట్ల భారీ వర్షాలు పడ్డాయి. ప్రకాశం జిల్లా ఒంగోలు శివారులోని దామచర్ల కాలనీ ప్రాంతంలో విరాట్ నగర్‌కు చెందిన పి.రాము (60) మేకలను కాస్తుండగా భారీ వర్షం కురిసింది. దీంతో, ఆయన తన మేకలు, పెంపుడు కుక్కతోపాటు చెట్టు కిందకు వెళ్లారు. ఆ చెట్టుపై పిడుగు పడడంతో రాము అక్కడికక్కడే మృతి చెందారు. రెండు మేకలు, కుక్క మరణించాయి. నాగులుప్పలపాడు మండలం చదలవాడ గ్రామంలో ఎద్దు వెంకట రమణ (46) గొర్రెలను మేపుకునేందుకు అగ్రహారం పొలాల్లోకి వెళ్లారు. ఆ సమయంలో పిడుగుపడడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందారు. బాపట్ల జిల్లా మార్టూరులోని రామ్ జనార్ధన్ కాలనీకి చెందిన పూజారి రాచగిరి వెంకటస్వామి (39) బల్లికురవలో జరిగిన ఓ కార్యక్రమానికి హాజరై మరో వ్యక్తితో కలిసి బుల్లెట్ బండిపై తిరిగి వస్తున్నారు. నాగరాజుపల్లి గ్రామం వద్ద వారికి సమీపంలో పిడుగుపడింది. దీంతో, బుల్లెట్‌పై వెనుక కూర్చున్న వెంకటస్వామి అక్కడికక్కడే మృతి చెందారు.

ఆ వాహనాన్ని నడుపుతున్న పోలేశ్వరరావు తీవ్రంగా గాయపడ్డాడు. భారీ వర్షానికి ఉధృతంగా పారుతున్న బాపట్ల జిల్లా మార్టూరు-యద్దనపూడి మధ్యగల చప్టాపై వస్తున్న పర్చూరు మండలం బొడవాడ గ్రామానికి చెందిన కూనంనేని వీరాంజనేయులు బైక్‌తో సహా కొట్టుకుపోయాడు. వాగు మధ్యలో ఉన్న చెట్టు కొమ్మలను పట్టుకొని రక్షించండి అంటూ బిగ్గరగా కేకలు వేయడంతో స్థానికులు గమనించి పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు రెండు గంటలు శ్రమించి తాళ్ల సహాయంతో ఆయనను బయటకు సురక్షితంగా తీసుకొచ్చారు. కాకినాడ జిల్లా కాజులూరు మండలంలో ఈదురుగాలులతో కూడి భారీ వర్షానికి పలుచోట్ల విద్యుత్ స్తంభాలు, కొబ్బరి చెట్లు కూలిపోయాయి. విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం కలిగింది. తూర్పుగోదావరి జిల్లా రంగంపేట, రాజానగరం, పెరవలి, చాగల్లు మండలాల్లో గంటపాటు భారీ వర్షం కురిసింది. కోనసీమ జిల్లా వ్యాప్తంగా ఉదయం నుంచి సాయంత్రం వరకూ జల్లులు పడుతూనే ఉన్నాయి. అల్లూరి సీతారామరాజు జిల్లా కేంద్రం పాడేరుతోపాటు పలు మండలాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. జి.మాడుగుల వారపు సంతకు వచ్చిన గిరిజనులతోపాటు వ్యాపారులు వర్షం వల్ల తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

విధ్వంస పాలనకు నాలుగేళ్లు

- టిడిపి అధినేత చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో విధ్వంస పాలన మొదలై నాలుగేళ్లు పూర్తి చేసుకుని 5వ ఏడాదిలోకి అడుగుపెట్టిందని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. వైసిపి ప్రభుత్వ నాలుగేళ్ల పాలనపై మంగళవారం ట్విట్టర్‌లో వ్యంగ్యంగా ట్వీట్ చేశారు. మొదటిరోజు ప్రజావేదిక కూల్చివేత నిర్ణయంతో విధ్వంసం మొదలైందని అన్నారు. 'ప్రజా వేదిక కూల్చివేతకు ఆదేశాలు ఇస్తూ ఫస్ట్ డిమాలిషన్ విల్ స్టార్ట్ ఫ్రం దిస్ బిల్డింగ్' అంటూ జగన్ వ్యాఖ్యానించారన్నారు. మొదట చెప్పిన తమ విధ్వంస విధానాన్నే జగన్ ప్రభుత్వం నిత్యం పాటిస్తుందని విమర్శించారు.

కుటుంబరావు మృతి పట్ల విచారం

ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు మండవ కుటుంబరావు మృతి పట్ల చంద్రబాబు విచారం వ్యక్తం చేశారు. తిరుమల తిరుపతి దేవస్థానానికి నిరంతరం కూరగాయలు పంపుతూ నిత్యాన్నదాన కార్యక్రమంలో అందరినీ కుటుంబరావు భాగస్వాములను చేసేవారని తెలిపారు.

నకిలీ కరెన్సీ హల్‌చల్

- 14% పెరిగిన రూ.500 దొంగ నోట్లు
- ఇప్పటికీ నగదే కింగ్
- ఆర్‌బిఐ వార్షిక నివేదిక వెల్లడి



ముంబయి : దేశంలో నకిలీ కరెన్సీ నోట్లు హల్‌చల్ చేస్తున్నాయి. 2023 మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో 2,25,769 దొంగ నోట్లు పట్టుబడ్డాయి. ఇందులో అత్యధికంగా రూ.500 నోట్లు ఉన్నాయి. ఆర్థిక సంవత్సరం 2022-23నకు సంబంధించి ఆర్‌బిఐ తన వార్షిక రిపోర్ట్‌ను మంగళవారం విడుదల చేసింది. దీనిలో నకిలీ కరెన్సీ, నగదు చెలామణీ, వృద్ధి రేటు, కరెన్సీ ముద్రణ వ్యయం, ఆర్‌బిఐ బ్యాలెన్స్ షీట్ తదితర వివరాలను వెల్లడించింది. ఆ అంశాలు.. "అన్ని నోట్ల కంటే రూ.500 నోట్లలోనే ఎక్కువ నకిలీలు చలామణీలో ఉన్నాయి. 2022-23లో మొత్తం 91,110 నోట్లను గుర్తించారు. ఇంతక్రితం ఏడాది రూ.500 దొంగ నోట్లతో పోల్చితే.. 14.4 శాతం పెరుగుదల చోటు చేసుకుంది. అదే విధంగా 78,699 రూ.100 నోట్లు, 27,258 రూ.200 నోట్లు, 9,806 రూ.2వేల నోట్లను గుర్తించింది. స్థూలంగా రూ.10, రూ.100, రూ.2000 డినామినేషన్లలో గుర్తించిన నకిలీ నోట్లు 11.6 శాతం తగ్గాయి. 2021-22లో బ్యాంకింగ్ రంగంలో గుర్తించిన మొత్తం 2,30,971 నకిలీ కరెన్సీ నోట్లు కాగా, 2022-23 సంవత్సరంలో 2,25,769 నోట్లకు తగ్గింది. మొత్తం నకిలీ కరెన్సీ నోట్లలో ఆర్‌బిఐ వద్ద 4.6 శాతం, ఇతర బ్యాంకుల్లో 95.4 శాతం చొప్పున గుర్తించడం జరిగింది." అని రిజర్వ్ బ్యాంక్ తన రిపోర్ట్‌లో తెలిపింది.

డిజిటల్ లావాదేవీలు పెరుగుతున్నప్పటికీ దేశంలో నగదు చాలామణీనే ఇప్పటికీ రారాజులా కొనసాగుతోంది. "2022-23లో కరెన్సీ నోట్ల చలామణి విలువ 7.8 శాతం పెరిగింది. ఇదే సమయంలో నోట్ల సంఖ్య 4.4 శాతం పెరిగింది. చలామణిలో ఉన్న మొత్తం కరెన్సీ నోట్ల విలువలో రూ.500, రూ.2,000 నోట్ల విలువే 87.9 శాతం. ఇది 2021- 22లో 87.1 శాతంగా ఉంది. 2023 మార్చి 31 నాటికి చలామణిలో ఉన్న నోట్లలో సంఖ్యాపరంగా రూ.500 నోట్లే ఎక్కువ. వీటి వాటా 37.9 శాతం. తర్వాత రూ.10 నోట్లు 19.2 శాతం ఉన్నాయి. మొత్తం 5,16,338 లక్షల రూ.500 నోట్లు చలామణిలో ఉన్నాయి. వీటి విలువ రూ.25,81,690 కోట్లుగా ఉంది. రూ.2,000 నోట్లలో 4,55,468 లక్షలు చలామణిలో ఉన్నాయి. వీటి విలువ రూ.3,62,220 కోట్లుగా ఉంది. 2021-22తో పోలిస్తే చలామణిలో ఉన్న రూ.2 వేల నోట్ల సంఖ్యలో 1.3 శాతం తగ్గుదల చోటు చేసుకుంది. రూ.10.69 కోట్ల హోల్‌సేల్ ఇ-రూపీలు, రూ.5.70 కోట్ల రిటైల్ ఇ-రూపీలో చలామణీలో ఉన్నాయి. నోట్ల ముద్రణ కోసం 2022- 23లో రూ.4,682.80 కోట్లు వ్యయం అయ్యింది. ఇంతక్రితం ఏడాది ఇది రూ.4,984.80 కోట్లు ఖర్చు అయ్యింది." అని ఆర్‌బిఐ వెల్లడించింది.

రూ.2.30 లక్షల కోట్ల బంగారం నిల్వలు

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2023-24లో భారత వృద్ధి పెరగనుందని ఆర్‌బిఐ వార్షిక రిపోర్ట్‌లో అంచనా వేసింది. కమోడిటీ ధరలు, ద్రవ్యోల్బణం తగ్గుతున్నందున్న జిడిపికి మద్దతు లభించనుందని పేర్కొంది. 2022-23లో అధిక ఆదాయం ద్వారా ఆర్‌బిఐ బ్యాలెన్స్ షీట్ 2.5 శాతం పెరిగి రూ.63.45 లక్షల కోట్లకు చేరింది. ఇది ఇంతక్రితం ఏడాది రూ.61.90 లక్షల కోట్లుగా ఉంది. గడిచిన ఆర్థిక సంవత్సరం ఆర్‌బిఐ ఆదాయంలో 47.06 శాతం వృద్ధి చోటు చేసుకోగా.. వ్యయం 14.05 శాతం పెరిగింది. మిగులు నిధులు 188 శాతం వృద్ధితో రూ.87,416 కోట్లుగా నమోదయ్యాయి. ఇంతక్రితం 2021-22లో రూ.30,307 కోట్ల మిగులు నిధులు చోటు చేసుకున్నాయి. మిగులు నిధుల నుంచే కేంద్రానికి డివిడెండ్ రూపంలో చెల్లిస్తుంది. ఆర్‌బిఐ వద్ద మొత్తం బంగారం 760.42 మెట్రిక్ టన్నుల నుంచి 794.63 మెట్రిక్ టన్నులకు చేరింది. విలువ పరంగా 17.20 శాతం పెరిగి రూ.2,30,733.95 కోట్లకు చేరింది. ఇది 2022 మార్చి ముగింపు నాటికి రూ.1,96,864.38 కోట్లుగా ఉంది.

సంపాదకీయం

ఏమున్నది గర్వకారణం!

ఎన్నేళ్లు పాలించినా ఏమున్నది గర్వకారణం అన్నట్టుగా నరేంద్ర మోడీ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వం తీరుంది. అభివృద్ధి నినాదాలు, ప్రజాకర్షక వాగ్దానాల ప్రచార పటాటోపం మధ్య మతతత్వ అజెండాను దాచిపెట్టి అధికారంలోకి వచ్చి తొమ్మిదేళ్లు పూర్తయింది. నెహ్రూ, ఇందిర, మన్మోహన్‌ల తరువాత అత్యధిక కాలం పాలించిన నరేంద్ర మోడీ ఈ కాలంలో అద్భుత విజయాలు సాధించినట్లు కార్పొరేట్, సోషల్ మీడియా, వాట్సాప్ యూనివర్శిటీలు చేస్తున్న అట్టహాసపు ప్రచారం ఎలా ఉన్నా... వాస్తవాలు ఆందోళనకరంగా ఉన్నాయి.

విదేశాలకు తరలించిన నల్లడబ్బు వెలికితీసి ప్రతి ఒక్కరి బ్యాంకు ఖాతాలో రూ.15 లక్షలు జమ చేస్తామని, స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం పంటలకు కనీస మద్దతు ధర ఇస్తామని, ఏటా రెండు కోట్ల ఉద్యోగాలిస్తామని... ఇలా ఎన్నో వాగ్దానాలు 2014 ఎన్నికల్లో గుప్పించిన మోడీ సర్కారు... ఆచరణలో మొండిచేయి చూపింది. నోట్ల రద్దు నుంచి... పార్లమెంట్ నూతన భవన ప్రారంభోత్సవం వరకూ అన్నింటా నియంతృత్వ ధోరణి తాండవించింది. అన్ని రాజ్యాంగ వ్యవస్థలపైనా దాడిచేసింది. కార్పొరేట్, మతతత్వ అజెండాను ముందుకు తీసుకెళ్లేందుకు అత్యంత నిరంకుశంగా వ్యవహరిస్తోంది. కోవిడ్ ముసుగులో 2020లో తీసుకొచ్చిన మూడు వ్యవసాయ చట్టాలను, వ్యవసాయ రంగంలో కార్పొరేటీకరణ లక్ష్యంగా కేంద్రం తీసుకొచ్చింది. ఢిల్లీలో రైతుల చారిత్రాత్మక పోరు నేపథ్యంలో... ప్రధాని రైతులకు క్షమాపణలు చెప్పి నల్ల చట్టాలను ఉపసంహరించుకోవడంతో వ్యవసాయరంగాన్ని కబళించాలనుకున్న ప్రైవేటు సంస్థలకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఉపాధి హామీ చట్టం ఊపిరితీసేందుకు నిధులకోత, అడ్డగోలు నిబంధనలుసహా... అనేక యత్నాలు చేస్తోంది.

ఈ తొమ్మిదేళ్లలో ప్రజలు ఎన్నటికీ మరిచిపోని కష్టాలు తెచ్చిన వాటిలో నోట్ల రద్దు ఒకటి. నల్లధనం, అవినీతిని అరికడతామని, ఉగ్రవాద కార్యకలాపాలకు నిధులు అరికట్టడం, నకిలీ నోట్లను అంతం చేయడం వంటి లక్ష్యాలతో 2016 నవంబర్ 8వ తేదీ రాత్రి ప్రధాని ప్రకటించిన నోట్ల రద్దు ఓ పెద్ద ప్రహసనం. చెలామణిలో ఉన్న 86 శాతం కరెన్సీని ఉపసంహరించుకోవడంతో ఆర్థిక వ్యవస్థ అతలాకుతలమైంది. దేశంలోని సమాఖ్య వ్యవస్థను విచ్ఛిన్నం చేసి, రాష్ట్రాలను ఆర్థికంగా కుంగదీసే లక్ష్యంతో జిఎస్‌టిని తీసుకొచ్చారన్న విమర్శలు నిజమని కేంద్రం గత తొమ్మిదేళ్లలో వ్యవహరించిన తీరు రుజువు చేస్తోంది. బిజెపియేతర పార్టీలు పాలిస్తున్న రాష్ట్రాలకు నిధులు విడుదలలో మొండిచేయి చూపుతోంది. కేంద్ర దర్యాప్తు సంస్థలతో దాడులు చేయిస్తూ అస్థిర పరుస్తోంది. గవర్నర్లు, లెఫ్టినెంట్ గవర్నర్ల ద్వారా ఆటంకాలు కలిగిస్తోంది. ఎనిమిది బిజెపియేతర ప్రభుత్వాలను కుప్పకూల్చడం మోడీ మార్కు నిరంకుశత్వానికి పరాకాష్ట. జమ్ముకాశ్మీర్‌కు ప్రత్యేక హోదా తొలగింపు, పౌరసత్వ సవరణ చట్టం, కొత్త పార్లమెంటు భవనాన్ని ప్రారంభించిన విధానం, రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పును తుంగలో తొక్కుతూ ఢిల్లీ ప్రభుత్వంపై లెఫ్టినెంట్ గవర్నర్ పెత్తనం చేసేలా ఆర్డినెన్స్ జారీ చేయడం మోడీ ప్రభుత్వ నిరంకుశత్వానికి నిదర్శనాలు.

అమూల్ బ్రాండ్ పేరుతో పాల ఉత్పతుల్లో దేశవ్యాప్తంగా జోక్యం చేసుకుని స్థానిక డెయిరీల గొంతు నులిమేస్తోంది. సహకార మంత్రిత్వశాఖను కేంద్రంలో ఏర్పాటు చేసి హోం మంత్రి అమిత్‌షా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి రాష్ట్రాల వనరులను దోచుకోవడమే కార్యక్రమంగా పెట్టుకుంది. అదే సమయంలో కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు, వారికి కొమ్ముకాసేందుకు నిర్లజ్జగా ప్రయత్నిస్తోంది. అదానీ కుంభకోణాలకు సంబంధించి హిండెన్‌బర్గ్ నివేదికపై చర్చించాలని ప్రతిపక్షాలు పట్టుబట్టడంతో పార్లమెంట్ జరగకుండా అడ్డుకోవడం మోడీ మార్కు తిరోగమన చర్య! 2014లో 7.1 బిలియన్ల డాలర్ల పెట్టుబడులతో ప్రపంచంలో 609వ స్థానంలో ఉన్న అదానీ సంస్థ 2022 నాటికి 200 బిలియన్ డాలర్ల పెట్టుబడులతో రెండో అత్యంత సంపన్న పెట్టుబడిదారుగా ఎదిగింది. రష్యా నుంచి కారుచౌకగా లభిస్తున్న పెట్రో ఉత్పత్తులను విదేశాలకు ఎగుమతి చేసి అంబానీ నేతృత్వంలోని రిలయన్స్ భారీగా లాభపడగా, గ్యాస్, పెట్రో ధరలపై సర్ ఛార్జీలతో సామాన్యుడు బతుకు ఛిద్రమవుతోంది. కేంద్రం బాధ్యతలేని తనానికి ఇదొక నిదర్శనం! బిబిసి డాక్యుమెంటరీపై నిషేధం, రాహుల్‌గాంధీపై అనర్హత వేటు, తాజాగా రెజ్లర్లపై అమానుష దాడి... ఇలా మోడీ సర్కారు నిరంకుశత్వాన్ని చాటే ఉదాహరణలెన్నో! ఈ విధంగా మోడీ ప్రభుత్వ తొమ్మిదేళ్ల పాలన కార్పొరేట్లకు వరంగాను, సామాన్యులకు శాపంగాను పరిణమించింది. ఈ కార్పొరేట్, హిందుత్వ ప్రభుత్వాన్ని ఎంత త్వరగా సాగనంపితే దేశానికి అంత మంచిది. 2024 సార్వత్రిక ఎన్నికలు ఇందుకు ఒక చక్కని అవకాశం.

మంచి మాట



ఈ ప్రభుత్వాలెంత మూర్ఖమైనవి! ఇంతటి మహోద్యమాన్ని బలప్రయోగంతో అణచవచ్చుననుకుంటాయి.

- ఫ్రెడరిక్ ఏంగెల్స్



అంతర్జాతీయం

ఆంక్షలే అస్త్రంగా అమెరికా!

కొట్టవద్దు తిట్టవద్దు, పొమ్మనకుండా పొగబెట్టు...ఎలా దారికి రారో చూద్దాం...అన్నట్లుగా ఆర్థిక ఆంక్షలను ఆయుధాలుగా చేసుకొని అమెరికా, పశ్చిమ దేశాలు, సామ్రాజ్యవాదులు, వాటి తొత్తులు అనేక దేశాల మీద దాడులు చేస్తున్నాయి. ఇటీవలి కాలంలో ఇవి బాగా పెరిగాయి. వాషింగ్టన్ కేంద్రంగా పని చేస్తున్న ఆర్థిక మరియు విధాన పరిశోధనా కేంద్రం (సిఇపిఆర్) "ఆర్థిక ఆంక్షల మానవీయ పర్యవసానాలు" అనే శీర్షికతో ఒక అధ్యయనాన్ని ప్రచురించింది. మానవ హక్కులు, ప్రజాస్వామ్యం వంటి పెద్ద కబుర్లు చెప్పే పశ్చిమ దేశాల దుర్మార్గాన్ని అది ఎండగట్టింది.

ఆంక్షలలో రెండు రకాలు, ఐరాస విధించేవి ఒక తరగతి. ఇవి స్వంత పౌరుల పట్ల లేదా ఇతర దేశాల మీద కాలు దువ్వే పాలకులను దారికి తెచ్చేందుకు సమిష్టిగా విధించేవి. ఐరాసతో నిమిత్తం లేకుండా కర్ర ఉన్న వాడితే గొర్రె అన్నట్లుగా తమకు లొంగని దేశాలు, సంస్థలు, వ్యక్తుల మీద ఏకపక్షంగా అమెరికా, దాని మిత్ర దేశాలు విధించేవి రెండవ కోవకు చెందినవి. కేవలం కమ్యూనిస్టులుగా ఉన్నందుకు, ప్రపంచమంతటా కమ్యూనిజాన్ని అరికట్టే మొనగాడిగా ఉన్న తమకు కూతవేటు దూరంలోనే ఒక సోషలిస్టు దేశం ఉనికి లోకి రావటాన్ని సహించలేని అహంతో అమెరికాలో ఏ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటికీ అమానవీయ ఆంక్షలను క్యూబా మీద అమలు జరుపుతున్న సంగతి తెలిసిందే.




ఎం. కోటేశ్వరరావు

1992 నుంచీ ప్రతి ఏటా 2020లో కరోనా కారణంగా తప్ప వాటిని ఖండిస్తూ ఐరాస సాధారణ అసెంబ్లీలో తీర్మానం పెట్టటం దాన్ని అమెరికా, ఇజ్రాయెల్ వ్యతిరేకించటం, అమెరికా వత్తిడిని తట్టుకోలేక కొన్ని దేశాలు ఓటింగ్‌కు దూరంగా ఉండటం తప్ప మిగిలిన దేశాలన్నీ ఖండించినా అమెరికా ఖాతరు చేయటం లేదు.

ఐరాస విధించేవి తప్ప భద్రతా మండలి అనుమతి లేని మిగిలిన ఆంక్షలన్నీ చట్టవిరుద్ధమైనవే. దేశమంటే మట్టి కాదు, మనుషులు అని చెప్పిన మహాకవి గురజాడ ప్రకారం అనేక దేశాలను అనేకంటే అక్కడి పౌరుల జీవితాలను అతలాకుతలం చేస్తున్న ఈ దుర్మార్గాలను నిరోధించే సత్తా ఐరాసకు లేదు. 1960 దశకం నాటికి ప్రపంచంలోని నాలుగు శాతం దేశాలు ఐరాస, అమెరికా, ఐరోపా సమాఖ్య ఆంక్షలకు గురికాగా ప్రస్తుతం 54 దేశాలు లేదా 27 శాతానికి చేరాయి. వీటి జిడిపి నాలుగు నుంచి 29 శాతానికి పెరిగింది. ఇది ఆందోళన కలిగించే అంశం. ఇటీవలి పరిణామాలను చూస్తే బరాక్ ఒబామా ఏలుబడిలో సంస్థలు లేదా వ్యక్తుల మీద ఏడాదికి 544 కొత్త ఆంక్షలు విధిస్తే అవి ట్రంప్ కాలంలో 975, వర్తమాన జో బైడెన్ ఇప్పటి వరకు సగటున 1,151గా ఉన్నాయి. దీర్ఘకాలంగా అమల్లో ఉన్నవాటిలో క్యూబా మీద 1960 దశకం నుంచి అమలు జరుగుతుంటే ఇరాన్ మీద 1979, ఆఫ్ఘనిస్తాన్ మీద 1999 నుంచి అమల్లో ఉన్నాయి. ఐరాస మానవ హక్కుల మండలి 2014లో ఆమోదించిన తీర్మానంలో ఏకపక్ష ఆంక్షలు పౌరుల మీద చూపుతున్న ప్రతికూల ప్రభావాలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నట్లు పేర్కొన్నది. ఆ తరువాత తీవ్రత, సంఖ్య రీత్యా ఇంకా పెరిగాయి తప్ప తగ్గలేదు.

ఔషధాల దగ్గర నుంచి అన్నింటి మీద అమెరికా విధించిన ఆంక్షల వలన క్యూబా అపార నష్టానికి గురైంది. ఒక దశలో వ్యవసాయ పరికరాలైన ట్రాక్టర్ల వంటి వాటికి కూడా డీజిలు, పెట్రోలు దొరక్క గుర్రాలతో సాగు చేసుకోవాల్సి వచ్చింది. క్యూబా మీద ఆంక్షల వలన తమకు జరిగిన నష్టం గురించి అమెరికా సంస్థలు కూడా గగ్గోలు పెట్టాయి. ఎవడి గోల వాడిది. క్యూబా పాలసీ ఫౌండేషన్ అనే సంస్థ 2002లో వేసిన అంచనా ప్రకారం ఏటా అమెరికా ఆర్థిక వ్యవస్థకు 360 కోట్ల డాలర్ల నష్టం జరిగింది. తరువాత అక్కడి కార్పొరేట్ల ఒత్తిడి మేరకు ఆంక్షలను సడలించటంతో 2000-2006 కాలంలో అమెరికా వార్షిక ఎగుమతులు 60 లక్షల నుంచి 35 కోట్ల డాలర్లకు పెరిగాయి. అయినప్పటికీ తమకు ఏటా 120 కోట్ల డాలర్ల మేర నష్టం జరుగుతున్నట్లు 2009లో అమెరికా ఛాంబర్ ఆఫ్ కామర్స్ పేర్కొన్నది. ప్రారంభం నుంచి తమకు 753 బి.డాలర్ల నష్టం జరిగిందని క్యూబా సర్కార్ చెప్పింది. అమెరికాకు ఏటా 484 కోట్ల డాలర్ల మేర, క్యూబాకు 68.5 కోట్ల డాలర్ల మేర నష్టం జరిగినట్లు క్యూబా పాలసీ ఫౌండేషన్ అంచనా వేసింది. భిన్నమైన అంశాల ప్రాతిపదికన చెప్పే ఈ అంచనాలు ఒకదానికి ఒకటి పొసగవు. ఉదాహరణకు 2015లో అల్ జజీరా ప్రచురించిన ఒక విశ్లేషణ ప్రకారం ఆంక్షలు ప్రారంభమైన 55 సంవత్సరాలలో క్యూబాకు 1.1 లక్షల కోట్ల నష్టం జరిగింది.

ఇరాన్ మీద విధించిన ఆంక్షల కారణంగా ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకటించిన అత్యవసర ఔషధాల జాబితాలోని 32తో సహా 73 ఔషధాలకు అక్కడ కొరత ఏర్పడింది. ఆఫ్ఘనిస్తాన్‌లో తలసరి ఆదాయం దారుణంగా తగ్గింది. 2021లో అమెరికాతో చేసుకున్న ఒప్పందం ప్రకారం తాలిబాన్లు తిరిగి అధికారంలోకి వచ్చిన తరువాత అదే అమెరికా, ఐరోపా సమాఖ్య 960 కోట్ల డాలర్ల విలువగల ఆఫ్ఘన్ ఆస్తులను స్వాధీనం చేసుకున్నాయి. ఇది ఆ దేశ జిడిపిలో సగం. ఆంక్షల కారణంగా విదేశాల నుంచి ఏటా వచ్చే 80 కోట్ల డాలర్ల మేర నిలిచిపోయాయి. వెనెజులా మీద 2017లో విధించిన ఆంక్షల కారణంగా 2020 నాటికి దేశ దిగుమతులు 91 శాతం తగ్గాయి. దాదాపు పూర్తిగా దిగుమతుల మీదనే ఆహారం సమకూర్చుంటున్న వెనెజులా దిగుమతులు 78 శాతం పడిపోయాయి. చమురు ఎగుమతులపై ఆంక్షల కారణంగా జీవన ప్రమాణాలు తగ్గి శిశు, సాధారణ మరణాల రేటు పెరిగింది. తమ ఆంక్షల కారణంగా ఇబ్బందులు పడిన జనం ఇరాన్, వెనెజులా పాలకులపై తిరుగుబాటు చేసే విధంగా పురికొల్పటమే లక్ష్యమని అమెరికా విదేశాంగశాఖ మాజీ మంత్రి మైక్ పాంపియో గతంలో చెప్పాడు. ప్రపంచ భద్రత, ప్రజాస్వామ్యం, మానవ హక్కుల పేరుతో ఇలాంటి దుర్మార్గమైన ఎత్తుగడలను అమలు చేస్తున్నారు. ఆంక్షలు ప్రకటించిన ఏ దేశంలోనైనా జనాన్ని ఇబ్బంది పెట్టటం తప్ప వీటిని సాధించలేదు. అవి సమర్థించే అనేక దేశాల్లో వాటి జాడే కనపడదు. సోషలిస్టు బాట నుంచి వైదొలిగేట్లుగా లేదా



దేశం పేరు	మొత్తం ఆంక్షలు	2022 ఫిబ్రవరి	2022 ఫిబ్రవరి తరువాత
రష్యా	14,081	2,754	11,327
ఇరాన్	4,191	3,616	575
సిరియా	2,644	2,598	46
ఉ.కొరియా	2,133	2,052	81
బెలారస్	1,154	788	366
వెనెజులా	651	-	-

తనకు అనుకూలంగా మార్చుకొనేట్లు క్యూబా మీద అమలు జరుపుతున్న ఆంక్షల ప్రభావం ఏమాత్రం లేదని విలియం లియోగ్రాండే అనే విశ్లేషకుడు చెప్పాడు. ప్రాణాలైనా ఇస్తాంగానీ అమెరికాకు లొంగేది లేదన్న కమ్యూనిస్టుల ప్రత్యేకత ఇది.

అన్ని దేశాల మీద ప్రకటిస్తున్న ఆంక్షల లక్ష్యం కూడా లొంగదీసుకోవటమే. అణు పరీక్షలు జరుపుతున్నదనే కారణంతో ఇరాన్ మీద భద్రతా మండలి విధించిన ఆంక్షలు కొన్ని కాగా దానితో నిమిత్తం లేకుండా అమెరికా, ఇతర దేశాలు విధించినవి మరికొన్ని. అణు కార్యమం నిలిపివేతకు అంగీకరించిన ఇరాన్‌తో దానికి ప్రతిగా స్పందించాల్సిన అమెరికా ఏకపక్షంగా ఒప్పందం నుంచి వైదొలిగింది. తమ భద్రతకు ముప్పుతెచ్చే ఎత్తుగడలో భాగంగా ఉక్రెయిన్‌ను నాటోలో చేర్చుకోవద్దన్న రష్యా వినతిని ఖాతరు చేయకుండా ముందుకు పోతుండటంతో తప్పనిసరై సైనిక చర్యకు దిగిన పుతిన్‌పై ఆంక్షలు విధించి దేశ ఆర్థిక రంగాన్ని దెబ్బతీసి జనాన్ని వీధుల్లోకి తెచ్చి పుతిన్ సర్కార్‌ను గద్దె దింపాలని అమెరికా చూసింది. వాణిజ్య పోరు పేరుతో చైనాను తన దారికి తెచ్చేందుకు అంతకు ముందే పూనుకుంది. వివిధ సందర్భాలలో మనతో సహా అనేక దేశాలను బెదిరించటం చూస్తున్నదే.

ఉక్రెయిన్ మీద మిలిటరీ దాడులు జరుపుతున్నదనే కారణంతో రష్యాకు చెందిన సంస్థలు, వ్యక్తుల మీద ఆంక్షలు విధించారు. రష్యా ఐటి, ఇంజనీరింగ్ వంటి రంగాలకు అవసరమైన వస్తువులు, సేవల ఎగుమతుల మీద బ్రిటన్ నిషేధం విధించింది, 70 శాతం సెమీ కండక్టర్ల ఎగుమతులు నిలిచాయి. అమెరికా, ఇతర నాటో దేశాల చమురు, గ్యాస్ ఎగుమతుల నిషేధం, చమురు ధరలపై ఆంక్షల గురించి తెలిసిందే. దేశాల వారీ చూస్తే అమెరికా 374, కెనడా 156, బ్రిటన్ 95, ఐరోపా సమాఖ్య 44, స్విడ్జర్లాండ్ 42, ఆస్ట్రేలియా 28 చొప్పున కొత్త ఆంక్షలు విధించాయి. ఇరాన్ మీద కొత్తగా 115 ఆంక్షలు ఈ దేశాలు విధించాయి. హిరోషిమాలో ఇటీవల జరిగిన జి7 దేశాల శిఖరాగ్ర సమావేశానికి ముందు పలు ఆంక్షలకు తెరతీశారు. వాటి వివరాలు ఇంకా వెల్లడి కావాల్సి ఉంది. ఇప్పటికే అమలు జరుపుతున్న ఆంక్షల వలన రష్యా ప్రభావితం అవుతున్నది. చమురును ఆరవై డాలర్లకు మించి కొనకూడదన్న ఆంక్ష వలన గానీ రాయితీ ధరలకు వివిధ దేశాలకు అమ్ముతున్న కారణం కావచ్చు. ప్రస్తుత రష్యా చమురు సగటు ధర 58.62 డాలర్లు ఉంది. ఆర్మీనియా నుంచి అది దిగుమతి చేసుకున్న ఎలక్ట్రానిక్స్ 3,700 శాతం పెరిగాయి. వివిధ దేశాల మీద 2023 ఫిబ్రవరి 22 నాటికి విధించిన ఆంక్షల సంఖ్య గురించి స్టాటిస్టా సమాచారం ఇలా (పట్టిక) ఉంది.

చైనా మార్కెట్‌లో మరింతగా తన వస్తువులను అమ్ముకొనేందుకు, దిగుమతులను అడ్డుకొనేందుకు, చైనాకు అధునాతన సాంకేతిక పరిజ్ఞానం అందకుండా చూసేందుకు అమెరికా ఆంక్షలను అమలు జరుపుతోంది. 2008లో రెండు కొత్త ఆంక్షలను విధించగా తరువాత 2018 నాటికి వాటిని 59కి పెంచింది. తరువాత నాలుగు సంవత్సరాలలో 29,300,89,36 కొత్తగా విధించింది. వీటిలో ఇటీవలి కృత్రిమ మేధ, సెమీకండక్టర్ల ఎగుమతుల మీద విధించిన ఆంక్షలు తీవ్రమైనవి. తద్వారా చైనా ఆర్థిక రంగాన్ని కుదేలు కావించాలని చూస్తున్నది. 2023 తొలి మూడు మాసాలలో విధించిన ఆంక్షలను పరిగణలోకి తీసుకుంటే పశ్చిమ దేశాలు విధించిన ఆంక్షల సంఖ్య 36,500 దాటింది. తాము విధించిన వాటితో పాటు ప్రతిగా తమ మీద విధించిన ఆంక్షలతో పశ్చిమ దేశాలు కూడా కొంత మేరకు ప్రభావితం అవుతాయి. వాటి తీవ్రత పెరిగి తమ లాభాలు, అసలుకే ముప్పు వచ్చేంత వరకు కార్పొరేట్ సంస్థలు రంగంలోకి రావు. డాలరు పెత్తనం తగ్గుతుందని అనేక మంది చెబుతున్నప్పటికీ ప్రస్తుతం ఉన్న పరిస్థితి చూస్తే అది అంత తేలిక కాదని కొందరు విశ్లేషకులు చెబుతున్నారు. వివిధ దేశాల రిజర్వు బ్యాంకుల్లో డాలరు నిల్వలు 2021 డిసెంబరులో 7,085.92 బిలియన్ డాలర్లుంటే 2022 ఆగస్టులో 6,652.32 బి.డాలర్లకు మాత్రమే తగ్గాయి. ఇదే కాలంలో మొత్తం రిజర్వు బ్యాంకుల ఆస్తుల్లో చైనా యువాన్ నిల్వలు నామమాత్రం నుంచి 6.2 శాతానికి పెరిగాయి. అందువల్లనే అమెరికా నిమ్మకు నీరెత్తినట్లు ఉంది, ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నది. సామ్రాజ్యవాదులు, దానితో చేతులు కలుపుతున్న శక్తుల తీరు తెన్నులను చూస్తే తమకు లొంగని దేశాల మీద ఆంక్షలను రోజు రోజుకు పెంచటాన్ని గమనించాము. రానున్న రోజుల్లో ఇదే ధోరణి కొనసాగితే ఆయుధ యుద్ధాలకు బదులు ఆంక్షల దాడులతో జనాలకు ఇబ్బందులు మరింతగా పెరిగే అవకాశం ఉంది. ఐరాస వీటిని నిరోధించలేదని ఇప్పటికే తేలిపోయింది. అందువలన యుద్ధాలనే కాదు ఆంక్షలనూ వద్దంటూ జనం వీధుల్లోకి రావాల్సిన అవసరం ఉంది.

★

సందర్భం

పొగాకు మానండి

ప్రతి సంవత్సరం ప్రపంచవ్యాప్తంగా 48 లక్షల మంది ధూమపానం, ఇతర పొగాకు ఉత్పత్తుల వ్యసనానికి బలైపోతున్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ లెక్కలు చెప్తున్నాయి. అందులో 16 లక్షల మంది భారతీయులే కావటం ఆందోళన కలిగించే విషయం. డబ్బిచ్చి ప్రాణాంతక వ్యాధుల్ని కొనుక్కోవడమంటే ఇదే. మన దేశంలో ప్రభుత్వ గణాంకాల ప్రకారమే...జనాభాలో 34 శాతం పురుషులు, మూడు శాతం స్త్రీలు ఇప్పటికే...ప్రత్యక్ష, పరోక్ష రూపాలలో ధూమపాన విషపు కోరల్లో చిక్కుకొని ఉన్నారు. వీరికి ఏటా కొత్తగా 3.6 శాతం మంది ప్రజలు తోడవుతున్నారని, ఆధునిక సర్వేలు వెల్లడిస్తున్నాయి. అమెరికా, బ్రిటన్ వంటి దేశాల్లో పొగాకు వాడకం ఏటా 2.3 శాతం వంతున తగ్గుతుంటే...మన దేశంలో పొగాకు వ్యసనపరులు



నేడు ప్రపంచ పొగాకు వ్యతిరేక దినం

పెరిగిపోవడం ఆందోళన కలిగిస్తోంది. పొగాకులో, వాటి వివిధ ఉత్పత్తులలో సుమారు నాలుగు వేల విషపదార్థాలు ఉన్నాయని రసాయన విశ్లేషకులు గుర్తించారు. అవి 25 రకాల వ్యాధులకు, ముఖ్యంగా ఊపిరితిత్తుల సంబంధ వ్యాధులకు కారణమవు తున్నాయి. పరిస్థితులు ఇలానే కొనసాగితే రానున్న దశాబ్దాలలో ధూమపానంతో సహా పొగాకు ఉత్పత్తులు చేసే చెరుపు అంతా ఇంతా కాదు.

ఇప్పటికే ప్రతి మూడు అకాల మరణాలలో ఒకటి ధూమపానం వల్లే సంభవిస్తోందని ప్రపంచ ఆరోగ్య సంస్థ తెలుపుతోంది. ప్రపంచ వ్యాప్తంగా 90 కోట్ల మంది పురుషులు, 20 కోట్ల మంది స్త్రీలు, మొత్తం 110 కోట్ల మంది ధూమపాన ప్రియులని అంచనా. వీరిలో అభివృద్ధి చెందిన దేశాల పురుషులు 20 కోట్లు, స్త్రీలు 10 కోట్లు. అయితే వీరిలో వర్ధమాన దేశాలకు చెందిన పురుషులు 70 కోట్లు, స్త్రీలు 10 కోట్లు అని ఆరోగ్య సంస్థల గణాంకాలు వివరిస్తున్నాయి. ఎవరికి వారు వ్యక్తిగతంగా ఈ సమస్యను చూసినప్పుడు ఏమీ అనిపించకపోవచ్చు. కానీ ప్రజారోగ్య పరిరక్షణ పరంగా సామాజిక దృక్పథంతో చూసినప్పుడు ఈ సంఖ్యలు ఎవరికైనా ఆందోళన కలిగించక మానవు. నేడు భారత దేశానికి పొంచి ఉన్న అణ్వాయుధాల ముప్పు కన్నా...దేశంలో నిల్వ ఉన్న పొగాకు, వాటి ఉత్పత్తుల వల్ల సంభవించే ముప్పు అధికమని జాతీయ పొగాకు నిర్మూలన సంస్థ మనల్ని హెచ్చరిస్తోందంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.

ధూమపానం చేసే వారికే కాక పక్కన ఉన్న వారికి, కుటుంబ సభ్యులకు కూడా ప్రమాదం వుంది. దీనివల్లనే ధూమపాన ప్రియులున్న కుటుంబంలోని వారు, ఆఫీస్‌లలోని వారు పొగాకు ఉత్పత్తుల వ్యాధులకు గురవుతున్నారు. వీటిలో ముఖ్యంగా పేర్కొనదగినవి ఊపిరితిత్తుల సంబంధ వ్యాధులు. పొగాకు పొగ లోని విష పదార్థాలు పక్కన ఉన్న వారినే కాకుండా పర్యావరణాన్ని కూడా కలుషితం చేస్తున్నాయి. ఫలితంగా పొగ తాగని వారు కూడా పొగాకు పొగకు గురవుతున్నారు.

మరీ ముఖ్యంగా మహిళలు ధూమపానానికి దూరంగా ఉండాలి. లేకపోతే ఆ ప్రభావం పుట్టబోయే పిల్లలపై పడుతుంది. ఆంధ్రప్రదేశ్ లోని విజయనగరం, శ్రీకాకుళం, పశ్చిమ గోదావరి వంటి కొన్ని జిల్లాల్లో మహిళలు చుట్ట తాగటం అది కూడా అడ్డపొగ (చుట్ట కాలే వైపు నోట్లో పెట్టుకొని పీల్చడం) చాలామందికి తెలిసిన విషయమే. ఈ వ్యసనాన్ని మాన్పించే కార్యక్రమాలు యుద్ధ ప్రాతిపదికన చేపట్టాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు, విద్యాసంస్థలు ఈ వ్యసన నిర్మూలనకు కృషి చేయాలి. పొగాకు వ్యాపారం వల్ల ప్రభుత్వానికి వచ్చే ఆదాయం కన్నా ...దేశంలో పొగాకు వాడకం వల్ల వస్తున్న వ్యాధుల కోసం వెచ్చించే ధనం అధికమంటే అతిశయోక్తి కాదు. ప్రపంచ ఆరోగ్య సంస్థ ఈ సంవత్సరం ప్రపంచ పొగాకు వ్యతిరేక దినం సందర్భంగా "మనకు ఆహారం కావాలి. పొగాకు కాదు" అనే నినాదాన్ని ఇచ్చింది. ప్రజలు శాస్త్రీయ వాస్తవాలతో చైతన్యవంతులై ధూమపానాన్ని, పొగాకు ఉత్పత్తులను స్వచ్ఛందంగా బహిష్కరించాలి.

- డా॥ టి. సేవకుమార్,
ఇండియన్ మెడికల్ అసోసియేషన్
జాతీయ కౌన్సిల్ సభ్యులు, గుంటూరు.

మీ వ్యాసాలను పంపాల్సిన మెయిల్ :
editpageps@ gmail.com

సమస్య

మున్సిపల్ కార్మికులు, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికై ...

రాష్ట్రంలోని 123 కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయితీలలో దాదాపు 40 వేల మందికి పైగా కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ (ఆప్కాస్) సిబ్బంది, మరో 10 వేలకు పైగా సి.పి.ఎస్ ఉద్యోగులు, వెయ్యి మందికి పైగా క్లాప్ ఆటోడ్రైవర్లు పని చేస్తున్నారు. వీరందరూ రాష్ట్ర జనాభాలో 40 శాతంగా ఉన్న పట్టణ ప్రజలకు పారిశుధ్యం, త్రాగునీరు, వీధి దీపాలు, రోడ్లు, పార్కులు, పౌర సేవలు అందిస్తున్నారు. కరోనా కష్ట కాలంలో కోవిడ్ వారియర్లుగా, ఫ్రంట్‌లైన్ వారియర్లుగా ప్రాణాలకు తెగించి ప్రజలకు సేవ చేశారు. వీరికి 010 పద్దు ద్వారా జీతాల చెల్లింపు, సమాన పనికి సమాన వేతనం, ఉద్యోగాల పర్మినెంట్, సంక్షేమ పథకాలు, సిపిఎస్ రద్దు తదితర డిమాండ్ల సాధనకై మే 31వ తేదీన శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం నుండి, సత్యసాయి జిల్లా హిందూపురం నుండి రెండు ప్రచార జాతాలు ప్రారంభమై జూన్ 8వ తేదీన విజయవాడలో ముగింపు సభ జరగనుంది.



కె. ఉమామహేశ్వరరావు

దుమ్ము, ధూళి, దుర్గంధం, అనారోగ్యాన్ని లెక్క చేయకుండా పట్టణ ప్రాంత ప్రజలకు సేవలందిస్తున్న మున్సిపల్ సిబ్బందిపై పాలకులకు ఎటువంటి దయ, కనికరం లేదు. ఆప్కాస్ సిబ్బందికి కనీస వేతనాలు లేవు. ఉద్యోగ భద్రత లేదు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ లేవు. అన్‌స్కిల్డ్ వర్కర్ల కన్నా ఇంజనీరింగ్ విభాగంలోని వివిధ క్యాటగిరీలలో పనిచేస్తున్న స్కిల్డ్ వర్కర్లకి తక్కువ వేతనాలు చెల్లిస్తున్నారు. గత 30-35 సంవత్సరాలు పనిచేసి గ్రాట్యూటీ లేక, సర్వీస్ లేక, పెన్షన్ లేక ఖాళీ చేతులతో ఇళ్లకు వెళ్తున్నారు. 2004 నుండి ఉద్యోగాలలో చేరిన సిపిఎస్ ఉద్యోగులదీ అదే దుస్థితి. క్లాప్ ఆటో డ్రైవర్లకు మిగిలిన డ్రైవర్లతో పాటు రూ.18,500 జీతం చెల్లించకుండా కేవలం రూ.10-12 వేలు ఇచ్చి చేతులు దులిపేసుకుంటున్నారు. మున్సిపాలిటీల లోని వార్డు సచివాలయాల ఉద్యోగులదీ అదే పరిస్థితి. ప్రభుత్వాలు మారుతున్నాయి తప్ప వీరి సమస్యలు పరిష్కారం కావడంలేదు.

మే 31 నుండి జూన్ 8వ తేదీ వరకు రాష్ట్ర ప్రచార జాతాలు



అధికారంలోకి రాక ముందు వాగ్దానాల వర్షం వచ్చాక గుండు సున్నా

2019 ఎన్నికలకు ముందు ప్రతిపక్ష నేతగా అసెంబ్లీలోను, పాదయాత్ర సందర్భంగా వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డిగారు మున్సిపల్ ఉద్యోగులు, కార్మికులకు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి వాగ్దానాల వర్షం కురిపించారు. నాటి తెలుగుదేశం ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించారు. అసెంబ్లీ సమావేశాలలో "కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్‌కి పెద్ద తేడా లేదు. తెలుగుదేశం ప్రభుత్వం వారిని నమ్మించి మోసం చేసింది. తెలుగుదేశం ప్రభుత్వం వారిని పర్మినెంట్ చేయకపోతే 6 నెలల్లో మా ప్రభుత్వం రాగానే అందరిని పర్మినెంట్ చేస్తామ"ని బల్లగుద్ది మరీ చెప్పారు. సిపిఎస్ ఉద్యోగులకైతే వారం రోజుల్లోనే సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరిస్తామని వాగ్దానం చేశారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మాటలు నమ్మి ఉద్యోగులు, కార్మికులు, ఉపాధ్యాయులు ఓట్లు వేసి వైసిపిని గెలిపించారు. కాని ఆయన ఇచ్చిన మాట నిలబెట్టుకోలేదు. పర్మినెంట్ ఉద్యోగులకు రివర్స్ పిఆర్‌సి ఇవ్వడమేకాక, సిపిఎస్ రద్దు చేస్తామని ఎన్నికలకు ముందు అవగాహనా లోపంతో చెప్పామని నేడు బొంకుతున్నారు. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ సిబ్బందికి 11వ పిఆర్‌సి ప్రకారం నెలకి రూ.20,000 జీతం, కరువు భత్యం (డిఎ) చెల్లించాల్సి ఉండగా కేవలం రూ.15,000 నుంచి 18,500 చెల్లించి నెలకు 3 నుండి రూ.5 వేలు కోత పెట్టి కార్మికుల శ్రమ శక్తిని దోపిడి చేస్తున్నారు. నైపుణ్యంతో కూడిన విధులు నిర్వహిస్తున్న ఇంజనీరింగ్ సిబ్బందికి పారిశుధ్య విభాగం వారి కన్నా తక్కువ జీతాలు చెల్లిస్తున్నారు.

మాట తప్పని, మడమ తిప్పని వంశం అంటే ఇదేనా!

మున్సిపల్ ఉద్యోగుల్లో నూటికి 90 శాతం దళితులు, మిగిలిన వారు బలహీన వర్గాల వారు, మహిళలు. కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల పర్మినెంట్ విషయాన్ని అటకెక్కించారు. శాశ్వత స్వభావం కలిగి, పర్యావరణాన్ని ప్రజారోగ్యాన్ని పరిరక్షిస్తున్న మున్సిపల్ కార్మికుల ఉద్యోగాలను పర్మినెంట్ చెయ్యకుండా ఆప్కాస్ అనే బానిస వ్యవస్థలోకి నెట్టివేశారు. లక్ష రూపాయలు ఇచ్చినా మున్సిపల్ కార్మికులు చేసే పనిని ఇతరులెవ్వరూ చేయలేరని చెప్పిన ముఖ్యమంత్రి రూ.12 వేల జీతాన్ని కేవలం రూ.15 వేలకు పెంచారు. పారిశుధ్య కార్మికులకు హెల్త్ అలవెన్స్ కింద నెలకు రూ.6 వేలు ఇచ్చారు తప్ప సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్న సుప్రీంకోర్టు తీర్పును అమలు చెయ్యలేదు. ఇంజనీరింగ్ కార్మికులకు సంక్షేమ పథకాలను ఎత్తివేశారు. ప్రమాదకరమైన విధులు నిర్వహిస్తున్నప్పటకి హెల్త్, రిస్క్ అలవెన్సులు చెల్లించడంలేదు. చాలీచాలని జీతాలతో కుటుంబాలు గడవక అవస్థలు పడుతున్నారు. జీవో ఆర్‌టి నెం.30లో అన్యాయం జరిగిన వాటర్ సెక్షన్, టౌన్ ప్లానింగ్, పార్కుల్లో పని చేసే కార్మికులు, డ్రైవర్లు, సూపర్ వైజర్లకు న్యాయం చేసేందుకు 2022 జులై 11 నుండి 15 వరకు జరిగిన సమ్మె సందర్భంగా ప్రభుత్వం అంగీకరించింది. అయినా నేటికీ ఈ సమస్యను పరిష్కరించలేదు.

హామీలను నెరవేరుస్తారా? ఉద్యోగ, కార్మిక ద్రోహులుగా మిగిలిపోతారా?

వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మున్సిపల్ కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి ఇచ్చిన పర్మినెంట్ హామీని ఇప్పటికైనా అమలు చేయాల్సిందిగా, ఎ.పి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సిఐటియు) రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తోంది. ఇచ్చిన హామీలను నెరవేర్చి అమలు జరిపి ఉద్యోగ, కార్మిక మిత్రులుగా మిగులుతారో లేక హామీలను తుంగలో తొక్కి కార్మిక ద్రోహులుగా తేలతారో ఈ ప్రభుత్వమే తేల్చుకోవాలి. తెలుగుదేశం, జనసేన పార్టీలు కూడా కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికుల న్యాయమైన డిమాండ్ల కోసం పోరాడతాయో లేదో కార్మిక వర్గానికి తేల్చి చెప్పాలి. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కరోనా సమయంలో విధులు నిర్వహిస్తూ మరణించిన ఫ్రంట్‌లైన్ వారియర్ల (మున్సిపల్, గ్రామ పంచాయితీ కార్మికులతోసహా) కుటుంబాలకు రూ.50 లక్షలు నష్ట పరిహారం కింద చెల్లిస్తామని ఇచ్చిన హామీని మన రాష్ట్రంలో ఒక్కరికి కూడా అమలు చెయ్యలేదు. పైగా స్వచ్ఛ భారత్‌కు చెల్లు చీటీ చెప్పి మున్సిపల్, గ్రామ పంచాయితీ కార్మికులకు తీరని ద్రోహం చేసింది. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం, రాష్ట్రం లోని వైసిపి ప్రభుత్వం జత కట్టి పట్టణ ప్రజలపైన చెత్తపన్ను తదితర యూజర్ చార్జీల పేర్లతో కోట్లాది రూపాయల భారాలు మోపుతున్నారు.

2024లో జరగనున్న ఎన్నికలకు ముందైనా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వ హామీలను అమలు చేయాలి. హామీల అమలుకు పోరాటం తప్ప మరో మార్గం లేదు. అందులో భాగంగా నిర్వహిస్తున్న ఈ జాతాలలో మున్సిపల్ ఉద్యోగులు, కార్మికులతోపాటు పట్టణాల్లోని అన్ని వర్గాల ప్రజలు మద్దతునిచ్చి జయప్రదం చెయ్యాల్సిందిగా విజ్ఞప్తి.

/ వ్యాసకర్త ఎ.పి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి /

మేనిఫెస్టోతో వైసిపికి ఓటమి భయం

- టిడిపి ఎమ్మెల్సీ అనురాధ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు మహానాడు వేదికగా ప్రకటించిన మేనిఫెస్టోతో వైసిపికి ఓటమి భయం పట్టుకుందని టిడిపి ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ అన్నారు. టిడిపి కార్యాలయం ఎన్‌టిఆర్ భవన్‌లో మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఒక్క అవకాశం పేరుతో ప్రజల్ని కోలుకోలేని అవకాశం లేకుండా చేసిన వ్యక్తి జగన్ అని విమర్శించారు. సంపద సృష్టించి సంపద పంచి సంక్షేమ పథకాలు ఎలా ఇవ్వాలో తెలిసిన వ్యక్తి చంద్రబాబు అని అన్నారు. చంద్రబాబు ప్రజల భవిష్యత్తు గ్యారంటీ అనగానే జగన్, ఆయన బృందానికి వారి భవిష్యత్తుపై భయం మొదలైందని టిడిపి మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ అన్నారు. మహానాడులో టిడిపి వదిలిన టీజర్‌పై 15 మంది మంత్రులు నోటికి పనిచెప్పడం పాలకుల భయానికి నిదర్శనమన్నారు.

ఉద్యమాన్ని ఆపేదిలేదు

- ఎపి అమరావతి జెఎసి అధ్యక్షులు బొప్పరాజు వెంకటేశ్వర్లు



ప్రజాశక్తి-విజయవాడ

ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతూ ఎపి అమరావతి జెఎసి ఆధ్వర్యాన విజయవాడ ధర్నాచౌక్‌లో మంగళవారం ఒక్క రోజు సామూహిక రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ప్రభుత్వ ఉద్యోగులతోపాటు కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు, పెన్షనర్లు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. సిబిటియు, ఎపిటియుఎస్, ఇతర కార్మిక సంఘాలు సంపూర్ణ మద్దతు తెలిపాయి. ఎపి అమరావతి జెఎసి అధ్యక్షులు బొప్పరాజు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలు పరిష్కరించే వరకు ఉద్యమాన్ని ఆపేదిలేదని స్పష్టం చేశారు. 83 రోజులుగా ఉద్యోగులు ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వం న్యాయమైన డిమాండ్ల పరిష్కరించాల్సి ఆలోచన చేయకపోవడం బాధాకరమన్నారు. ఉద్యమం ఫలితంగా కొన్ని ఆర్థిక, ఆర్థికేతర సమస్యలు పరిష్కరించినప్పటికీ మిగిలిన డిమాండ్ల పరిష్కారంపై లిఖిత పూర్వకంగా హామీ ఇవ్వడంలో జాప్యం చేస్తున్నారని తెలిపారు. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకపోతే రాష్ట్రంలోని అన్ని ఉద్యోగ, కార్మిక, పెన్షనర్ల సంఘాలను కలుపుకొని చలో విజయవాడకు పిలుపునిచ్చి మరో బిఆర్‌టిఎస్ ఉద్యమం ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాల్సి వస్తుందని హెచ్చరించారు. జూన్ 10న రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశం నిర్వహించి, దానిలో భవిష్యత్ కార్యాచరణను రూపొందిస్తామని తెలిపారు. ఎపిటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి ఓబులేసు మాట్లాడుతూ... ఉద్యోగులపై ప్రభుత్వం ఒత్తిడి పెంచితే చూస్తూ ఊరుకునేది లేదని, వారికి అండగా నిలుస్తామని తెలిపారు. సిఐటియు సెంట్రల్ సిటీ ప్రధాన కార్యదర్శి ఎంవి సుధాకర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులు, ప్రజల మధ్య అగాధం సృష్టిస్తూ, అవాస్తవాలను ప్రచారం చేస్తూ వక్రీకరిస్తున్నదని విమర్శించారు. ఉద్యోగులకు ఇచ్చిన హామీల అమలుకు ప్రభుత్వం సిద్ధపడి కృషి చేయాలని డిమాండ్ చేశారు. ఎపి అమరావతి జెఎసి ఎన్‌టిఆర్ జిల్లా నాయకులు డి.శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎన్‌టిఆర్ జిల్లా ఎన్‌జిఒ సంఘం, కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగ సంఘం, పెన్షనర్ల సంఘం నాయకులు పాల్గొన్నారు.

భారత్‌లో అసెంబ్లింగ్ ఫోన్లే..

- పిఎల్ఐ లోపాలే కారణం
- ఆర్‌బిఐ మాజీ గవర్నర్ రాజన్ వెల్లడి



న్యూఢిల్లీ : భారత్‌లో ఉత్పత్తి అవుతోన్న మొబైల్ ఫోన్లు అన్నీ అసెంబ్లింగ్ ద్వారా తయారు చేస్తున్నవేనని ఆర్‌బిఐ మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్ అన్నారు. దేశంలో నిజమైన తయారీ కంటే అసెంబ్లింగ్ ద్వారానే ప్రధానంగా ఉత్పత్తి జరుగుతుందని రాజన్ ఓ పరిశోధన పత్రంలో పేర్కొన్నారు. ఇందుకు దేశంలో తయారీ రంగాన్ని ప్రోత్సహించడానికి మోడీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక (పిఎల్ఐ) పథకం లోపాలే కారణమని విమర్శించారు. "దేశంలో ఫోన్లను పూర్తి చేయడానికి మాత్రమే సబ్సిడీ చెల్లించబడుతుంది. తయారీ ద్వారా ఎంత విలువ జోడించబడుతుందనే దానిపై కాదు. ఫోన్ల ఉత్పత్తికి కావాల్సిన ముడి సరుకును పెద్ద మొత్తంలో దిగుమతి చేసుకుంటుంది. దీంతో నికర ఎగుమతుల్లో పెరుగుదల కష్టం." అని రాజన్ పేర్కొన్నారు. పిఎల్ఐ పథకం అర్హత కలిగిన కంపెనీలకు భారతదేశంలో తయారు చేయబడిన వస్తువుల అమ్మకాలపై తొలి ఏడాది 4 శాతం నుండి 6 శాతం వరకు ప్రోత్సాహకాన్ని అందిస్తుంది. ఈ ప్రోత్సాహకం ఐదేళ్లపాటు వర్తిస్తుంది.

ఉన్నత విద్యకు దూరమవుతున్న ముస్లింలు

- యూపీలో మరింత దారుణం
- కేరళలో పరిస్థితి మెరుగు

న్యూఢిల్లీ : ఒకవైపు దేశంలోని ముస్లిం విద్యార్థుల్లో ఉన్నత విద్యను అభ్యసిస్తున్న వారి సంఖ్య రోజురోజుకూ తగ్గుతున్నది. దేశ జనాభాలో ముస్లింలు 14శాతం ఉండగా వారిలో ఉన్నత విద్యను అభ్యసిస్తున్న వారి సంఖ్య కేవలం 4.6శాతం మాత్రమే ఉంది. 2020-21 సంవత్సరపు ఏఐఎస్‌హెచ్‌ఈ సర్వే ప్రకారం ఉన్నత విద్యా సంస్థల్లో చేరుతున్న ఎస్సీ విద్యార్థుల సంఖ్య 4.2శాతం, ఎస్టీ విద్యార్థుల సంఖ్య 11.9శాతం, ఓబీసీ విద్యార్థుల సంఖ్య 4శాతం పెరిగితే ముస్లిం విద్యార్థుల సంఖ్య 8శాతం తగ్గింది. ముస్లిం విద్యార్థులు ఎక్కువగా డిగ్రీ కోర్సుల్లో చేరడానికి బదులు ఏదో ఒక ఉద్యోగం వెతుక్కొని చేరిపోతున్నారు.

రాష్ట్రాల వారీగా చూస్తే ఉత్తరప్రదేశ్‌లో ముస్లింల జనాభా 20శాతం. అయితే అక్కడ డిగ్రీ, ఆపై కోర్సుల్లో చేరుతున్న విద్యార్థుల సంఖ్య అత్యంత దారుణంగా 36శాతం తగ్గిపోయింది. ఈ తగ్గుదల జమ్మూకాశ్మీర్‌లో 26శాతం, మహారాష్ట్రలో 8.5శాతం, తమిళనాడులో 8.1శాతంగా ఉంది. 2020-21లో ఉత్తరప్రదేశ్‌లో కళాశాలల సంఖ్య పెరిగినప్పటికీ వాటిలో చేరిన ముస్లిం విద్యార్థుల సంఖ్య కేవలం 4.5% మాత్రమే. దేశ రాజధానిలో ప్రతి ఐదుగురు ముస్లిం విద్యార్థుల్లో ఒకరు ఉన్నత విద్యకు దూరమవుతున్నారు. ఈ రాష్ట్రాలన్నింటికీ భిన్నంగా కేరళలో 43శాతం మంది ముస్లిం విద్యార్థులు డిగ్రీ కాలేజీల్లో చేరారు.

ఉన్నత విద్యా సంస్థల్లో ముస్లిం అధ్యాపకుల కొరత కూడా అధికంగానే ఉంది. జాతీయ స్థాయిలో జనరల్ కేటగిరీ అధ్యాపకులు 56శాతం, ఓబీసీలు 36శాతం, ఎస్సీలు 9శాతం, ఎస్టీ అధ్యాపకులు 2.5శాతం ఉండగా ముస్లిం అధ్యాపకులు కేవలం 5.6శాతం మాత్రమే ఉన్నారు. దేశంలో ఓబీసీ తరగతులకు చెందిన విద్యార్థుల్లో 36శాతం మంది, ఎస్సీల్లో 14శాతం మంది ఉన్నత విద్యా సంస్థలలో చేరారు. అంటే ఈ రెండు తరగతులకు చెందిన విద్యార్థుల్లో 50శాతం మంది డిగ్రీ కోర్సులలో చేరారన్న మాట. ఉన్నత విద్యను అభ్యసిస్తున్న ముస్లిం విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గిపోతుంటే కర్నాటకలో అసెంబ్లీ ఎన్నికలకు ముందు అక్కడి బీజేపీ ప్రభుత్వం ముస్లింలకు ఉన్న 4శాతం రిజర్వేషన్లను రద్దు చేయడం గమనార్హం.

పాత పెన్షన్ విధానం కొనసాగించాలి

- తపాలా శాఖ ప్రయివేట్‌పరం కాకుండా పోరాటం
- ఎఐపిఇయు పి4 పోస్ట్‌మెన్ ఎంటిఎస్ ఎపి సర్కిల్ రాష్ట్ర ద్వైవార్షిక మూడవ మహాసభలో తీర్మానం

ప్రజాశక్తి- కర్నూలు కార్పొరేషన్

పాత పెన్షన్ విధానం కొనసాగించాలని ఎఐపిఇయు పి4 పోస్ట్‌మెన్, ఎంటిఎస్ ఎపి సర్కిల్ రాష్ట్ర ద్వైవార్షిక మూడవ మహాసభ డిమాండ్ చేసింది. తపాలా శాఖ ప్రయివేటుపరం కాకుండా పోరాడాలని తీర్మానించింది. మూడు రోజుల పాటు కర్నూలులో జరిగిన ఈ మహాసభ మంగళవారం విజయవంతంగా ముగిసింది. చివరి రోజు నాలుగు తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించింది. ఎనిమిదవ వేతన కమిషన్ వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేసింది. ఎన్‌ఎఫ్‌పిఇ పి-3 గుర్తింపు పునరుద్ధరణకు పోరాడాలని తీర్మానించారు. యూనియన్ ఆలిండియా జనరల్ సెక్రెటరీ మోహంతి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. మహాసభను విజయవంతం చేయడంలో ముఖ్యపాత్ర పోషించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. సంపూర్ణ సహకారం అందించిన సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు, మాజీ ప్రధాన కార్యదర్శి ఎంఎ.గఫూర్, జెవివి వ్యవస్థాపకులు డాక్టర్ బ్రహ్మారెడ్డి, నాయకులు రామకృష్ణారెడ్డి, డిటిఎఫ్ నాయకులు రత్నం ఏసేపులకు కృతజ్ఞులు తెలియజేశారు.

తొమ్మిదేళ్లలో నవభారత్ : మోడీ

న్యూఢిల్లీ : తొమ్మిదేళ్లలో నవభారత్ నిర్మించామని, రానున్న కాలంలో మరింత కష్టపడతామని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మంగళవారం నాడు గొప్పలు చెప్పారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వానికి తొమ్మిదేళ్లు పూర్తయిన సందర్భంగా ఆయన సామాజిక మాధ్యమాల్లో ఈ మేరకు ఒక ప్రకటన చేశారు. 'దేశ పేదల జీవనోపాధులు మెరుగుపర్చేందుకు ఈ తొమ్మిదేళ్లల్లో ఎంతో శ్రమించాం. అనేక పథకాలతో లక్షలాది మంది జీవితాల్లో మార్పు తీసుకొచ్చాం. ప్రతీ పౌరుడి అభ్యున్నతి, కలల సాధన కోసం ఇక ముందు కూడా కృషిని కొనసాగిస్తాం' అని మోడీ ట్వీట్ చేశారు.

స్పీకర్‌ను అరెస్టు చేయాలి

- చంద్రబాబుపై వ్యాఖ్యల వెనుక కుట్రను ఛేదించాలి
- పోలీసులకు టిడిపి ఫిర్యాదు

ప్రజాశక్తి - ఆమదాలవలస (శ్రీకాకుళం జిల్లా)

జెడ్ ప్లస్ భద్రతను తీసేస్తే చంద్రబాబు ఫినిష్ అంటూ శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం చేసిన వ్యాఖ్యల వెనుక ఉన్న కుట్ర కోణాన్ని ఛేదించి, ఆయన్ను అరెస్టు చేయాలని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ డిమాండ్ చేశారు. పట్టణంలోని టిడిపి కార్యాలయం నుంచి పార్టీ శ్రేణులతో కలిసి ర్యాలీగా పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఎస్ఐ వై.కృష్ణకు మంగళవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ రాజ్యాంగబద్ధ పదవికే కళంకం తెచ్చిన వ్యక్తి సీతారాం అని విమర్శించారు. చంద్రబాబు నాయుడును విమర్శిస్తే జగన్మోహన్ రెడ్డి మెప్పు పొందవచ్చన్న దుర్బుద్ధితో ఇటువంటి వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. చంద్రబాబు నాయుడు భద్రతకు ఎలా అర్హుడని ప్రశ్నించడానికి తమ్మినేనికి ఉన్న అర్హత ఏమిటని ప్రశ్నించారు. ఫేక్ సర్టిఫికెట్లతో డిగ్రీ పాసైన అజ్ఞానులకు నియమ నిబంధనలు ఏవిధంగా తెలుస్తాయని ఎద్దేవా చేశారు. వైసిపి రక్త చరిత్ర పునాదుల మీద ఏర్పడి అధికారంలోకి వచ్చిందని, అందుకే స్పీకర్ వ్యాఖ్యల నేపథ్యంలో చంద్రబాబుపై ఏదో కుట్ర ఉందన్న అనుమానం వ్యక్తం చేశారు. గత ఎన్నికల్లో ముఖ్యమంత్రి సొంత చిన్నాన్న వివేకానంద రెడ్డిని హత్య చేసి మొసలికన్నీరు కార్చి అధికారంలోకి వచ్చిన సంగతి అందరికీ తెలిసిందేనన్నారు. గతానుభవాల దృష్ట్యా సీతారాంను అదుపులోకి తీసుకుని విచారణ చేసి, కుట్ర కోణాన్ని బయటపెట్టాలని పోలీసులను డిమాండ్ చేశారు. ఇప్పటికే తమ్మినేని సీతారాం ఫేక్ డిగ్రీ సర్టిఫికెట్‌పై తెలంగాణలోని ఎల్‌బి నగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశానని, అక్కడ కేసు నమోదైందన్నారు. రాష్ట్రపతికీ ఫిర్యాదు చేశానని, ఈ వ్యవహారంపై విచారణ చేయాలని సిఎస్‌కు ఆదేశించినట్లు తనకు రాష్ట్రపతి భవన్ నుంచి ప్రత్యుత్తరం వచ్చిందన్నారు. త్వరలోనే సీతారాంకు జైలు శిక్ష తప్పదన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు నూకరాజు, తమ్మినేని చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

హైయర్ కినౌచి ఎసితో 65శాతం విద్యుత్ ఆదా

న్యూఢిల్లీ : గృహోపకరణాల ఉత్పత్తుల కంపెనీ హైయర్ తాము ఆవిష్కరించిన కినౌచి 5 స్టార్ హెవీ డ్యూటీ ప్రో ఎయిర్ కండీషనర్‌తో 65 శాతం విద్యుత్ ఆదా అవుతుందని తెలిపింది. ఇందులో 10 సెకన్లలో సూపర్ సోనిక్ కూలింగ్ ఫీచర్ ఉందని తెలిపింది. సెల్ఫ్ క్లీనింగ్ టెక్నాలజీని కలిగి ఉన్న అత్యుత్తమ నాణ్యత కలిగిన మోడల్ పేర్కొంది. కినౌచి 5 స్టార్ హెవీ డ్యూటీ ప్రో ఎయిర్ కండీషనర్ 'ఏడాది ఉత్తమ వినూత్న ఉత్పత్తి'గా అవార్డు పొందిందని వెల్లడించింది.

క్రీడా మైదానాల జాడేది?


విలు విద్యలో శిక్షణ పొందుతున్న చిన్నారులు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం (పార్వతీపురం మన్యం)

పార్వతీపురం మన్యం జిల్లా ఐటిడిఎ పరిధిలోని గిరిజన ప్రాంతాల్లో విద్యార్థులకు చదువుతో పాటు మంచి క్రీడాకారులను తయారుచేయాలనే లక్ష్యం నీరుగారింది. పదేళ్ల క్రితం గుమ్మలక్ష్మీపురం, జియమ్మవలస మండలాల్లో క్రీడా పాఠశాలలు, మైదానాలు ఏర్పాటుకు అధికారులు ప్రతిపాదించి ఏళ్లు గడుస్తున్నా అవి నేటికీ కార్యరూపం దాల్చలేదు. ఈ ప్రాంతంలో వందలాది మంది ప్రతిభావంతులైన క్రీడాకారులున్నా వారికి సరైన ప్రోత్సాహం లేకపోవడంతో తమలోని ప్రతిభను బయటకు తీయలేక మరుగునపడుతున్నారు. విలువిద్య, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, జావాలింగ్‌త్రో , షార్ట్ పుట్ వంటి విభాగాల్లో నైపుణ్యం కలిగిన క్రీడాకారులు ఉన్నారు.

స్థల సేకరణతో సరి

గుమ్మలక్ష్మీపురం, జియమ్మవలస మండలం రావాడ రాంభద్రపురంలో క్రీడా పాఠశాలల ఏర్పాటుకు గతంలో అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. 12 ఎకరాల స్థలాన్ని రావాడలో కొంతమంది దాతలు విరాళంగా ఇచ్చారు. శాప్, ఐటిడిఎ అధికారులు స్థల పరిశీలన చేసి ప్రభుత్వానికి పలుమార్లు నివేదిక పంపించారు. జిల్లాకు ఒక పాఠశాల చొప్పున 2013లో మంజూరుకు లేఖ రాశారు. ఒక్కొక్క మైదానానికి అర ఎకరా స్థలంలో రూ.కోటీ 60 లక్షలతో ప్రతిపాదనలు పంపించారు. ఐటిడిఎ ఆధ్వర్యంలో ఉపాధి హామీ నిధులతో రన్నింగ్ ట్రాక్ కూడా నిర్మించారు. అంతా బాగానే ఉన్నా స్థల సేకరణతో సరిపెట్టిన అధికారులు పనులు మాత్రం నేటి వరకు చేపట్టలేదు.

పదహారేళ్ల కలగానే మినీ స్టేడియం

గుమ్మలక్ష్మీపురంలో ఉన్న హెచ్ గ్రౌండులో క్రికెట్ మినీ స్టేడియం పనులు నిర్మాణానికి గత పదహారేళ్లుగా ప్రతిపాదనలు చేసినా కలగానే మిగిలిపోయాయి. మొదటిసారి 2006లో అప్పటి సిపిఎం ఎమ్మెల్యే కోలక లక్ష్మణమూర్తి మినీ స్టేడియం నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించారు. ఇందుకోసం విజయనగరం నుంచి క్రీడా అధికారులు వచ్చి పరిశీలన కూడా చేశారు. అయితే క్రీడా మైదానం నిర్మాణానికి రూ.10 లక్షల వరకు అవసరం కాగా ఎమ్మెల్యే కోటా నుండి రూ.రెండు లక్షలు మంజూరు చేశారు. మిగతా రూ.8లక్షలు క్రీడా శాఖ అధికారులు మంజూరు చేయాల్సి ఉండగా ఆ ప్రక్రియ ముందుకు సాగలేదు. పనులు నేటికీ జరగలేదు. క్రీడా మైదానం సమీపాన టిడిపి హయాంలో 2018లో ఇండోర్ స్టేడియం నిర్మాణ పనులు ప్రారంభించారు. ప్రభుత్వం రూ.రెండు కోట్లు మంజూరు చేసింది. గుత్తేదారు పనులు ప్రారంభించి స్లాబ్ స్థాయి వరకు పనులు చేపట్టారు. అయితే ఎన్నికల కోడ్ రావడం, ప్రభుత్వం మారడంతో కాంట్రాక్టరుకు బిల్లులు చెల్లింపుల్లో జాప్యమైంది. దీంతో నాలుగున్నర ఏళ్లుగా ఇండోర్ స్టేడియం పనులు కూడామధ్యలోనే నిలిచిపోయాయి.

జాతీయ స్థాయిలో రాణిస్తున్న గిరి పుత్రులు

గుమ్మలక్ష్మీపురం మన్యంలో చదువుతున్న విద్యార్థులు క్రీడల్లో జాతీయ అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్నారు. కురాసింగికి చెందిన కరాటే క్రీడాకారిణి తోయక శిరీష శ్రీలంకలో సైతం మంచి ప్రతిభను కనబర్చారు. గతంలో బంగారు పతకం సాధించింది. గుమ్మ లక్ష్మీపురం, భద్రగిరి గురుకుల పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు కూడా రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఇప్పటికే వివిధ క్రీడల్లో రాణిస్తూ తమ ప్రతిభను చాటుతున్నారు. క్రీడా శిక్షణ నిరంతరం అందిస్తే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించగలమని ధీమాను క్రీడాకారులు వ్యక్తం చేస్తున్నారు. కనుమరుగవుతున్న క్రీడలకు జీవం పోయాలంటే క్రీడా శిక్షణ తప్పనిసరిగా ఉండాలని ఆశిస్తున్నారు.

శ్రీసిటీలో రెండు పరిశ్రమలు ప్రారంభం



మరో ఆరు కంపెనీల స్థాపనకు ఒప్పందాలు
మంత్రి గుడివాడ అమర్నాథ్

ప్రజాశక్తి - వరదయ్యపాళెం (తిరుపతి)

శ్రీసిటీలో నూతనంగా ఏర్పాటైన ఆర్ ఎస్‌బి ట్రాన్స్‌మిషన్, అడెలా ఎలక్ట్రికల్స్ పరిశ్రమలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పరిశ్రమల శాఖా మంత్రి గుడివాడ అమర్నాథ్‌మంగళవారం ప్రారంభించారు. దీంతోపాటు ఎన్‌జిసి, టిల్ హెల్త్‌కేర్ (విస్తరణ), మాగ్నమ్, ఎవర్‌షైన్ మౌల్డర్స్, బాంబే కోటెడ్ స్పెషల్ స్టీల్స్, బివికె గ్రూప్ అనే ఆరు నూతన కంపెనీల స్థాపకు మంత్రి సమక్షంలో అవగాహన ఒప్పందాలు జరిగాయి. ఈ కంపెనీల మొత్తం పెట్టుబడి విలువ రూ.500 కోట్లు కాగా, 1500 మందికి ఉపాధి లభించనుంది. అనంతరం భారత పరిశ్రమల సమాఖ్య రౌండ్‌టేబుల్ సమావేశంలో మంత్రి పాల్గొన్నారు. పరస్పర చర్చల ద్వారా పరిశ్రమకు, ప్రభుత్వానికి మధ్య మంచి అవగాహన పెంపొందించడం ఈ సమావేశ ముఖ్య ఉద్దేశమని సిఐఐ తిరుపతి రీజియన్ ఛైర్‌పర్సన్ ప్రియమంజరి టోడి వివరించారు. మౌలిక సదుపాయాల కల్పనలో, మహిళా సాధికారతలో, పర్యావరణ పరిరక్షణలో విద్యా ఉద్యోగ కల్పనలో శ్రీసిటీ ఎనలేని కృషి చేసినట్లుగా సర్వే ద్వారా వెల్లడైందని పరిశోధకులు తెలియజేశారు. ఈ కార్యక్రమం లో రాష్ట్ర డిప్యూటీ చీఫ్ మినిస్టర్ నారాయణ స్వామి, కమిషనర్ ప్రవీణ్ కుమార్, వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య ఎన్. రజనీ, శ్రీ సిటీ మేనేజింగ్ డైరెక్టర్ పాల్గొన్నారు.

సిఎం వస్తున్నారని.. చెట్లను కొట్టేశారు..

ప్రజాశక్తి-పత్తికొండ

కర్నూలు జిల్లా పత్తికొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి అంబేద్కర్ సర్కిల్ ప్రధాన రహదారి కి ఇరువైపులా నీడనిచ్చే చెట్లు ఉన్నాయి. పత్తికొండలో 1న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సెయింట్ జోసెఫ్ స్కూల్ మైదానంలో రైతు భరోసా కార్యక్రమానికి హాజరుకానున్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో హెలిపాడ్‌లో దిగి ప్రధాన రహదారి మార్గంలో బస్సు యాత్రతో సెయింట్ జోసెఫ్ స్కూల్ మైదానంలో ఏర్పాటుచేసి రైతు భరోసా కార్యక్రమం వరకు యాత్ర కొనసాగుతుంది. రోడ్డుకు ఇరువైపులా చెట్లు ఉండడంతో సిఎం జగన్మోహన్ రెడ్డి బస్సు యాత్రకు ఆటంకం కలుగుతుందని ప్రభుత్వ అధికారులు చెట్లను కూల్చి వేస్తున్నారు. నీడనిచ్చే చెట్లను కూల్చివేయడంతో స్థానిక ప్రజలు వాహనదారులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చెట్లు కూల్చివేసే అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

కైవల్యరెడ్డికి మంత్రి బొత్స అభినందన

ప్రజాశక్తి- నిడదవోలు

నాసా ఇంటర్నేషనల్ ఎయిర్ అండ్ స్పేస్ ప్రోగ్రాం-2023కు ఎంపికైన నిడదవోలుకు చెందిన బాలిక కైవల్యరెడ్డిని మంత్రి బొత్స సత్యనారాయణ అభినందించారు. మంగళవారం విజయవాడలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో కైవల్యరెడ్డి తన తల్లిదండ్రులతో ఆయన్ని కలిసింది. మంత్రి మాట్లాడుతూ చిన్న వయసులో ఆస్ట్రోనాట్స్ శిక్షణకు ఎంపికవ్వడం గర్వకారణమన్నారు. శిక్షణను పూర్తి చేసుకుని రాష్ట్రానికి దేశానికి పేరు తేవాలన్నారు. ప్రభుత్వం నుంచి సహకారం అందించేందుకు తగు చర్యలు తీసుకుంటానని తెలిపారు.

ఖేలో ఇండియా పోటీల్లో రాజేశ్వరికి పతకం

ప్రజాశక్తి- నెల్లిమర్ల (విజయనగరం జిల్లా)

ఖేలో ఇండియా వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో నెల్లిమర్ల క్రీడా కారిణికి కాంస్య పతకం లభించింది. మంగళవారం ఉత్తర ప్రదేశ్ నోయిడాలో జరిగిన ఖేలో ఇండియా యూనివర్సిటీ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో నెల్లిమర్ల బైరెడ్డి వీధికి చెందిన క్రీడా కారిణి బైరెడ్డి రాజేశ్వరి ప్రతిభ కనబర్చి కాంస్య పతకం సాధించింది. 45కిలోల విభాగంలో రాజేశ్వరి స్నాచ్ 60కిలోలు, జర్క్ 79కిలోలు బరువెత్తి కాంస్య పతకం సాధించింది. ఈ సందర్భంగా ఆమెను జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రతినిధులు అభినందించారు.

గూడు చెదిరె..గుండె పగిలె..!

- వీరాపురంలో సైబీరియన్ పక్షుల హాహాకారాలు
- 'అతిథు'లపై ప్రకృతి ప్రకోపం
- గాలివాన బీభత్సానికి పిట్టల్లా రాలిపోయిన విదేశీ విహంగాలు



ప్రజాశక్తి-చిలమత్తూరు(అనంతపురం)

అనంతపురం జిల్లా చిలమత్తూరు మండలం వీరాపురం పరిసర గ్రామాలకు సైబీరియన్ పక్షులు ప్రతి ఏడాది వస్తుంటాయి ఇక్కడ సంతానోత్పత్తి అనంతరం స్వదేశానికి తిరిగి వెళ్తాంటాయి. అలాంటి అతిథి పక్షులకు కష్టం వచ్చిపడింది. సోమవారం రాత్రి వీచిన గాలివాన దెబ్బకు పక్షుల గూడు చెదిరిపోయింది. నెలల తరబడి గూడు పెట్టుకుని గుడ్లు పొదిగి పిల్లలను పునరుత్పత్తి చేసిన పక్షులు ఒక్కసారిగా ప్రకృతి ప్రకోపానికి గురయ్యాయి. గాలివాన దెబ్బకు వందలాది పక్షులు మృతి చెందాయి. గ్రామం, పరిసర పొలాల్లో ఎక్కడ చూపిన సైబీరియన్ పక్షుల పిల్లల కబేలాలే కన్పిస్తున్నాయి. రెక్కలతెగి కిందపడిన చిన్న పక్షుల ఆర్తనాదాలు ఆ గ్రామాన్ని ఒక్కసారిగా ఉలిక్కిపడేలా చేసింది. గతంలో ఎన్నడూ చూడని విధంగా కుప్పలు కుప్పలుగా పక్షి పిల్లల కబేలాలు మంగళవారం ఉదయం గ్రామంలో దర్శనమించాయి. వీటిని చూసిన జనం కన్నీటి పర్యంతం అయ్యారు. చెట్ల కింద ముళ్ల కంపల్లో చిక్కుకుని వందలాది పక్షులు మృత్యువాత పడ్డాయి. చెట్లకు వేలాడుతూ మృతి చెందిన పిల్ల పక్షులను చూసి తల్లి పక్షులు మూగరోదన చేశాయి. ఇంతంటి కష్టానికి ప్రకృతి విలయం ఎంత కారణమో వీటి రక్షణలో ప్రభుత్వం, సంబందిత శాఖల వైఫల్యం కూడా అంతలా కన్పిస్తోంది.

ఛిద్రమైన 'అతిథి' ప్రయాణం..

సైబీరియన్ పక్షులకు ఓప్రత్యేక ఉంది. ఇవి ప్రతి ఏటా ఫిబ్రవరిలో రష్యా నుంచి ఎల్లలు దాటి సంతానోత్పత్తి కోసం చిలమత్తూరు మండలం వీరాపురం, వెంకటాపురం గ్రామాలకు వస్తాయి. ఈ ఎర్రకాళ్ల కొంగలు వాటి సంతానాన్ని ఇక్కడ చేసుకుని మళ్లీ జూలై, ఆగస్టులో పిల్లలతో కలిసి వారి దేశానికి వెళ్లిపోతాయి. ఇది దశాబ్దాల కాలంగా కొనసాగుతోంది. సంతానోత్పత్తికి అనువైన ప్రదేశంగా భావించి వీరాపురానికి వచ్చే ఈ ఎర్రకాళ్ల కొంగలను అతిథి పక్షుల్లా భావించి గ్రామస్తులు ఎంతో ప్రేమగా చూసుకుంటారు. ఐదేళ్ల క్రితం వరకు ఇక్కడ నీరు, ఆహారం వసతి తగ్గడంతో పక్షుల రాక కూడా తగ్గింది. గత రెండేళ్లుగా వర్షాపాతం ఎక్కువ నమోదు కావడంతో పక్షుల సంఖ్య మళ్లీ పెరిగింది. గతంలో ఎన్నడూ లేనంతగా ఈ రెండేళ్లలో పక్షులు పెద్ద సంఖ్యలో వీరాపురం గ్రామానికి వచ్చాయి. ఈ ఏడాది వీటి సంఖ్య మరింత పెరిగింది. గ్రామంలో చెట్లన్నీ ఈ పక్షుల గూళ్లతో నిండిపోయాయి. ఇటీవల ఈ పక్షులు గుడ్లు పొదిగి పిల్లల పునరుత్పత్తి జరిగింది.

చెదిరిన పక్షుల గూడు

20 నుంచి నెల రోజుల వయస్సున్నపక్షి పిల్లలు గూళ్లలో ఉన్నాయి. కాగ సోమవారం రాత్రి ఒక్కసారిగా ఈ వీరాపురం పరిసర గ్రామాల్లో గాలివాన బీభత్సం సృష్టించింది. దీంతో పక్షుల గూళ్లు చెదిరిపోయాయి. వాటిలో ఉన్న పిల్ల పక్షులు కింద పడి మృతి చెందాయి. మరికొన్ని రక్తగాయాలతో కాళ్లు విరిగి నడవలేని స్థితికి చేరుకున్నాయి. ఎక్కడ చూసినా వందలాది పక్షుల కబేళాలు కన్పించాయి. ఏ చెట్టు కింద చూసినా కాళ్లు విరిగి కుంటుతున్న పక్షులు... రెక్కలు విరిగి ఎగరలేక అగచాట్లు పడుతున్న, మృతి చెందిన పక్షులు కన్పించాయి. ఇక రెండు నెలల్లో పక్షుల సొంత దేశానికి వెళ్లే సమయంలో ప్రకృతి సృష్టించిన విలయ తాండవానికి ఆ పక్షుల జీవన రెక్కలు తెగిపోయాయి. మొత్తంగా ఎన్ని పక్షులు మరణించాయన్న దానిపై అధికారులు ఆ గ్రామంలో పర్యటించి లెక్కలు వేస్తున్నారు.

అధికారుల వైఫల్యమే...?

జిల్లాకు వచ్చే ఈ సైబీరియన్ పక్షులను అతిథుల్లా చూసుకోవడమే కాదు.. వాటి రక్షణను అధికారులు చూసుకోవాల్సి ఉంది. ఎంతో ప్రత్యేకత ఉన్న ఈ పక్షల రక్షణలో సంబంధిత శాఖలు పూర్తిగా వైఫల్యం చెందారనే విమర్శలు సర్వత్రా వ్యక్తం అవుతున్నాయి. అతిథి పక్షుల ప్రాణం పోవడానికి పృకతి విలయతాండవం ఎంత కారణమో... ప్రభుత్వం, సంబంధిత శాఖల వైఫల్యం కూడా అంతే ఉందనే వాదన బలంగా విన్పిస్తోంది. వీరాపురం గ్రామంలో 2016లో కూడా ఇలాగే ఒకసారి జరిగింది. అప్పుడు వందలాది పక్షుల పిల్లలు మృత్యువాత పడ్డాయి. కాళ్లూ రెక్కలు విరిగి నరకయాతన పడ్డాయి. ఆ తర్వాత పక్షుల రాక బాగ తగ్గింది. అప్పటి ప్రభుత్వం అధికారులు ఇలాంటి పరిస్థితులు భవిష్యత్తులో రాకూడదని పక్షులకు కృత్రిమ గూళ్లు ఏర్పాటు, చెట్లు పెంపకం, ఆహారం అందించడం వంటి కార్యక్రమాలు చేపడుతామని ప్రగల్బాలు పలికారు. అయితే 6 ఏళ్లుగా చేసింది ఏమీ లేదు. అటు పర్యాటక శాఖ, ఇటు అటవీశాఖ, పశువైద్య శాఖలు మాటలు తప్పా ఆచరణలో సైబీరియన్ పక్షుల సంరక్షణకు తీసుకున్న చర్యలు ఏమీలేవు. పక్షులకు ఏదైనా జరిగినప్పుడు అధికారులు అలా వచ్చి ఇలా వెళ్లిపోతుంటారు.

కామన్వెల్త్ వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు పల్లవి ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరం

స్థానిక తోట పాలెంలోని సత్య డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సరం చదువుతున్న సేనపతి పల్లవి జూలై 11 నుంచి 16 వ తేదీ వరకు ఢిల్లీలో జరగనున్న కామన్వెల్త్ వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్షిప్‌లో 64 కేజీల సీనియర్ విభాగం, జూలై 28 నుంచి ఆగస్టు 5 వరకు ఇండియాలో జరగబోయే ఏషియన్ వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్ 64 కేజీల జూనియర్ విభాగాలకు ఎంపికైంది. ప్రస్తుతం పల్లవి సీనియర్ నేషనల్ వెయిట్ లిఫ్టింగ్ కోచింగ్ క్యాంప్ లో పటియాలాలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నేతాజీ సుభాష్ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్పోర్ట్స్ లో శిక్షణ పొందుతున్నది. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ బొత్స ఝాన్సీలక్ష్మి, కళాశాల సంచాలకులు డాక్టర్ ఎం శశిభూషణరావు అభినందిస్తూ సత్య విద్యాసంస్థల తరపున పల్లవికి పౌష్టికాహారం నిమిత్తం రూ.30వేల నగదును అందజేశారు. ఈ సందర్భంగా ఝాన్సీలక్ష్మి మాట్లాడుతూ పల్లవికి మంచి భవిష్యత్తు ఉన్నదని జాతీయ అంతర్జాతీయ స్థాయిలో వెయిట్ లిఫ్టింగ్ లో బాగా రాణించి దేశానికి, రాష్ట్రానికి, విజయనగరం జిల్లాకు పేరు ప్రతిష్టలు తీసుకొని రావాలని ఆకాంక్షించారు.

మోడీ తీరుపై దళితుల ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నూతన పార్లమెంట్ భవనం ప్రారంభానికి రాష్ట్రపతిని ప్రధాని మోడీ ఆహ్వానించకపోవడాన్ని నిరసిస్తూ దళితులు మంగళవారం అంబేద్కర్ అందరివాడు సాధన సమితి ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా సమితి అధ్యక్షులు బొంగ భాను మూర్తి మాట్లాడుతూ ఈనెల 28న భారత నూతన పార్లమెంట్ ప్రారంభోత్సవంలో భాగంగా భారతదేశ ప్రథమ పౌరురాలు, భారత రాష్ట్రపతి గిరిజన ,ఆదివాసి మహిళ అయినా ద్రౌపదీ ముర్మును పార్లమెంట్ ప్రారంభోత్సవానికి ఆహ్వానించకపోవడం చాలా దారుణమని అన్నారభీ సందర్భంగా ప్రధానమంత్రి మోడీ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో దళిత ఐక్యవేదిక అధ్యక్షులు ఆదాడ మోహన్ రావు, ఉత్తరాంధ్ర అంబేద్కర్ రైట్స్ ప్రతినిధులు వెంకటరమణ, గంటా, వీర్రాజు, కార్పొరేటర్ పట్నాన పైడ్రాజు, ఆమ్ ఆద్మీ జిల్లా కన్వీనర్ దయానంద్ శర్మ, ఎయిమ్ ప్రతినిధి లక్ష్మణరావు, రెల్లి కుల సంఘం ప్రతినిధి సోము లక్ష్మణరావు, అరుణ్ కుమార్, రాజ్ కుమార్, దాసరి గౌరీస్ తదితరులు పాల్గొన్నారు.

కాకినాడలో నకిలీ మద్యం రాకెట్

- ఐదుగురి అరెస్ట్

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

డిస్ట్రిక్ట్ స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ అధికారి, స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో జి. ప్రేమ్ కాజల్ ఆధ్యర్యంలో సిబ్బంది కాకినాడ రూరల్ మండలం వాకలపూడి శ్రీనివాస నగర్‌లో సుంకం చెల్లించని యానాం నుంచి అక్రమంగా దిగుమతి చేసి నిల్వ ఉంచిన మద్యం బాటిళ్లను, నకిలీ లేబుళ్లను, ఐదు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని, ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. మంగళవారం దీనికి సంబంధించిన వివరాలను వెల్లడించేందుకు స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో జి. ప్రేమ్ కాజల్ విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో అనుమతించిన నకిలీ లేబెల్‌లను ముద్రించి వాటిని జీఆర్‌వో(గవర్నమెంట్ రిటైల్ అవుట్లెట్) రద్దీ అమ్మకపు వేళలైన సాయంత్ర సమయాలలో ఏ రోజుకు ఆ రోజు గోడౌన్ నుండి తెచ్చుకొని అమ్మకాలు జరపగా మిగిలిన మద్యం ను మరలా గోడౌన్‌లో దాచుకుంటూ అక్రమార్జన చేస్తున్నారన్నారు. దీనిపై వచ్చిన సమాచారంతో నిఘా ఉంచి సెబ్ అధికారులు ఎంతో చాకచక్యంగా వ్యవహరించి (1337) వేరు వేరు బ్రాండ్‌ల మద్యం సీసాలను స్వాధీనపరచుకొని, వేరు వేరు బ్రాండ్ లకు చెందిన (4177) నకిలీ లేటెల్ లను మరియు 5 సెల్ ఫోన్ లను సీజ్ చేసి, కాకినాడ రూరల్ మండలం తిమ్మాపురానికి చెందిన కరీ రాజా, కర్రీ విజయ్ కుమార్, కాకినాడ చెందిన గంపల నాగ వెంకట జ్ఞానేశ్వర కుమార్‌ను, గైగోలుపాడుకు చెందిన నకిలీ లేబెల్ తయారీదారుడు పాలిక రాజేష్, తూరంగికి చెంది మలిరెడ్డి మణికంఠ లను అరెస్ట్ చేసినట్టు తెలిపారు. యానాంకు చెందిన దువ్వారపు శివ ప్రసాద్ (చంటి) పరారీలో ఉన్నాడని తెలిపారు. ఈ కేసును కాకినాడ నార్త్ సెట్ స్టేషన్ నందు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. నకిలీ లేబుల్ రాకెట్‌ను కేసులో డిస్ట్రిక్ట్ స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ ఆఫీసర్, స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో డాక్టర్ జి. ప్రేమ్ కాజల్ వారి ఆధ్యర్యంలో అసిస్టెంట్ ఎన్ఫోర్స్మెంట్ సూపరింటెండెంట్ సిహెచ్ అజయ్ కుమార్ సింగ్, ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్, సెబ్- పి. సునీల్ కుమార్, ఎన్ఫోర్స్మెంట్ ఇన్స్పెక్టర్ బి. వెంకటేశ్వర రావు, ఎన్ఫోర్స్మెంట్ సబ్ ఇన్స్పెక్టర్ జె. విజయ్ కుమార్, సిబ్బంది - ఇ. ప్రసాద్, కె. నవీన్, జి. వెంకటరమణ లను జిల్లా ఎస్‌పి ఎస్. సతీష్ కుమార్ ప్రత్యేకంగా అభినందించారు.

ఢిల్లీపై కేంద్ర ఆర్డినెన్స్ రాజ్యాంగ విరుద్ధం

- పార్లమెంటులో వ్యతిరేకంగా ఓటు వేస్తాం
- సంయుక్త మీడియా సమావేశంలో ఏచూరి, కేజ్రీవాల్
- సిపిఎం కేంద్ర కార్యాలయంలో ఆప్ నేతల భేటీ



ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీలో పరిపాలనా వ్యవహారాలపై నియంత్రణకు సంబంధించిన అంశంపై కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన ఆర్డినెన్స్ రాజ్యాంగ విరుద్ధమని సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి పేర్కొన్నారు. ఈ ఆర్డినెన్స్‌కు వ్యతిరేకంగా ఆమాద్మీ పార్టీ చేస్తున్న పోరాటానికి తమ పార్టీ మద్దతు ఉంటుందని తెలిపారు. పార్లమెంటులోనూ ఐక్యంగా పోరాడుతామని, ఆర్డినెన్స్‌కు వ్యతిరేకంగా ఓటు వేస్తామని ప్రకటించారు. ఆమాద్మీ పార్టీ అధినేత, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ నేతృత్వంలోని బృందం ఢిల్లీలోని సిపిఎం కేంద్ర కార్యాలయమైన ఎకె గోపాలన్ భవన్‌కు విచ్చేశారు. సిపిఎం ప్రధానకార్యదర్శి సీతారాం ఏచూరి, పొలిట్‌బ్యూరో సభ్యులు ప్రకాశ్ కరత్, బృందాకరత్, ఎంఎ బేబీ, ఎ విజయరాఘవన్‌తో కేజ్రీవాల్ బృందం సమావేశమైంది. ఈ సమావేశంలో కేజ్రీవాల్‌తో పాటు ఢిల్లీ విద్యాశాఖ మంత్రి అతీషి మర్లెనా, ఎంపిలు సంజయ్ సింగ్, రాఘవ్ చద్దా కూడా పాల్గొన్నారు.

అనంతరం కేజ్రీవాల్, ఏచూరి సంయుక్తంగా మీడియాతో మాట్లాడారు. సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పును ఉల్లంఘిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఆర్డినెన్స్‌ను తీవ్రంగా ఖండిస్తున్నామని ఏచూరి చెప్పారు. ఇది కోర్టు ధిక్కారమే కాకుండా సమాఖ్య వ్యవస్థపై జరిగిన దాడి అని ఆయన విమర్శించారు. సైద్ధాంతిక వైరుధ్యాలు పక్కనబెట్టి రాజ్యాంగ పరిరక్షణ కోసం కాంగ్రెస్ తదితర పార్టీలు ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్రాల హక్కులపై కేంద్రం ఎనలేని దాడులకు పాల్పడుతోందనీ, ఆర్డినెన్స్‌ను రాష్ట్రాలపై దౌర్జన్యం చేసేందుకు ఒక మార్గంగా మోడీ సర్కార్ భావిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనికి వ్యతిరేకంగా అన్ని రాజకీయ పార్టీలు ముందుకు రావాలని కోరారు. బిజెపేతర ప్రభుత్వాలను అస్థిరపరిచేందుకు మోడీ ప్రభుత్వం ఎంతకైనా తెగిస్తుందనడానికి ఢిల్లీలో అది తీసుకొచ్చిన ఈ ఆర్డినెన్స్ ఒక ఉదాహరణ అని ఏచూరి తెలిపారు.

సుప్రీంకోర్టులో సవాల్ చేస్తాం: కేజ్రీవాల్

కేంద్రం తీసుకొచ్చిన నిరంకుశ ఆర్డినెన్స్‌కు వ్యతిరేకంగా ఆప్ ప్రభుత్వానికి సిపిఎం మద్దతు తెలియజేసినందుకు కేజ్రీవాల్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఆర్డినెన్స్‌కు వ్యతిరేకంగా సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామన్నారు. ఈ అంశంపై అన్ని ప్రతిపక్ష పార్టీలు ఏకతాటిపైకి వచ్చి తమకు మద్దతు ఇస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. రాజ్యసభలో బిజెపికి మెజారిటీ లేదని, ప్రతిపక్షాలు ఏకమైతే ఆర్డినెన్స్‌ను తిప్పికొట్టవచ్చునని పేర్కొన్నారు. ఇందుకు కాంగ్రెస్ నేతలు, ఇతర పక్షాల సభ్యులు సిద్ధంగా ఉన్నారా? లేదా? అనేది సమస్య కాదని, ఇది ప్రజాస్వామ్య సమస్య అని కేజ్రీవాల్ అన్నారు. ఈ విషయమై తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ, తెలంగాణ ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్ రావు, శివసేన నేత ఉద్ధవ్ ఠాక్రే, ఎన్సీపి అధినేత శరద్ పవార్‌ను కలిశామని కేజ్రీవాల్ చెప్పారు. 'ఇది కేజ్రీవాల్‌కు సంబంధించిన సమస్య కాదు..మొత్తం ఈ దేశ ప్రజలది' అని ఆయన అన్నారు. తాము చేస్తున్న న్యాయ పోరాటానికి అన్ని పక్షాలు సహకరించాలని కోరారు.

ఇదీ నేపథ్యం

ఢిల్లీలో ప్రభుత్వ ఉద్యోగుల నియమాకాలు, బదిలీల అంశంపై కేంద్ర ప్రభుత్వ కనుసన్నల్లో పనిచేసే లెఫ్టినెంట్ గవర్నరుకు, ఢిల్లీ రాష్ట్ర ప్రభుత్వానికి నిత్యం ఘర్షణాత్మక వాతావరణం ఉండేది. దీంతో ఈ అంశం సుప్రీంకోర్టుకు చేరింది. ప్రజాస్వామ్యంలో ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వానిదే అంతిమ నిర్ణయమని సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం ఆప్ ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు వెలువరించి కేంద్ర ప్రభుత్వానికి మొట్టికాయలు వేసింది. ఈ తీర్పును ఏమాత్రం జీర్ణించుకోలేని మోడీ సర్కార్ ఢిల్లీలో నియామకాలపై అధికారాన్ని లెఫ్టినెంట్ గవర్నరుకే కట్టబెడుతూ ఆర్డినెన్స్ తీసుకొచ్చింది. సుప్రీంకోర్టు తీర్పును ఉల్లంఘిస్తూ తీసుకొచ్చిన ఆర్డినెన్స్‌పై సిపిఎం సహా ప్రతిపక్షాలన్నీ ఇప్పటికే ఆగ్రహం వ్యక్తం చేశాయి. తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశాయి. ఈ నేపథ్యంలో పార్లమెంటులోనూ ఆర్డినెన్స్‌కు వ్యతిరేకంగా ఓటు వేసి తమ పోరాటానికి మద్దతు ఇవ్వాలని కేజ్రీవాల్ బిజెపియేతర పక్షాల నేతలతో సమావేశమవుతున్నారు. ఆర్డినెన్స్‌కు వ్యతిరేకంగా మద్దతు సమీకరిస్తున్నారు.

రిటైర్డ్ జడ్జిలకు రెండేళ్లపాటు రాజకీయ పదవులు వద్దు

- సుప్రీంకోర్టులో పిటిషన్

న్యూఢిల్లీ : సుప్రీంకోర్టు, హైకోర్టు జడ్జిలు పదవీ విరమణ చేసిన తరువాత రెండేళ్ల వరకూ గవర్నర్ వంటి రాజకీయ పదవులు స్వీకరించకుండా నిషేధం విధించాలని కోరుతూ పిటీషన్ దాఖలయింది. బాంబే లాయర్స్ అసోసియేషన్ సోమవారం సుప్రీంకోర్టులో ఈ పిటీషన్ దాఖలు చేసింది. సుప్రీంకోర్టు మాజీ జడ్జి ఎస్ అబ్దుల్ నజీర్‌ను ఆంధ్రప్రదేశ్ గవర్నర్‌గా ఇటీవల నియమించడాన్ని పిటీషన్‌లో ప్రస్తావించారు. ఈ పిటిషన్ వేయడానికి ఇదే కారణమని తెలిపింది. ప్రజాస్వామ్య సూత్రాలను, రాజ్యాంగం యొక్క ప్రాథమిక లక్ష్యాన్ని కాపాడాలని పిటీషన్ కోరింది. బాబ్రీమసీదు-రామజన్మభూమి, 2016 నోట్ల రద్దుకు వ్యతిరేకంగా కేసుల్లో కీలక తీర్పులు ఇచ్చిన ధర్మాసనాల్లో జస్టిస్ నజీర్ ఒక న్యాయమూర్తిగా ఉన్నారు. సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తులు పదవీ విరమణ తరువాత ఎలాంటి వ్యవధి లేకుండా రాజకీయ పదవులు చేపడితే, అది న్యాయవ్యవస్థ యొక్క స్వతంత్రతపై ప్రజలకు ఉన్న నమ్మకంపై ప్రతికూల ప్రభావం చూపుతుందని పిటీషన్ తెలిపింది. సుప్రీంకోర్టు జడ్జిగా పదవీ విరమణ చేసిన తొమ్మిదేళ్ల తరువాత మహ్మద్ హిదాయుతుల్లా ఉపరాష్ట్రపతిగా బాధ్యతలు నిర్వహించారని, తాత్కాలిక రాష్ట్రపతిగానూ పని చేశారని పిటీషన్ గుర్తు చేసింది. కూలింగ్-ఆఫ్ పీరియడ్ అవశ్యకతను ప్రస్తావించింది. కాగా, 2014 బిజెపి అధికారంలోకి వచ్చిన రాజకీయ పదవులు చేపట్టిన మూడోవ సుప్రీంకోర్టు మాజీ జడ్జిగా నజీర్ నిలిచారు. మాజీ సిజెఐ పి సదాశివం పదవీ విరమణ చేసిన ఐదు నెలల్లోనే కేరళ గవర్నర్‌గా నియమితులయ్యారు. మరో మాజీ సిజెఐ రంజన్ గొగోయ్ రాజ్యసభకు ఎంపికయ్యారు.

అటవీ సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలి

- జూన్ 30న దేశవ్యాప్త ఆందోళన
- భూమి అధికార్ ఆందోళన్ (బిఎఎ) పిలుపు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

గిరిజనులతో పాటు అడవులు, అటవీ సంపదపై ఆధారపడి జీవిస్తున్న వారి హక్కులను హరించే ప్రతిపాదిత అటవీ పరిరక్షణ సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలని భూమి అధికార్ ఆందోళన్ (బిఎఎ) డిమాండ్ చేసింది. కేంద్ర ప్రభుత్వం రూపొందించిన ఈ బిల్లును వీలైనంత త్వరగా ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ బిఎఎలో భాగమైన దాదాపు 50 సంఘాలు జూన్ 30న దేశవ్యాప్త ఆందోళనలు చేపట్టనున్నట్లు తెలిపింది. దేశంలోని ఖనిజాలు అధికంగా ఉన్న అటవీ ప్రాంతాలను కార్పొరేట్లకు ఇవ్వడానికి ఈ సవరణ బిల్లును తీసుకొచ్చారని బిఎఎ ఆందోళన వ్యక్తం చేసింది. మంగళవారం నాడిక్కడ ఎఐకెఎస్ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హన్నన్ మొల్లా, విజూ కృష్ణన్ (ఎఐకెఎస్), విక్రమ్ సింగ్ (ఎఐఎడబ్ల్యుయు), ప్రేమ్ సింగ్ (కిసాన్ మహాసభ), సత్యవాన్ (రైతు కార్మిక సంఘం), రోమా మల్లిక్ తదితరులు మాట్లాడారు. ప్రతిపాదిత బిల్లు అటవీ నిర్వచనాన్నే మార్చేసిందని, అటవీ హక్కుల చట్టం, అటవీ రక్షణ చట్టం, పెసా చట్టం, జాతీయ అటవీ విధానానికి విరుద్ధమైన నిబంధనలు ఈ బిల్లులో చేర్చారని తెలిపారు. రైల్వే ట్రాక్‌లు, పబ్లిక్ రోడ్‌లకు ఆనుకుని ఉన్న అటవీ ప్రాంతాలు, అంతర్జాతీయ సరిహద్దుల నుండి 100 కిలో మీటర్ల పరిధిలోని అడవులు, నియంత్రణ రేఖలకు అటవీ రక్షణ నిబంధనల నుండి మినహాయింపు ఇచ్చారని ఆందోళన వ్యక్తం చేశారు. అటవీ హక్కుల చట్టం ప్రకారం అడవులపై అధికారం గ్రామసభలకే ఉంటుందని, గ్రామసభల అనుమతితో మాత్రమే అటవీ భూమిని ఇతర అవసరాలకు వినియోగించుకోవాల్సివుంటుదని వారు తెలిపారు. కానీ కొత్త బిల్లుతో మైనింగ్, ఇతర అవసరాల కోసం కార్పొరేట్లకు అటవీ భూములను ఇచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధం చేస్తోందని, దీంతో ఆదివాసీలు తదితరులను పూర్తిగా అడవులకు దూరం చేయనున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో బిఎఎ చేపట్టనున్న ఆందోళనలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.



రైతులతో కలిసి పనిచేస్తూ వారి సమస్యలు వింటున్న వ్యకాస నాయకులు

మణిపూర్‌లో హింసాకాండపై న్యాయ విచారణ

- రాష్ట్రపతికి కాంగ్రెస్ నేతల వినతి

న్యూఢిల్లీ : మణిపూర్‌లో హింసాకాండపై న్యాయవిచారణ జరిపించాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కాంగ్రెస్ పార్టీ కోరింది. ఈ మేరకు కాంగ్రెస్ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే నేతృత్వంలోని బృందం రాష్ట్రపతిభవన్‌లో ద్రౌపది ముర్మును కలిసి వినతిపత్రం అందజేశారు. మణిపూర్‌లో హింసాకాండకు సుమారు 100 మంది చనిపోయారని, వేలాది మంది నిరాశ్రయులయ్యారని తెలిపారు. అక్కడ ఘర్షణలు నివారించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఘోరంగా విఫలమయ్యాయని ఫిర్యాదు చేశారు. రాష్ట్రంలో సాధారణ పరిస్థితిని తక్షణమే పునరుద్ధరించడానికి చర్యలు చేపట్టాలని కోరింది. దీంతో పాటు మరో 12 విన్నపాలను కూడా రాష్ట్రపతికి కాంగ్రెస్ సమర్పించింది. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తితో విచారణ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని, పునరావసం కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరింది. గల్లంతైన వారి ఆచూకీ గుర్తించడానికి ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని విన్నవించింది. ప్రస్తుతం మణిపూర్‌లో కేంద్ర హోం మంత్రి అమిత్ షా పర్యటిస్తున్న సమయంలో కాంగ్రెస్ నాయకులు రాష్ట్రపతిని కలవడం విశేషం.



శాంతిని పునరుద్ధరించకపోతే పతకాలు వెనక్కి..

- అమిత్ షాకు మణిపూర్ క్రీడాకారుల హెచ్చరిక

ఇంఫాల్ : మణిపూర్‌లో వేగంగా శాంతిని నెలకొల్పకపోతే తమ పతకాలు, అవార్డులు తిరిగి ఇచ్చేస్తామని ఆ రాష్ట్రానికి చెందిన 13 మంది ప్రముఖ క్రీడాకారులు హెచ్చరించారు. ఈ మేరకు కేంద్ర హోం మంత్రి అమిత్‌షాకు మంగళవారం మెమోరాండం అందచేశారు. రాష్ట్రంలో హింసకు కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రస్తుతం అమిత్ షా మణిపూర్‌లో నాలుగు రోజుల పర్యటనలో ఉన్న సంగతి తెలిసిందే. మెమోరాండంపై సంతకం చేసిన వారిలో ఒలింపిక్ పతక విజేత మీరాబాయి చాను, వెయిట్‌లిఫ్టర్ కుంజరాణి దేవి, భారత మహిళ ఫుట్‌బాల్ జట్టు మాజీ కెప్టెన్ ఓనమ్ బెమ్ బెమ్ దేవి, బాక్సర్ ఎల్.సరితా దేవి, ఒలింపియన్ జూడోకా లిక్మాబామ్ సుశీల దేవి, బాక్సర్ ఎల్. ఇబోమ్చా సింగ్ ఉన్నారు. మణిపూర్‌లో శాంతిని నెలకొల్పేందుకు అవసరమైన చర్యలు తీసుకోవడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైతే, తాము తమ అవార్డులను వెనక్కి ఇచ్చేయడం సముచితం అని మెమోరాండంలో క్రీడాకారులు పేర్కొన్నారు.

కర్ణాటకలో 1 నుంచి మహిళలకు ఉచిత రవాణా

- ఎన్నికల హామీల అమలుపై సర్కార్ కసరత్తు

ప్రజాశక్తి - బెంగళూరు ప్రతినిధి

కర్ణాటకలో మహిళలందరికీ వచ్చే జూన్ నెల ఒకటో తేదీ నుంచి బస్సులలో ఉచిత రవాణా సదుపాయం అమలులోకి రానుంది. కర్ణాటక రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (కెఎస్ఆర్‌టిసి)కి చెందిన రాజధాని, ఐరావత, వాయుదూత సర్వీసులు మినహా మిగిలిన అన్ని బస్సులలో మహిళలు ఉచితంగా ప్రయాణం చేయవచ్చు. కెఎస్ఆర్‌టికి చెందిన ఐదు కార్పొరేషన్ల ఉన్నతాధికారులతో మంగళవారం రాష్ట్ర రవాణ శాఖ మంత్రి రామలింగారెడ్డి సమావేశం నిర్వహించారు. ఎటువంటి ముందస్తు షరతులు లేకుండా మహిళలందరూ బస్సులలో ఉచితంగా ప్రయాణం చేయవచ్చునని సమావేశం అనంతరం మంత్రి రామలింగారెడ్డి వెల్లడించారు. ఇందుకు సంబంధించిన అధికారిక ప్రకటనను ముఖ్యమంత్రి సిద్ధరామయ్య జూన్ 1న మంత్రివర్గ సమావేశం అనంతరం ప్రకటిస్తారని ఆయన తెలిపారు. దీంతో పాటు ఎన్నికల్లో ఇచ్చిన అన్ని హామీల అమలుపై సిద్ధరామయ్య ప్రభుత్వం కసతర్తు చేస్తోంది. అత్యధిక హామీలను జూన్ ఒకటో తేదీ నుంచే అమల్లోకి తీసుకురావడానికి ముమ్మరంగా కసరత్తు చేస్తోంది.

యుపిలో శ్రమజీవుల పోరుబాట

- ఓపిఎస్ కోసం ఉద్యోగులు, ఎంఎస్‌పి కోసం అన్నదాతలు
- ఉమ్మడిగా భారీ ఆందోళనలు, నిరసనలకు పిలుపు

లక్నో : ఉత్తరప్రదేశ్‌లో బిజెపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా రైతులు, ఉద్యోగులు భారీ ఎత్తున ఆందోళనలకు సిద్ధమవుతున్నారు. సమాజంలో ముఖ్యమైన ప్రభుత్వ ఉద్యోగులు, రైతులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమబాట పట్టడం కలకలం రేపుతోంది. పాత పెన్షన్ స్కీమ్ (ఓపిఎస్) పునరుద్ధరించాలని ఉద్యోగులు, కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి) కల్పించాలని రైతులు ప్రధాన డిమాండ్‌తో ఈ ఆందోళనకు దిగుతున్నారు. విద్యుత్ ప్రయివేటీకరణపైనా అన్నదాతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రైతులు, ఉద్యోగుల ఆందోళనల్లో ఎంఎస్‌పి, ఓపిఎస్‌లతో పాటు స్థానిక సమస్యలు ప్రధానంగా ప్రస్తావించనున్నారు. ఇటీవల జరిగిన హిమాచల్ ప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో ఈ కారణంగానే బిజెపి ఓటమి పాలయిందని, ఓపిఎస్‌ను పునరుద్ధరించకుంటే యుపి అసెంబ్లీ, 2024 సాధారణ ఎన్నికల్లోనూ బిజెపికి అదే గతి పడుతుందని ఉద్యోగులు హెచ్చరిస్తున్నారు. ఆగస్టు 9న రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు తమ నిరసనను ప్రారంభిస్తారని సంఘాల నాయకులు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా కార్ల, బైక్ ర్యాలీలతో పాటు నిరసన సభలు నిర్వహిస్తారని చెప్పారు. నవంబర్ 3న దేశ రాజధానిలో ఉద్యోగులు భారీ నిరసన ర్యాలీని నిర్వహించనున్నారు. రైతులు కూడా మూడు విడతలుగా తమ ఆందోళనలు నిర్వహించనున్నట్లు రైతు సంఘాల నాయకులు చెప్పారు. ముందుగా మొదటి దశలో భాగంగా మేలో రైతులు ప్రజాప్రతినిధులకు తమ డిమాండ్లపై వినతి పత్రాలు అందజేయనున్నారు. ఆగస్టులో జరిగే రెండో విడతలో స్థానికంగా నిరసనలు, ర్యాలీలు నిర్వహించనున్నారు. ఇక చివరి, మూడోవ దశలో నవంబర్ 26 నుంచి 28 తేదీ వరకూ 72 గంటల పాటు ఢిల్లీ సరిహద్దుల్లో రైతులు సమావేశం కానున్నారు. అలాగే, బిజెపి పాలనలో ఆరోగ్య సంరక్షణ, విద్య చాలా ఖరీదుగా మారాయని రైతులు, ఉద్యోగులు ఆరోపిస్తున్నారు.

హింసకు కేంద్రమే కారణం

- అమిత్ షాతో విద్యార్థి సంఘాలు

న్యూఢిల్లీ : మణిపూర్‌లో గత కొంతకాలంగా కొనసాగుతున్న హింసాకాండకు కేంద్ర, రాష్ట్ర భద్రతా దళాలే కారణమని మణిపూర్ స్టూడెంట్స్ అసోసియేషన్ ఢిల్లీ (ఎంఎస్ఏడీ) విమర్శించింది. రాష్ట్రంలోని కుకీలు, మీతీల ప్రాణాలు, ఆస్తులను పరిరక్షించడంలో ప్రభుత్వం దారుణంగా విఫలమైందని మండిపడింది. ఈ మేరకు ఎంఎస్ఏడీకి చెందిన విద్యార్థులు కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు మెమొరాండం సమర్పించారు. రాష్ట్రంలో సుస్థిర శాంతి స్థాపనకు కృషి చేయాలని వారు కోరారు. రాష్ట్రంలో పెచ్చరిల్లుతున్న హింసాకాండ నేపథ్యంలో అమిత్ షా సోమవారం సాయంత్రం మణిపూర్ చేరుకొని గవర్నర్‌తో, రాష్ట్ర మంత్రులతో సమావేశమయ్యారు. కేంద్ర భద్రతా దళాల పర్యవేక్షణలో కొన్ని విచ్ఛిన్నకర శక్తులు ఉద్దేశపూర్వకంగా జాతి ఘర్షణలను ప్రేరేపించాయని విద్యార్థులు ఆరోపించారు. సంకుచిత రాజకీయ ప్రయోజనాల కోసం రాష్ట్రాన్ని ముక్కలు చేసేందుకు ఈ శక్తులు కుట్ర పన్నాయని మండిపడ్డారు. ఇలాంటి విచ్ఛిన్నకర శక్తుల వలలో పడవద్దని రాష్ట్ర ప్రజలను కోరారు. మణిపూర్ ఐక్యత, సమగ్రతలకు భంగం కలిగించేందుకు జరుగుతున్న మతపరమైన ప్రచారానికి వ్యతిరేకంగా ప్రజలందరూ సంఘటితమై పోరాడాలని పిలుపునిచ్చారు. నెల రోజులుగా రాష్ట్రం హింసతో అట్టుడుకుతుంటే కేంద్రం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. పైగా జాతుల మధ్య హింసను ప్రేరేపించిందని చెప్పారు.

మాస్కోపై డ్రోన్ దాడులు

- ఉక్రెయిన్, నాటో దళాల పనే
- ఇద్దరికి స్వల్ప గాయాలు

మాస్కో : రష్యా రాజధాని మాస్కోపై మంగళవారం డ్రోన్ దాడులు జరిగాయి. ఉక్రెయిన్‌లోని నాటో దళాలే ఈ దాడులకు పాల్పడినట్లు రష్యా అధికారులు పేర్కొన్నారు. ఈ దాడుల్లో ఇద్దరు గాయపడ్డారు. పలు భవనాలకు పగుళ్లు ఏర్పడ్డాయి. తమ దేశ గగనతల రక్షణ వ్యవస్థలు అనేక డ్రోన్లను కూల్చివేశాయని పేర్కొన్నారు. ఈ దాడుల తర్వాత మాస్కోలో అత్యవసర సేవల వ్యవస్థలను అప్రమత్తం చేశారు. దాడులు చోటుచేసుకున్న ప్రాంతం నుంచి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. దాడి కోసం ప్రయోగించిన 8 డ్రోన్లను కూల్చివేసినట్లు రష్యా రక్షణ మంత్రిత్వశాఖ వెల్లడించింది. ఈ దాడికి కారణమైన కుట్రదారులను గుర్తిస్తున్నామని పేర్కొంది. రష్యాపై ఉక్రెయిన్ డ్రోన్ దాడులకు దిగడం ఈ నెలలో ఇది రెండోసారి. ఈ నెల మొదటి వారంలో మాస్కో నగరంలోని అధ్యక్షులు వ్లాదిమిర్ పుతిన్ సహా కీలక పరిపాలన యంత్రాంగమంతా కార్యకలాపాలు నిర్వహించే క్రెమ్లిన్ భవనాలపై రెండు డ్రోన్లు దాడి చేశాయి. ఈ భవనాల్లో అధ్యక్ష కార్యాలయం, నివాసం కూడా ఉన్నాయి. అయితే లక్ష్యాలను ఢీకొట్టకముందే ఆ డ్రోన్లను కూల్చేశామని అప్పట్లో రష్యా ప్రకటించింది. పుతిన్‌ను హత్య చేసేందుకే వీటిని ఉక్రెయన్ పంపిందని, ఇది ఉగ్రవాద చర్య అని పేర్కొంది. దాడి వీడియో దృశ్యాలు స్థానిక మాస్కో న్యూస్‌కు చెందిన టెలిగ్రామ్ ఛానెల్‌లో కనిపించాయి.



దాడులపై ఉక్రెయిన్ హర్షం

మాస్కోలో డ్రోనులతో దాడిపై ఉక్రెయిన్ సంతోషం వ్యక్తం చేసింది. ఈ దాడులు తాము చేయలేదని, అయితే దాడుల తీవ్రం కావడం చూసి సంతోషిస్తానున్నామని ఉక్రెయిన్ అధ్యక్ష సలహాదారు మైఖెలోవ్ పొడల్యాక్ తెలిపారు. ఈ దాడులతో తమకు ఎటువంటి సంబంధం లేదన్నారు.

దయనీయస్థితిలో ఉత్తరప్రదేశ్ గ్రామీణం


- పలు ప్రాంతాల్లో వ్యవసాయ కార్మిక సంఘం పర్యటన
- దీనస్థితిపై గోడు వెల్లబోసుకున్న గ్రామీణ ప్రజలు
- మోడీ, యోగి విధానాలపై వ్యకాస నేతల ఆగ్రహం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఉత్తరప్రదేశ్ గ్రామీణ ప్రాంతాలు కన్నీళ్లు పెడుతున్నాయి. ఉపాధి కరువై, బతుకు భారమై బతుకు జీవుడా అంటూ గ్రామీణ ప్రజానీకం కాలం వెళ్లదీస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో తినడానికి కూడా తిండి లేక ప్రజలు పస్తులుంటున్న దయనీయ పరిస్థితి నెలకొంది. భారత వ్యవసాయ కార్మిక సంఘం (ఎఐఎడబ్ల్యుయు) బృందం యుపిలోని పలు గ్రామాలను సందర్శించి అక్కడి ప్రజల స్థితిగతులపై గత మూడు రోజులుగా అధ్యయనం చేస్తున్నాయి. ప్రధానంగా మురదాబాద్, బరేలీ జిల్లాల్లో పర్యటించారు. బిజెపి పాలనలో తినడానికి తిండి కూడా లేకుండా పోతోందని వ్యకాస నేతల ఎదుట ప్రజలు గోడు వెల్లబోసుకున్నారు. మంగళవారం నాటి అధ్యయన పర్యటనలో ఎఐఎడబ్ల్యుయు ప్రధానకార్యదర్శి బి వెంకట్ కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకట్ మాట్లాడుతూ యుపి గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కరువై, బతుకు బరువై, పెరుగుతున్న నిత్యవసర ధరలతో జీవనం సాగించలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో దేశంలోని ఇతర ప్రాంతాలకు యుపి ప్రజలు వలస పోతున్నారన్నారు. తినటానికి తిండి లేక, పస్తులు ఉంటున్న కుటుంబాలు అనేకం కనిపించాయన్నారు. ఉపాధి హామీ పథకం కూడా సరిగా అమలు కావడం లేదన్నారు. దీంతో ప్రధాని నరేంద్ర మోడీ, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వాల పట్ల గ్రామీణ పేదల్లో తీవ్రమైన ఆగ్రహావేశాలు పెరుగుతున్నాయని తెలిపారు. యుపిలో సంపదనంతా లూటీ చేయడానికి కార్పొరేట్లకు యోగి సర్కార్ లైసెన్స్ ఇచ్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిఘటించిన ప్రజలను, ఉద్యమకారులను లాఠీలు తూటాలతో అణిచేస్తున్నారని, కాల్పులకు కూడా తెగబడుతున్నారని విమర్శించారు. యుపిలో 4 కోట్ల మంది దళితులు, 5 కోట్ల మంది ముస్లింలు ఉన్నారని తెలిపారు. 80 శాతం దళితులు నేటికీ వ్యవసాయ కార్మికులు గానే ఉన్నారన్నారు. అధికారంలో ఉన్న బిజెపి, ఇతర నేతలు నకిలీ జాబు కార్డులతో ఉపాధి నిధులను దోచుకుంటున్నారన్నారు. ఉపాధి హామీ పథకం అమలు ఉత్తరప్రదేశ్‌లో అత్యంత దారుణంగా ఉందని తెలిపారు. ఈ అధ్యయన బృందంలో వెంకట్ తో పాటు వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బ్రిజ్ లాల్ భారతి, రాజీవ్, తాన్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

లాటిన్ అమెరికా సమగ్రతకు 120 రోజుల్లో కొత్త రోడ్‌మ్యాప్

- బ్రెజిల్ అధ్యక్షుడు లూలా వెల్లడి



బ్రసీలియా: కొత్త దక్షిణ అమెరికా సమగ్రతకు 120 రోజుల్లో రోడ్ మ్యాప్ వెల్లడించనున్నట్లు బ్రెజిల్ అధ్యక్షుడు లూలా డసిల్వా మంగళవారం ప్రకటించారు. దక్షిణ అమెరికా దేశాల శిఖరాగ్ర సదస్సును ఆయన మంగళవారం నాడిక్కడ ప్రారంభిస్తూ, రాజకీయంగా, నిర్మాణపరంగా, బలమైన, సురక్షితమైన, నిజమైన లాటిన్ అమెరికా, కరీబియన్ దేశాల సమాఖ్యను ఏర్పాటు చేసి, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందేలా చూడడమే ఈ రోడ్‌మ్యాప్ లక్ష్యమని అన్నారు. 12 దక్షిణ అమెరికా దేశాల ప్రాంతీయ సమైక్యత పునరుద్ధరణకు కొత్త దారులు తెరుస్తామన్నారు. ఈ సదస్సులో ఆల్బెర్టో ఫెర్నాండెజ్ (అర్జెంటీనా), లూయిస్ ఆర్స్ (బొలీవియా), గాబ్రియెల్ బోరిక్ (చిలీ), గుస్తావో పెట్రో (కొలంబికా), గిలెర్మో లాసో (ఈక్వెడార్), ఇర్ఫాన్ అలీ (గయానా)మారియో ఆబ్దో (పరాగ్వే), చాన్ సంతోఖి (సురినామ్), లూయిస్ లకాల్లే (ఉరుగ్వే), నికోలస్ మదురో (వెనిజులా), పెరూ మంత్రి మండలి ఛైర్మన్ ఆల్బెర్టో ఒటెరో తదితరులు పాల్గొన్నారు. 200 సంవత్సరాల క్రితం రిపబ్లిక్‌లు ఏర్పడినప్పుడు దక్షిణ అమెరికా దేశాల మధ్య ఐక్యత ఉండేది కాదు. వేటికవి ఎవరికి వారే యమునా తీరే అన్నట్టుగా ఉండేవి.



మీడియాతో మాట్లాడుతున్న రెజ్లర్లు

ప్రాణ సమానమైన పతకాలు గంగలోకి..!


(మొదటి పేజీ తరువాయి)

పతకాలను గంగలో కలిపేశాకా మేమున్నా లేనట్టే..అందుకే ప్రాణాలను ఒడ్డి న్యాయ పోరాటం సాగిస్తాం. ఇండియా గేట్ వద్ద ఆమరణ నిరహార దీక్ష చేస్తాం' అని తెలిపారు. క్రీడాకారులపై లైంగిక వేధింపులకు పాల్పడిన భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యుఎఫ్ఐ) చీఫ్, బిజెపి ఎంపి బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ పై అరెస్టు చేయాలని రెజ్లర్లు పోరాడుతన్న సంగతి తెలిసిందే.

కలకలం రేపిన రెజ్లర్ల ప్రకటన

సాక్షి మాలిక్, బజరంగ్ పూనియా, వినేష్ ఫోగట్ విడుదల చేసిన సంయుక్త ప్రకటన దేశవ్యాప్తంగా కలకలం రేపింది. మంగళవారం సాయంత్రం 6 గంటలకు హరిద్వార్‌లోని గంగా నదిలో తమ పతకాలను నిమజ్జనం చేస్తామని వారు ట్వీట్ చేశారు. ఈ పతకాలు తమ ప్రాణమని, తమ ఆత్మ అని చెప్పారు. వీటిని గంగా నదిలోకి విసిరేసిన తరువాత జీవించి ఉండటంలో అర్థం లేదన్నారు. వీటిని గంగా నదిలో కలిపేసిన తరువాత తాము ఇండియా గేట్ వద్ద ఆమరణ నిరాహార దీక్ష చేస్తామని చెప్పారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ తమను "మా బిడ్డలు" అని అంటూ ఉంటారని, కానీ ఆయన కూడా తమ పట్ల ఎటువంటి శ్రద్ధ చూపించడం లేదని వాపోయారు. తమను అణచివేస్తున్న బ్రిజ్ భూషణ్‌ను నూతన పార్లమెంట్ భవనం ప్రారంభోత్సవానికి ఆహ్వానించారని పేర్కొన్నారు. ఆయన తళతళ మెరిసే తెల్లని దుస్తుల్లో ఫొటోలకు ఫోజులిచ్చారని, ఆ కాంతిలో తాము వెలిసిపోయామని అన్నారు. ఇండియా గేట్ "జాతీయ స్మారక చిహ్నం. అది ప్రదర్శనలకు స్థలం కాదు" కాబట్టి రెజ్లర్లు నిరసనకు అనుమతించబోమని ఢిల్లీ పోలీసులు తెలిపారు.

రెజ్లర్లకు అనిల్ కుంబ్లే మద్దతు




బిజెపి ఎంపి బ్రిజ్ భూషన్ లైంగిక వేధింపులకు వ్యతిరేకంగా పోరాడుతున్న రెజ్లర్లకు సీనియర్ క్రికెటర్ అనిల్ కుంబ్లే మద్దతు తెలిపారు. "మే 28న మన రెజ్లర్లు దాడికి గురికావడంతో ఏమి జరిగిందో విని విస్తుపోయాను. సరైన చర్చల ద్వారా దేన్ని అయినా పరిష్కరించుకోవచ్చు. వీలైనంత త్వరగా పరిష్కారం వస్తుందని ఆశిస్తున్నాం" అని పేర్కొన్నారు.

రేపు దేశవ్యాప్త ఆందోళనలు

రెజ్లర్లకు మద్దతుగా జూన్ 1న (గురువారం) దేశవ్యాప్త ఆందోళనలకు సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్ కెం), వ్యవసాయ కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయి. రెజ్లర్ల పోరాటంపై అణిచివేతను తీవ్రంగా ఖండించాయి. ఈ మేరకు మంగళవారం ఎస్ కెఎం ప్రకటన విడుదల చేసింది. అలాగే ఎఐఎడబ్ల్యుయు, బికెఎంయు, ఎఐఎస్ కెఎస్, ఎఐఎఆర్ఎల్ఎ, ఎఐఎకెఎస్‌యు సంఘాలు సంయుక్తంగా పిలుపునిస్తూ ప్రకటన విడుదల చేశాయి. బిజెపి ఎంపి బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌ను అరెస్టు చేయాలని డిమాండ్ చేశాయి. జూన్ 1న దేశంలోని అన్ని జిల్లా, మండల కేంద్రాల వద్ద భారీ ప్రదర్శనలు, దిష్టిబొమ్మ దగ్ధం చేయాలని కోరాయి. కాగా జూన్ 5న అయోధ్యలో బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌కు మద్దతుగా ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు, సన్యాసులు ర్యాలీ నిర్వహించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ నేపథ్యంలో అదే రోజున గ్రామ, పట్టణ కేంద్రాలలో బిజెపి ఎంపి బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ దిష్టిబొమ్మను దగ్ధం చేసి ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు సంయుక్త కిసాన్ మోర్చా ప్రకటించింది.

కాగా జూన్ నుంచి 3 వరకు దేశవ్యాప్తంగా ఆందోళనలు చేపట్టాలని మహిళ సంఘాలు పిలుపునిచ్చాయి. బ్రిజ్ భూషన్ ను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశాయి. మంగళవారం ఈ మేరకు ఐద్వాతో సహా 11 మహిళ సంఘాలు సంయుక్తంగా ప్రకటన విడుదల చేశాయి.

నిద్ర లేని రాత్రిని గడిపా: అభినవ్ బింద్రా



ఒలింపిక్ స్వర్ణ పతక విజేత అభినవ్ బింద్రా మాట్లాడుతూ "గత రాత్రి నిద్రలేదు. నా తోటి మల్లయోధుల నిరసనల భయానక చిత్రాలు వెంటాడాయి. మేము క్రీడా సంస్థల అంతటా స్వతంత్ర రక్షణ చర్యలను ఏర్పాటు చేయాల్సిన సమయం ఆసన్నమైంది. అటువంటి పరిస్థితులు తలెత్తితే, వారు అత్యంత సున్నితత్వం, గౌరవంతో వ్యవహరించేలా చూసుకోవాలి. ప్రతి క్రీడాకారుడు సురక్షితమైన, సాధికారతతో కూడిన వాతావరణానికి అర్హులు" అని పేర్కొన్నారు.

అంతర్జాతీయ రెజ్లింగ్ పాలక మండలి ఖండన

రెజ్లర్లపై ఢిల్లీ పోలీసుల దాష్టీకాన్ని అంతర్జాతీయ రెజ్లింగ్ పాలక మండలి ఖండించింది. భారత రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్ పై వచ్చిన ఆరోపణలపై సమగ్రమైన, నిష్పాక్షిక దర్యాప్తు జరిపించాలని అది కోరింది. రెజ్లర్లను అరెస్టు చేసి వివిధ పోలీస్ స్టేషన్లలో నిర్బంధించడంపై ఆందోళన వ్యక్తం చేసింది.

విజయవాడ
బుధవారం 31 మే 2023

వేసవి విడిది





- టి. తపస్విని,
3వ తరగతి,
కుమ్మర్లవీధి, విస్సన్నపేట,
ఎన్‌టిఆర్ జిల్లా.

తల్లి మాట




ఒక అడవిలో పిచ్చుక తన పిల్లతో ఒక చెట్టు మీద నివసిస్తుంది. ఆహారం కోసం వెళ్తూ పిచ్చుక తన పిల్లతో 'బిడ్డా... బయటకు వెళ్ళొద్దు. ఎండలు ఎక్కువగా ఉన్నాయి. ఇంట్లోనే ఉండు' అని చెప్పి ఆహారం కోసం బయలుదేరింది. వాళ్ళమ్మ మాట వినకుండా పిచ్చుక పిల్ల తన గూడును వదిలి మిత్రులతో బయటకు వెళ్ళింది. తల్లి వచ్చి చూస్తే పిచ్చుక పిల్ల కనిపించలేదు. ఈ ఎండకు నా బిడ్డ ఎక్కడకు వెళ్ళిందో అని కంగారు పడుతూ అంతా వెదికింది. కాని పిచ్చుకపిల్ల కనిపించలేదు. పిచ్చుక పిల్ల తన మిత్రులతో పగలంతా తిరిగి తిరిగి సాయంత్రానికి ఇంటికి చేరింది. పగలంతా ఎండకు తిరగటం వల్ల వడదెబ్బ తగిలి ముడుచుకు పోయింది.

అప్పుడు తల్లి తన బిడ్డకు సపర్యలు చేస్తూ ఇలా అంది : 'నేను చెప్పాను కదా! బయటకు వెళ్ళొద్దని. అయినా ఎందుకు వెళ్ళావమ్మా? ఇప్పుడు చూడు ఎంత బాధపడుతున్నావో' అంటూ కన్నీళ్ళు పెట్టుకుంది. 'క్షమించమ్మా! ఇంకెప్పుడూ నీమాటను పెడచెవిన పెట్టను' అని తన తల్లి ఒడిలో తల వాల్చింది పిచ్చుక పిల్ల.

- కె. హిమసాయి
9వ తరగతి,
ఎం.తిమ్మాపురం ఆదర్శ పాఠశాల,
మహానంది (మం), నంద్యాల జిల్లా.






దటీజ్...మనోజ్

నా పేరు మనోజ్
నేనుండేది విలేజ్
మా నాన్నకు ఉందో బజాజ్
మా ఇంట్లో ఉందో గోద్రేజ్
నా ఫ్రెండ్ పేరు స్వరాజ్
నేను చేశానో కొలాజ్
పేపర్ కటింగ్ ఇటీజ్
దటీజ్ ... మనోజ్

- మనోజ్,
4వతరగతి
ఎంపిపి పాఠశాల, మర్తాడు
మెయిన్,
గార్లదిన్న మండలం,
అనంతపురం.





బొమ్మరిల్లు

హాయ్ ఫ్రెండ్స్..వేసవిలో ఖాళీగా ఉండకుండా నేను బొమ్మలు గీస్తున్నాను. ఏ బొమ్మనైనా చూస్తే ఇట్టే గీయగలను. ప్రతిరోజూ రెండు బొమ్మలు గీస్తున్నాను. మరి మీరు కూడా వేసవి సెలవుల్లో ఎలా గడుపుతున్నారో వేసవి విడిదిలో చెబుతారు కదూ!




- షేక్ అయాన్,
ఎల్‌కేజీ,
లక్ష్మీపురం,
గుంటూరు.



'నా' గేయం

నా ఫ్రెండు పేరు శీనా
వెళ్ళాడు కోనా
తెచ్చాడు తేనా
తిన్నాడు చానా





- శ్రీనాథ్,
4వతరగతి, ఎంపిపి పాఠశాల,
మర్తాడు మెయిన్, గార్లదిన్న (మం).





మురపాక జ్ఞాన సాయి దీప్, పరిణీత దీప్తి

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

మీ కోసం

బట్టలపై పడిన పెన్ను గీతలు పోవాలంటే నెయిల్ పాలిష్ రిమూవర్‌ను మరకలపై వేసి టూత్‌బ్రష్‌తో రుద్దాలి.



జీవన సౌరభం

దృఢ సంకల్పం, తరగని ఆత్మవిశ్వాసం, బలమైన కోరిక ఉన్నచోట విజయం తప్పక వచ్చి తీరుతుంది.

JEEVANA

జీవన the family

డాట్ మండల కళతో



ఇంటి ముందు చుక్కలు పెట్టి వేసే ముగ్గు చూడటానికి ఎంతో ముచ్చటగా ఉంటుంది. చుక్కలతో ముడిపడి గీసే కళాఖండాలు చాలా అరుదుగా కనిపిస్తాయి. యాష్ సుందరం అటువంటి వృత్తం ఆకారంతో ముడిపడిన కళారూపాలు సృష్టించడంలో దిట్ట. ఇవి చూడటానికి ఎంతో అద్భుతంగా ఉండి, ఇంటికి శోభనిస్తాయి. పాత వస్తువులకే అందాన్ని తీసుకొస్తాయి. అందులోనూ చుక్కల పరిమాణాలు మార్చుతూ యష్ అనేక కళారూపాలను గీశారు. అనారోగ్య సమస్య నుంచి బయట పడేందుకు మొదలుపెట్టిన ఈ కళలో ఆమె నైపుణ్యం సాధించారు. ఓ వైపు ఉద్యోగం చేస్తూనే ఈ కళపై అభిరుచి పెంచుకున్నారు. వీటిని చూసి నెటిజెన్స్ ఫిదా అయ్యి కొనుగోలు చేస్తున్నారు.

తమిళనాడుకు చెందిన యష్ సుందరం పదేళ్ల క్రితం ఆస్ట్రేలియాలో స్థిరపడ్డారు. ఆమెకు అన్ని రకాల వంటలూ వచ్చు. దాంతో ఓ యూట్యూబ్ ఛానలే నడుపుతున్నారు. రోజుకో కొత్తరకం వంట చేసి బ్లాగ్‌లో ఉంచుతారు. అంతేకాదు; వివిధ ఫుడ్ మ్యాగజైన్‌లకు అనేక వ్యాసాలు రాశారు. తమిళంలో ఓ వంటల పుస్తకమే రచించారు. ఓ వైపు వంటలు చేస్తూనే స్థానిక ప్రభుత్వ పాఠశాల్లో వాలంటీర్‌గా 8 ఏళ్లుగా పని చేస్తున్నారు. ఈ క్రమంలో మూడేళ్ల క్రితం యాష్‌కు మడమ వ్యాధి వచ్చింది. దీన్ని నుంచి బయటపడేందుకు డాట్ మండల కళారూపాలపై దృష్టి కేంద్రీకరించారు. సంప్రదాయాల్లో సర్కిల్స్‌కు చాలా శక్తివంతమైన ప్రాముఖ్యత ఉంది. దీనికి ప్రారంభం ఉంటుంది గానీ ముగింపు ఉండదు. అటువంటి కేంద్ర బిందువు నుంచి డాట్ మండలాలను సృష్టించారు. విశ్వంలో ఉన్న అనేక చుక్కలను తన పెయింటింగ్‌లో చొప్పించేలా ఆకర్షణీయ రూపాన్ని తీసుకొచ్చారు.

ఇంట్లో ఉండే సాధనాలతో..

ఈ రకమైన పెయింటింగ్‌లో వృత్తాలే ప్రధానం. చిన్న, పెద్ద వృత్తాలను గమ్మత్తైన జ్యామితిలో



పొందుపరచాలి. చివర్లో వృత్తాలతో ముగించకుండా సృజనాత్మకంగా వంపు తిరిగిన కామాలు, ఆశ్చర్యర్థాకాలను చేర్చారు. దాంతో పెయింటింగ్ ప్రత్యేక ఆకృతిని సంతరించుకుంటుంది. వీటిని వేసేందుకు యాష్ యాక్రిలిక్ కలర్స్‌తో పాటు కొన్ని విభిన్న కలర్స్ ఎంచుకున్నారు. పెద్ద, చిన్న, మీడియం చుక్కల పరిమాణాన్ని సులభతరం చేసేలా టూత్‌పిక్‌లు, కాటన్ ఇయర్ బడ్స్, కాజల్ పెన్, ఫ్లాట్ టిప్, ఆఫ్ లిప్ బామ్ స్టిక్ సాధనాలు ఉపయోగించారు. స్వీయంగా సృజనాత్మకంగా డిజైన్లు వేశారు. ఒకేసారి రెండు బ్రెష్‌లతో పెద్ద కాన్వాస్‌పై పని చేస్తున్నప్పుడు మాత్రమే ఆమె కొంత కసరత్తు చేసేది. కొత్తవైనా, పాతవైనా వస్తువులు మరింత ఆకర్షణీయంగా ఉండేలా యాష్ ఈ వృత్తాల కళారూపాలు వేశారు. ఇవి చాలా కాలం ఉండేలా రంగుల్లో వార్నిష్, రెసిన్ ద్రవాలను కలిపేవారు. దాంతో దుమ్ము, తేమ, మచ్చలు పడకుండా పెయింటింగ్ శాశ్వతంగా ఉంటుంది. అంతేకాదు చక్కని మెరుపును ఇస్తాయి. ఈ కళారూపాలను కాన్వాస్‌లపై, బాటిల్స్‌పై, చెక్క వస్తువులపై, గాజు, కార్డ్‌బోర్డ్‌లపై వేశారు. కొన్ని నెలలకే కష్టమైన కళాకృతులను సైతం సులభంగా వేయగల నైపుణ్యం సంపాదించారు.



ఉపాధి మార్గంగా

యాష్ వేసిన ఈ పెయింటింగ్స్ మొత్తం తన సోషల్‌మీడియాలో పోస్ట్ చేయగా విశేష స్పందన వచ్చింది. తమకు ఇటువంటి కళారూపాలు కావాలంటూ స్నేహితులు, సన్నిహితుల నుంచి అభ్యర్థనలు వచ్చాయి. దాంతో ఆమె దీన్ని ఉపాధిగా మలుచుకుంది. వినియోగదారులు కోరిన విధమైన గుర్రం, ఏనుగు, పులి, చెట్లు ..వంటి బొమ్మలు కచ్చితమైన సైజుల్లో ఆకారం వేసుకుని పెయింటింగ్ చేశారు. రోజూ చూసే గడియారానికి చుట్టూ అందమైన డిజైన్ వేసి ఇస్తున్నారు. దాంతో ఉపాధితో పాటు మానసికానందం పొందుతున్నారు ఆమె.

కానీ, ఇందులోనూ సవాళ్లు ఎదుర్కొన్నారు. క్లయింట్ కోరిన విధంగా రంగులు వేయాలి. వేసిన తర్వాత చూసేందుకు బాగోపోతే పడిన శ్రమంతా వృథా. అయినా క్లయింట్ అడిగిన విధంగానే యాష్ పెయింటింగ్ చేసి ఇచ్చేవారు. మొదట్లో గుర్రం బొమ్మ తయారీ కష్టంగా అనిపించింది. అప్పుడు ఆమె బొమ్మ జ్యామితిలో వృత్తాలు చెడకుండా రూపురేఖలను పొందుపరిచింది. అది చూసిన క్లయింట్ ఆనందంతో ఎక్కువ డబ్బు ఇచ్చి కొనుగోలు చేశారు. ఒక్కో పెయింటింగ్ ఆమెకు వారం నుంచి తొమ్మిది రోజులు పడుతుంది. శ్రమకు తగ్గ ఫలితం రాకపోయినా ఆమె ఈ కళను అభిరుచిగా కొనసాగిస్తున్నారు. ఆన్‌లైన్ ద్వారా వర్క్‌షాపులు నిర్వహిస్తూ, ఔత్సాహికులకు ఈ కళలో శిక్షణ ఇస్తున్నారు.

ఒత్తిడి తగ్గించేలా ...

క్రమంగా యష్ చేసిన ఈ డాట్ మండల కళాఖండాలు ధ్యానం యొక్క చిహ్నంగా మారాయి. మానసిక రోగుల్లో దృష్టిని పెంపొందించడం, ఆందోళన, ఒత్తిడి తగ్గించే కళారూపాలుగా అక్కడక్కడ ఏర్పరచారు. ధ్యానం/ కర్ణాటక సంగీత ప్రదేశాల్లో మంచి వాతావరణం సృష్టించేలా ఉన్నాయి. కొత్తగా ఇల్లు కట్టుకున్న వారు, గదుల్లో, లివింగ్ రూమ్, బెడ్‌రూమ్‌ల్లో ఈ పెయింటింగ్స్ అమర్చుకుంటున్నారు.

వచ్చే ఐపిఎల్ ఆడతా: ధోని

ముంబయి రికార్డును సమం చేసిన చెన్నై

అహ్మదాబాద్: చెన్నై సూపర్‌కింగ్స్ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోని రిటైర్మెంట్‌పై స్పందించాడు. తాను ఫిట్‌గా ఉన్నంతకాలం ఐపిఎల్‌లో ఆడతానని, ఇప్పట్లో రిటైర్మెంట్ ఆలోచనే తన మదిలో లేదని చెప్పుకొచ్చాడు. సోమవారం జరిగిన ఐపిఎల్ సీజన్-16 ఫైనల్లో గుజరాత్‌పై సంచలన విజయం సాధించిన అనంతరం టైటిల్ అందుకొంటూ ధోనీ ఈ వ్యాఖ్యలు చేశాడు. 'ఐపిఎల్‌కు రిటైర్మెంట్ ప్రకటించడానికి ఇదే తగిన సమయమైనా.. అభిమానుల మద్దతు, వారి ప్రేమ నుంచి దూరంగా వెళ్లడానికి నా మనసు అంగీకరించడం లేదు.. మరో తొమ్మిది నెలలు కష్టపడి రాబోయే ఐపిఎల్‌లో ఆడడానికి ప్రయత్నిస్తా..' అన్నాడు. వర్షం కారణంగా 15 ఓవర్లలో 171పరుగులు చేయాల్సిన చెన్నై జట్టును రవీంద్ర జడేజా చివరి రెండు బంతులను సిక్స్, ఫోర్ కొట్టి అద్భుత విజయాన్ని అందించిన సంగతి తెలిసిందే.



ధోనికి ఐపిఎల్ టైటిల్ అందిస్తున్న బిసిసిఐ అధ్యక్షులు రోజర్ బిన్ని, సెక్రటరీ జే షా; చిత్రంలో జడేజా, అంబటి రాయుడు

ధోని రికార్డు

చెన్నై సూపర్ కింగ్స్ కెప్టెన్ ఎంఎస్ ధోనీ మరో ఘనత సాధించాడు. ఐపిఎల్‌లో 250 మ్యాచ్‌లు ఆడిన తొలి క్రికెటర్‌గా రికార్డు నెలకొల్పాడు. ఇందులో ఎక్కువగా సీఎస్‌కే తరపున ఆడిన ధోనీ.. రైజింగ్ పుణె సూపర్‌జెయింట్‌కూ ప్రాతినిధ్యం వహించాడు. ధోనీ తర్వాత రోహిత్ శర్మ(243మ్యాచ్‌లు), దినేశ్ కార్తీక్(242)ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నారు. ఇక చెన్నై జట్టు ఐదోసారి టైటిల్ అందుకొని అత్యధిక టైటిళ్ల నెగ్గిన ముంబయి పేర రికార్డును సమం చేసింది.

పోరాడినా ఫలితం దక్కలేదు: హార్దిక్

"మేం జట్టు పరంగా అద్భుతంగా ఆడాం. చివరి వరకు విజయం కోసం కష్టపడ్డాం. పోరాడిన తీరు గర్వంగా ఉంది. గెలిచినా.. ఓడినా మా జట్టు విధానం ఒకేలా ఉంటుంది. సాయి సుదర్శన్ సూపర్ బ్యాటింగ్ చేశాడు. అయితే, సీఎస్‌కే అద్భుతంగా ఆడింది. మోహిత్, రషీద్, షమీ అందరూ నాణ్యమైన బౌలింగ్ వేశారు. ఎంఎస్ ధోనీ నాయకత్వంలోని సీఎస్‌కే టైటిల్‌ను గెలవడం ఆనందంగా ఉంది. మంచి వాళ్లకు మంచే జరుగుతుంది" అని గుజరాత్ కెప్టెన్ హార్దిక్ పాండ్యా తెలిపాడు.



ఫైనల్లో ఆటగాళ్లకు దక్కిన అవార్డులు..

ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ : డెవెన్ కాన్వె
క్యాచ్ ఆఫ్ ది మ్యాచ్ : ఎంఎస్ ధోని
లాంగెస్ట్ సిక్స్ : సాయి సుదర్శన్
అత్యధిక ఫోర్లు : సాయి సుదర్శన్
మోస్ట్ వాల్యుబుల్ అసెట్ ఆఫ్ ది మ్యాచ్ : సాయి సుదర్శన్
గేమ్ ఛేంజర్ ఆఫ్ ది మ్యాచ్ : సాయి సుదర్శన్
ఎలెక్ట్రిక్ స్ట్రయికర్ ఆఫ్ ది మ్యాచ్ : అజింక్యా రహానే

ఆటగాళ్లకు దక్కిన అవార్డులు..

విజేత జట్టు(చెన్నై) : రూ.20కోట్లు
రన్నరప్(గుజరాత్) : రూ.12.5కోట్లు
అత్యుత్తమ వేదికలు : ఈడెన్ గార్డెన్స్, వాంఖడే
ఆరెంజ్ క్యాప్ : శుభ్‌మన్ గిల్(890పరుగులు)
పర్పుల్ క్యాప్: మహ్మద్ షమీ(28వికెట్లు)
ఫెయిర్ ప్లే ఆఫ్ ది సీజన్ : అజింక్యా రహానే
అత్యుత్తమ క్యాచ్ : రషీద్ ఖాన్
లాంగెస్ట్ సిక్స్: ఫాఫ్ డుప్లెసిస్(115మీ.)
అత్యధిక ఫోర్లు : శుభ్‌మన్ గిల్(84)
మోస్ట్ వాల్యుబుల్ ప్లేయర్ ఆఫ్ ది సీజన్ : శుభ్‌మన్
డ్రీమ్ లెవెన్ గేమ్ ఛేంజర్ అవార్డు : శుభ్‌మన్
సూపర్ స్ట్రయికర్ ఆఫ్ ది సీజన్ : గ్లెన్ మ్యాక్స్‌వెల్
ఎమర్జింగ్ ప్లేయర్ ఆఫ్ ది ఇయర్ అవార్డు : యశస్వి జైస్వాల్



చెప్పుకోవడానికే గొప్పలు.. వర్షం పడితే స్పాంజ్‌లు, హెయిర్ డ్రైలే..

ఐపిఎల్ ఫైనల్ మ్యాచ్ నిర్వహణలో బిసిసిఐ వైఫల్యం కొట్టొచ్చినట్లు కనిపించింది. వర్షం ముప్పు ఉన్న నేపథ్యంలో బోర్డు ఎలాంటి ముందస్తు జాగ్రత్తలు తీసుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రపంచ క్రికెట్‌లోనే అత్యంత ధనిక బోర్డుగా గొప్పలు చెప్పుకునే భారత క్రికెట్ కంట్రోల్‌బోర్డు(బిసిసిఐ).. ఐపిఎల్ ఫైనల్ జరిగిన అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోడీ క్రికెట్ స్టేడియంకు ముందస్తు జాగ్రత్తల్లో ఘోరంగా విఫలమైంది. భారీ వర్షం కురిసి నిలిచిన తర్వాత మైదానాన్ని సిద్ధం చేసేందుకు గ్రౌండ్‌మన్లు ఇలా మైదానాన్ని సిద్ధం చేయడం పెద్దఎత్తున విమర్శలకు దారితీసింది.

క్వాలిఫయర్ చేతిలో మెద్వదేవ్ చిత్తు

రూడ్, జ్వెరేవ్ ముందుకు.. ఫ్రెంచ్ ఓపెన్



సే-బోల్ట్ వైల్డ్

పారిస్: ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ పురుషుల సింగిల్స్‌లో పెను సంచలనం నమోదైంది. టైటిల్ ఫేవరెట్, 2వ సీడ్, రష్యాకు చెందిన డానియేల్ మెద్వదేవ్ క్వాలిఫయర్ చేతిలో ఓటమిపాలయ్యాడు. మంగళవారం జరిగిన తొలిరౌండ్ పోటీలో మెద్వదేవ్ 6-7(5-7), 7-6(8-6), 6-2, 3-6, 4-6తో సే-బోల్ట్ వైల్డ్(దక్షిణాఫ్రికా) చేతిలో ఓడాడు. ఇక కాస్పర్ రూడ్, జర్మనీకి చెందిన ఆండీ జ్వెరేవ్ రెండోరౌండ్‌లోకి ప్రవేశించారు. 22వ సీడ్ జ్వెరేవ్ 7-6(8-6), 7-6(7-5), 6-1తో హ్యారిస్(దక్షిణాఫ్రికా)పై, 4వ సీడ్ రూడ్(నార్వే) 6-4, 6-3, 6-2తో క్వాలిఫయర్ యేమర్(స్వీడన్)పై సునాయాసంగా గెలుపొందారు. ఇతర పోటీల్లో 27వ సీడ్, జపాన్‌కు చెందిన నిషోకా 1-6, 3-6, 6-4, 6-3, 6-3తో వోల్ఫ్(అమెరికా)పై ఐదుసెట్ల హోరాహోరీ పోరులో నెగ్గాడు.

జబీర్ శుభారంభం


మహిళల సింగిల్స్‌లో 2వ సీడ్, అన్స్ జబీర్(ట్యునీషియా) శుభారంభం చేసింది. జబీర్ 6-4, 6-1తో బ్రూంజోటీ(ఫ్రాన్స్)పై విజయం సాధించింది. మరో పోటీలో 6వ సీడ్ కోకా గాఫ్(అమెరికా) 3-6, 6-1, 6-2తో స్పెయిన్‌కు చెందిన మసరోవాపై చెమటోడ్చి నెగ్గింది.



త్వరలో 'భోళా శంకర్' మ్యూజిక్

మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న ప్రాజెక్ట్ 'భోళా శంకర్'. వేదాళమ్ రీమేక్‌గా తెరకెక్కుతుంది. మెహర్ రమేశ్ డైరెక్ట్ చేస్తున్న ఈ చిత్రంలో తమన్నా ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తుండగా..కీర్తిసురేశ్ చిరంజీవి సోదరి పాత్రలో మెరవనుంది. ఇప్పటికే విడుదల చేసిన లుక్ ఒకటి ఆన్‌లైన్‌లో హల్ చల్ చేస్తోంది. తాజాగా మేకర్స్ గెట్ రెడీ.. భోళా మ్యూజికల్ మేనియా త్వరలో' అంటూ పోస్టర్ ఒకటి విడుదల చేశారు. మహతి స్వరసాగర్ స్వరపరచిన సాంగ్‌లో చిరంజీవి స్టిల్ ఫొటోను సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఈ చిత్రాన్ని ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్, క్రియేటివ్ కమర్షియల్స్ సంయుక్తంగా తెరకెక్కిస్తు న్నాయి. ఈ మూవీలో మురళీ శర్మ, రఘుబాబు, రావు రమేష్, వెన్నెల కిశోర్, పీ రవి శంకర్, ప్రగతి, శ్రీముఖి, బిత్తిరి సత్తి, రష్మి గౌతమ్, ఉత్తేజ్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రాన్ని ఆగస్టు 11న థియేటర్లలో విడుదల చేయనున్నట్టు ప్రకటించారు మేకర్స్.


'అఖండ' బ్యానర్ నెక్ట్స్ ప్రాజెక్టు



'అఖండ' సినిమా నిర్మాణం ద్వారా ఇండస్ట్రీకి పరిచయమైన ద్వారకా క్రియేషన్స్ నుండి నెక్ట్స్ ప్రాజెక్టు ప్రకటించారు. ఈ చిత్రాన్ని ప్రముఖ దర్శకుడు శ్రీకాంత్ అడ్డాల తెరకెక్కించనున్నారు. ఈ విషయాన్ని తెలుపుతూ ఓ పోస్టర్ కూడా విడుదల చేశారు. చిత్ర టైటిల్, హీరో వంటి ఇతర వివరాలు జూన్ 2న తెలపనున్నట్లు స్పష్టం చేశారు.

అనాథల ఆపద్బాంధవుడు..

లాక్‌డౌన్ సమయంలో వేలాది మందికి అండగా నిలిచారు సోనూసూద్. వలస కార్మికులు, పేదలు, విదేశాల్లో ఉండిపోయిన ఎంతోమంది 'ఆపదలో ఉన్నాం' అని చిన్న సందేశం ఇస్తే చాలు; 'నేనున్నా' అంటూ సహకారం అందించి రియల్ హీరో అనిపించుకున్నారు. తాజాగా సోనూసూద్ మరోసారి తన దాతృత్వాన్ని చాటుకున్నారు. అనాథ పిల్లలకు సాయం చేయడానికి ముందుకొచ్చారు. బీహార్‌కు చెందిన ఓ యువకుడు సోనూసూద్‌పై ఉన్న అభిమానంతో అనాథ పిల్లల కోసం ఓ ఇంటర్నేషనల్ స్కూల్ ప్రారంభించాడు. ఇప్పటికే అందులో 100 మంది పిల్లలు ఉన్నారు. ఈ విషయం తెలుసుకున్న సోనూసూద్ అక్కడికి వెళ్లి ఆ యువకుడితో మాట్లాడారు. ఆయనతో చర్చించిన తర్వాత.. పిల్లలకు మెరుగైన వసతి, విద్య, ఆహారం అందించడానికి కావాల్సిన సాయం అందించారు.



Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68